www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 28-9-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 164 | విజయవాడ సిటీ**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 2.50 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆశ్లేష తె. 3.38 తదుపరి మఖ; వర్జ్యం: మ. 3.21-5.06; దుర్ముహూర్తం: ఉ. 6.08-7.43; అమృతఘడియలు: రా. 1.52-3.38; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.02

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





అబ్బురపరచే ప్రారంభోత్సవ ఆఫర్లు

- కస్తూరి లిచి ₹99 మాత్రమే
- షిఫాన్ ₹149 మాత్రమే
- మార్బుల్ ₹159 మాత్రమే
- మ్యాజిక్ సిల్క్ ₹169 మాత్రమే
- ఏ1 క్రిస్టల్ ₹175 మాత్రమే
- జాక్‌పాట్ ₹189 మాత్రమే
- గరిమా జార్జెట్ or స్టార్ లేడి ₹199 మాత్రమే
- లినెన్ కాటన్ or చెర్రీ క్రేప్ ₹225 మాత్రమే
- బ్రాసో ₹249 మాత్రమే
- డోలా సీక్వెల్ వర్క్ or కష్మీరి బ్యూటి ₹275 మాత్రమే
- డిజిటల్ రాణి or సుర్యాణి వర్క్ బ్లౌజ్ ₹299 మాత్రమే
- అల్వీరా సిల్క్ or రాధిక ₹325 మాత్రమే
- డిజిటల్ రోమా or కేడ్బరీ ₹349 మాత్రమే
- క్రిస్టల్ వర్క్ ₹375 మాత్రమే
- శిల్పకళా కేటలాగ్ శారీ or గంగా పట్టు ₹399 మాత్రమే
- దీప్‌జ్యోతి కేటలాగ్ ₹425 మాత్రమే
- రాయల్ బెంటెక్స్ or బెనారస్ పట్టు ₹449 మాత్రమే
- ఎఫ్4 కేటలాగ్ శారీ ₹475 మాత్రమే
- వాటికా కేటలాగ్ శారీ or సాఫ్ట్ డిజిటల్ ₹499 మాత్రమే
- ఫ్యాన్సీ ఆర్గానిక్ ₹549 మాత్రమే
- బర్బెర్రీ ₹599 మాత్రమే
- దీప్‌జ్యోతి కేటలాగ్ ₹425 మాత్రమే
- ఇషానీ సిల్క్ or కాయిల్ ప్రింట్ ₹699 మాత్రమే
- ఫియోనా సిల్క్ or కంచి ఎంబోస్ ₹749 మాత్రమే
- కోల్‌కతా వర్క్ శారీ ₹799 మాత్రమే
- ఎమరాల్డ్ సిల్క్ ₹849 మాత్రమే
- పడియా పట్టు or ప్రియమణి పట్టు ₹899 మాత్రమే
- ఆల్బమ్ కాటన్ ₹999 మాత్రమే
- మల్బరీ సిల్క్ ₹1099 మాత్రమే
- మిని కుప్పాడం ₹1199 మాత్రమే
- టిష్యు కుప్పాడం ₹1299 మాత్రమే
- సీకో శారీ ₹1399 మాత్రమే
- దేవికాపురం పట్టు ~~₹2999~~ ₹1499 మాత్రమే
- ధర్మవరం పట్టు ~~₹3199~~ ₹1599 మాత్రమే
- పడియా పట్టు ~~₹3398~~ ₹1699 మాత్రమే
- ఆర్ని జరీ బ్రోకేడ్ ~~₹3799~~ ₹1799 మాత్రమే
- కంచి టిష్యు పట్టు ~~₹3599~~ ₹1899 మాత్రమే
- మీనా పట్టు ~~₹3999~~ ₹1999 మాత్రమే
- జరీ బ్రోకేడ్ ~~₹4999~~ ₹2499 మాత్రమే
- 1 లెగ్గింగ్స్ ₹99 మాత్రమే
- 1 చున్నీ ₹99 మాత్రమే
- 1 బ్రాండెడ్ టి-షర్ట్స్ ₹99 మాత్రమే
- 2 షార్ట్స్ ₹499 మాత్రమే
- 2 ట్రాక్ ప్యాంట్స్ ₹555 మాత్రమే
- 3 బ్రాండెడ్ ఫార్మల్ ట్రౌజర్స్ ₹999 మాత్రమే
- 1 కుర్తీ ₹99 మాత్రమే
- 2 పలాజో బాటమ్స్ ₹299 మాత్రమే
- 1 పలాజో సూట్ దుపట్టాతో ₹333 మాత్రమే
- 2 నైటీస్ ₹350 మాత్రమే
- 1 సల్వార్ సూట్స్ ₹444 మాత్రమే
- 3 బ్రాండెడ్ కాటన్ ట్రౌజర్స్ ₹999 మాత్రమే
- 2 ఫ్యాషన్ జీన్స్ ₹999 మాత్రమే
- 6 బ్రాండెడ్ క్యాజువల్ షర్ట్స్ ₹999 మాత్రమే
- 1 బ్లేజర్ ₹999 మాత్రమే
- 1 డిజిటల్ ప్రింట్ స్ట్రెయిట్ కట్ సూట్స్ ₹555 మాత్రమే
- 2 డ్రెస్ మెటీరియల్ ₹599 మాత్రమే
- 1 ఫ్యాన్సీ క్రాప్ టాప్స్ ₹777 మాత్రమే
- 1 షర్ట్ బిట్ ₹99 మాత్రమే
- 1 ప్యాంట్ బిట్ ₹99 మాత్రమే
- 2 GWALIOR SUITING కాంబో ప్యాక్ ₹666 మాత్రమే
- 1 గర్ల్స్ టాప్స్ ₹99 మాత్రమే
- 1 గర్ల్స్ పలాజో ₹99 మాత్రమే
- 1 గర్ల్స్ స్కర్ట్స్ ₹99 మాత్రమే
- 1 బాయ్స్ షార్ట్స్ ₹99 మాత్రమే
- 2 బాయ్స్ టి-షర్ట్స్ ₹299 మాత్రమే
- 2 బాయ్స్ ట్రాక్ ప్యాంట్స్ ₹444 మాత్రమే
- 2 బాయ్స్ షర్ట్స్ ₹444 మాత్రమే
- 2 గర్ల్స్ లాంగ్ ఫ్రాక్స్ ₹1499 మాత్రమే
- 2 గర్ల్స్ టి-షర్ట్స్ ₹333 మాత్రమే
- 2 గర్ల్స్ ట్రాక్ ప్యాంట్స్ ₹399 మాత్రమే
- 2 గర్ల్స్ జెగ్గింగ్స్ ₹444 మాత్రమే
- 2 గర్ల్స్ నైట్ సూట్స్ ₹555 మాత్రమే
- 2 బాబా సూట్స్ ₹499 మాత్రమే
- 2 బాయ్స్ నైట్ సూట్స్ ₹555 మాత్రమే
- 2 బాయ్స్ జీన్స్ ₹888 మాత్రమే
- 1 లుంగీ ₹99 మాత్రమే
- 2 టవల్స్ ₹99 మాత్రమే
- 1 బెడ్ షీట్ ₹99 మాత్రమే
- 4 పిల్లో కవర్స్ ₹99 మాత్రమే
- 4 డోర్ మ్యాట్స్ ₹99 మాత్రమే

కాస్ట్ టు కాస్ట్ సేల్

ది చెన్నయ్ షాపింగ్ మాల్ ®

సువిశాలమైన **పార్కింగ్** సౌకర్యం

లెక్కకు మించి **వెరైటీలు** అతి తక్కువ ధరలు

అసామాన్యమైన **సరికొత్త** షాపింగ్ అనుభూతి

ఎం.జి. రోడ్, విజయవాడ

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 28-9-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

కర్ణాటక సీఎంపై లోకాయుక్తలో కేసు

ఏ1గా ముఖ్యమంత్రి, ఏ2గా ఆయన భార్య పార్వతి, ఏ3గా బావమరిది

ట్రస్టు పేరిట భూ కుంభకోణం.. ఖర్గే కుటుంబంపై ఫిర్యాదు

నేడు ఆయన.. రేపు ఎవరో!

సీఎం ఎవరైనా పార్టీనే ముఖ్యం

2

సిద్దరామయ్య భవితవ్యంపై ఖర్గే నర్మగర్భ వ్యాఖ్యలు



ఏమైంది జగనా?

లాజిక్‌లు మరిచి తికమక మాటలు

దేశాన్నీ, మతాన్నీ తప్పుపడుతున్న జగన్

'సెక్యులర్'కు తన సొంత భాష్యం

మతం అడుగుతారా అని ఆక్రోశం

ప్రార్థనా మందిరాలు 'సెక్యులర్' ఎలా?

గుళ్లకు వెళ్తుంటే అడ్డుకున్నది తమరు కాదా?

రాజధాని రైతులను ముప్పుతిప్పలు పెట్టలేదా?

కల్తీ నెయ్యిపైనా అదే వక్ర భాష్యం

ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదికలంటే చులకనా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తికమకలో పడ్డారు. మకతికగా మాట్లాడారు. ఏం చెప్పాలనుకున్నారో తెలియదుకానీ... ఏదేదో చెప్పేశారు. 'ఇదేం దేశం... ఇదేం సెక్యులరిజం... ఇదేం హిందూయిజం' అంటూ దేశాన్నీ, మతాన్నీ తప్పుపట్టారు. లడ్డూ వివాదం నేపథ్యంలో పంతం కొద్దీ తిరుమల పర్యటన పెట్టుకున్న ఆయన... దానిని రద్దు చేసుకుని శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఎంపిక చేసుకున్న మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యి కల్తీతో తనకు సంబంధం లేదని చెప్పుకొంటే సరిపోయేది. కానీ... 'కల్తీ'ని సమర్థించుకునేందుకు నానా తిప్పలు పడ్డారు. పైగా... సున్నితమైన మత సంప్రదాయాలు, ఆలయ నిబంధనలను తప్పుపట్టేలా మాట్లాడారు. "దేవాలయాలకు వెళ్లే వాళ్లను మతం అడగడమా? మనం ఎలాంటి దేశంలో నివసిస్తున్నాం? ఇదేం

మిగతా 11వ పేజీలో...

ఇదేం దేశం.. ఇదేం హిందూయిజం?

దర్శనానికి వెళ్తే డిక్లరేషన్ అడుగుతారా!?.. ఎలాంటి లౌకిక వాదమిది?

నాలుగ్గోడల మధ్య బైబిల్ చదువుతా.. బయట హిందూ, ముస్లిం మతాలను గౌరవిస్తా

మాజీ సీఎంనైన నన్నే మతమడిగితే సామాన్యులు, ఎస్సీ, ఎస్టీల పరిస్థితేంటి?

నా మతం మానవత్వం అని రాసుకోండి.. లడ్డూపై బాబువన్నీ అబద్ధాలే!

దానిని డైవర్ట్ చేయడానికే 'డిక్లరేషన్'.. తిరుమలలో కల్తీ నెయ్యి వాడలేదు: జగన్



మీడియాతో మాట్లాడుతున్న జగన్


వెంకన్నపై విశ్వాసం లేదు!

తేల్చి చెప్పిన వైఎస్ జగన్

డిక్లరేషన్ ఇచ్చేందుకు అహం అడ్డు

అదే నెపంతో తిరుమల పర్యటన రద్దు

తనను అడ్డుకున్నారంటూ గగ్గోలు



తాను సీఎంగా ఉండగా డిక్లరేషన్ అడగలేదని జగన్ వాదించడం సరికాదు. నువ్వు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నావు కాబట్టి అడగలేదు. బయట ఎక్కడి నుంచో నువ్వు తెచ్చిపెట్టిన అధికారి అక్కడ ఉన్నాడు కాబట్టి ఆ రోజు నిన్ను అడగలేదు.

ఈ వ్యక్తి కొలంబియా ఎస్కోబార్ వంటివాడని గతంలోనే చెప్పాను. ఇప్పటివరకూ చేసిన పనులన్నీ అతడి మాదిరిగానే ఉన్నాయి. భవిష్యత్‌లో చేసేవి కూడా అలాగే ఉంటాయి.

- సీఎం చంద్రబాబు

వెళ్లొద్దని మేం చెప్పామా?

సాకులు వెతుక్కుని జగనే తిరుమల వెళ్లకపోతే మేమేం చేస్తాం: చంద్రబాబు

ఆయనకు నోటీసులిస్తే చూపించమనండి

అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెడతారా?

డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే మానేశారు

నాడు ఇవ్వలేదు కాబట్టి నేడు ఇవ్వననడం పద్ధతా?

ఒకసారి ధిక్కరించామని మళ్లీ మళ్లీ చేస్తారా?

సంప్రదాయాలను ఎవరైనా పాటించాల్సిందే

పాటించనంటూ రౌడీయిజం చేస్తారా?

నెయ్యిలో కల్తీ నిజమని ల్యాబ్ తేల్చింది

దానిని మేం బయటపెట్టకుండా..

వేరే విధంగా బయటకు వస్తే పరిస్థితేంటి?

దేవుడు మమ్మల్ని క్షమిస్తాడా: సీఎం

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెళ్లవద్దని మాజీ సీఎం జగన్‌కు తామెవరం చెప్పలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆయనే సాకులు వెతుక్కుని వెళ్లకపోతే తామేం చేస్తామని ప్రశ్నించారు. తాను ఆగిపోయి ఆ నెపం మరొకరి మీద వేయాలని చూస్తే మౌనంగా వింటూ ఉండలేమని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తిరుమల పర్యటనకు సంబంధించి జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'స్వామిపై భక్తి ఉన్నవారు ఎవరైనా తిరుమలకు వెళ్లవచ్చు. వేరే మతాల వారు వెళ్లాలనుకుంటే అక్కడి ఆచార సంప్రదాయాలు పాటిస్తూ నిశ్చింతగా

మిగతా 11వ పేజీలో...

లడ్డూ వివాదాన్ని 'సుప్రీం' సుమోటోగా

విచారణకు స్వీకరించాలి

సీజేఐకి షర్మిల లేఖ

11



అధికార, ప్రతిపక్ష పార్టీల శైలి మత ఘర్షణలకు ఆజ్యం పోసేలా ఉందని మండిపాటు



రక్షణ శాఖ కమిటీలో

రాహుల్

కమ్యూనికేషన్ల కమిటీలో కంగన, మహువా

2

కొత్తగా 24 స్థాయీ సంఘాలు

కమిటీల్లో పలువురు తెలుగు ఎంపీలకు చోటు

గృహ, పట్టణ కమిటీ చైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డి

రైల్వే సారథిగా సీఎం రమేశ్



3

ఉత్తమ పర్యాటక గ్రామంగా

అహోబిలం



'కుంకీ'లు వచ్చేస్తున్నాయ్!

12

దసరా తర్వాత ఏపీకి 4 ఏనుగులు

ఏపీ-కర్ణాటక మధ్య ఒప్పందం

వీటితో ఏనుగుల దాడులకు చెక్

మూఢనమ్మకంతో

బాలుడిని బలిచ్చారు

యూపీలోని ఓ స్కూల్లో దుర్మార్గం

హాస్టల్ నుంచి కిడ్నాప్.. బడి వద్ద హత్య.. స్కూలు బాగా నడవాలనే!

యజమాని, డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఇద్దరు ఉపాధ్యాయుల అరెస్టు

అంతకుముందు ఓ తొమ్మిదేళ్ల బాలుడిని బలిచ్చేందుకు యత్నం

2

నాడు వద్దు.. నేడు ముద్దు

ఆర్డీవో పోస్టింగ్‌ల్లో వింత పోకడ

2022 డిప్యూటీ కలెక్టర్ల నియామకాలపై నాడు ప్రతిపక్షంలో టీడీపీ ఆందోళన

పోస్టింగ్‌లే ఇవ్వొద్దంటూ నిరసనలు

నేడు వారికే కీలక డివిజన్లలో పోస్టింగ్‌లు

ఆ బ్యాచ్‌కు చెందిన 24 మంది నియామకం

ఇంకా శిక్షణ పూర్తికాని 2024 బ్యాచ్‌లోని 13 మందికి కూడా ఆర్డీఓలుగా పోస్టింగ్‌లు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వ హయాంలో గౌతమ్ సవాంగ్ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్‌గా ఉన్నప్పుడు గ్రూప్-1 నియామకాలు అడ్డగోలుగా చేశారని ప్రతిపక్ష హోదాలో టీడీపీ ఆందోళన చేసింది. ఉద్యోగ నియామకాల్లో అవినీతి ఏరులైపారిందని తీవ్ర ఆరోపణలు చేసింది. ఇప్పుడు ఆ పార్టీ అధికారంలోకి రాగానే వారికే పెద్దపీట వేసింది. అత్యంత కీలకమైన డివిజన్లకు ఆర్డీఓలుగా నియమించింది. ఇది రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది. గురువారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసిన ఆర్డీఓల బదిలీల ఉత్తర్వులు చూసి సీనియర్ అధికారులే విస్తుపోతున్నారు. 2022, 2024 బ్యాచ్ పీడీసీ (ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్)లను గంపగుత్తగా ఆర్డీఓలుగా నియమించారు. తీవ్ర వివాదాస్పదమైన 10/1999 బ్యాచ్ అధికారులకు

మిగతా 12వ పేజీలో...



సచివాలయాల్లో

రిజిస్ట్రేషన్లు నిలిపివేత

జగన్ హయాం నాటి వివాదాస్పద నిర్ణయం రద్దు

నాడు సచివాలయాలకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా

దీంతో ప్రమాదంలో పడిన ప్రజల ఆస్తులు

రిజిస్ట్రేషన్లలో గందరగోళం.. రాజకీయ ఒత్తిళ్లు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేసిన గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ ఏడాది ఆగస్టులోనే పక్కనపెట్టిన చంద్రబాబు ప్రభుత్వం, ఈ మేరకు శుక్రవారం జీవో విడుదల చేసింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని

మిగతా 12వ పేజీలో...



గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డిని ఏసీబీ కోర్టుకు తీసుకువెళుతున్న దృశ్యం

వెంకటరెడ్డి జైలుకు

గనుల శాఖ మాజీ డైరెక్టర్‌కు 14 రోజుల రిమాండ్

ఏడు రోజులు కస్టడీకి కోరిన ఏసీబీ

ఆరోగ్యం బాలేదు.. బెయిలివ్వండి: వెంకటరెడ్డి

ఈ నెల 30న విచారిస్తామన్న ఏసీబీ కోర్టు


వెంకటరెడ్డిపై తీవ్రమైన అభియోగాలు

రూ.2,566కోట్ల మేర వైసీపీ పెద్దలకు, ప్రైవేట్ ఏజెన్సీలకు దోచిపెట్టారన్న ఏసీబీ

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు రూ.రెండున్నర వేల కోట్లకు పైగా నష్టం కలిగించి, ఇసుక దొంగలకు సహకరించిన గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఎట్టకేలకు జైలు పాలయ్యారు. జగన్ ప్రభుత్వ హయాంలో సహజ సంపదలను దోచిపెట్టి, ఇసుక

మిగతా 12వ పేజీలో...

రిలయన్స్ ఫౌండేషన్ సాయం 20 కోట్లు



వరద బాధితుల సహాయార్థం రిలయన్స్ ఫౌండేషన్ తరఫున సీఎం చంద్రబాబుకు రూ.20 కోట్ల చెక్కు అందజేస్తున్న సంస్థ ఈడీ పీఎంఎస్ ప్రసాద్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మెంటార్ పీవీఎల్ మాధవరావు

పర్యాటకానికీ పరిశ్రమ హోదా

పర్యాటకం - శాంతి నినాదంతో ప్రత్యేక పాలసీ

ఈ సెక్టారుకూ రాయితీలు, ప్రోత్సాహకాలు

2

హోటళ్లకు రాత్రి 12 గంటల వరకు అనుమతులు

రాష్ట్రంలో 4 ఐకానిక్ పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి

ప్రపంచ పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు

విశాఖ ఉక్కు

సెయిల్‌లో విలీనం!

అవకాశాలను పరిశీలిస్తున్న కేంద్రం.. విలీనంతో రెంటికీ లాభమే

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో (సెయిల్) విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. నిజానికి ఇదే డిమాండ్‌తో ఉద్యోగ, కార్మిక సంఘాలు చాలాకాలంగా ఉద్యమిస్తున్నాయి. అలా చేస్తే రెండు వర్గాలకూ లాభమేనని సూచిస్తున్నాయి. అయితే, ప్రైవేటీకరణ అంటూ మూడేళ్లుగా కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ రకరకాల ప్రయోగాలు చేసింది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నడిరోడ్డున నిలబెట్టింది. అప్పటినుంచీ కార్మిక సంఘాలు పట్టువదలకుండా పోరాడుతున్నాయి. నిరవధిక నిరాహార దీక్షలతో స్టీల్ ప్లాంటును నిలబెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నాయి. వీటన్నింటి ఫలితంగా విశాఖ ఉక్కు సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ముందుకు వచ్చింది.

ప్లాంట్‌కు తొలగనున్న ముడిసరుకు, ఆర్థిక సంబంధ ఇబ్బందులు


పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తికి చాన్స్

ప్రైవేటీకరణ ముప్పు తప్పినట్టే!

మరోవైపు మరింత విస్తరణకు సెయిల్‌కూ అవకాశం

దక్షిణాది మార్కెట్‌పై గట్టి పట్టు

కార్మిక సంఘాలదీ విలీనం మాటే



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అటు ముడిసరుకు కొరత.. ఇటు ఆర్థిక ఇబ్బందులతో విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్‌ఐఎన్ఎల్) తీవ్ర సంక్షోభంలో ఉంది. మూడు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉండగా, ముడి పదార్థాల కొరత కారణంగా ఒక బ్లాస్ట్ ఫర్నేసునే నడుపుతూ రోజుకు 4 వేల టన్నులకు మించి ఉత్పత్తి చేయడం లేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా యాజమాన్యం ముడి పదార్థాలను సమీకరించుకోలేకపోతోంది. విదేశాల నుంచి బొగ్గును నౌకల ద్వారా తెప్పించుకుంటూ వాటికి రవాణా చార్జీలు చెల్లించలేక ఆపసోపాలు

మిగతా 2వ పేజీలో...

సెయిల్‌లో విలీనం!

(మొదటి పేజీ తరువాయి)

పడుతోంది. ఉక్కు తయారీకి ప్రధానమైన ముడి ఇనుము కోసం నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)పై ఆధార పడుతోంది. రెండు సంస్థల మధ్య ఒప్పందం ఉన్నా ఆ మేరకు ముడి ఇనుము ఇవ్వకపోవడం వల్ల ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. ఏడాదికి 32లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం నుంచి 73 లక్షల టన్నులకు పెంపునకు విస్తరణ పనులు చేపట్టడంతో, దాదాపు రూ.24 వేల కోట్ల మొత్తం వివిధ సంస్థల నుంచి విశాఖ ఉక్కు రుణాలుగా తీసుకుంది. వీటికి నెలకు రూ.150 కోట్లు వడ్డీగా చెల్లిస్తోంది. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపితే కొద్దికాలంలోనే అప్పులు తీర్చేసి లాభాలబాట పట్టే అవకాశం ఉంది. సెయిల్‌కు 200 ఏళ్లకు సరిపడా ముడి ఇనుము గనులు ఉన్నాయి. అన్ని ప్లాంట్లకు అవసరమైన కోల్‌ను విదేశాల నుంచి పెద్దఎత్తున కొనుగోలు చేయడం వల్ల తక్కువ రేటుకు వస్తోంది. ఇప్పుడు విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తే..ఆర్ఐఎన్ఎల్‌కు ముడి ఇనుము సమస్య తీరిపోతుంది. బొగ్గు తక్కువ ధరకు వస్తుంది. దీనివల్ల ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకూ తగ్గుతుంది. లాభాలు ఎక్కువ వస్తాయి. దక్షిణ భారతదేశంలో సెయిల్‌కు మార్కెటింగ్ వ్యవస్థ అంత బలంగా లేదు. విశాఖలో రెండు పోర్టులు ఉండడం వల్ల ఆర్ఐఎన్ఎల్‌లో ఉత్పత్తి చేసిన స్టీల్‌ను దేశంలో ఇతర రాష్ట్రాలకు, అవసరమైతే విదేశాలకు కూడా తక్కువ రవాణా వ్యయంతో ఎగుమతి చేసుకోవచ్చు. ఆర్ఐఎన్ఎల్-సెయిల్ విలీనం రెండు సంస్థలకూ లాభదాయకమే! కాగా, 'విశాఖ ఉక్కుకు సొంత గనులు ఇచ్చే పరిస్థితి లేదు. ఆర్థిక సాయమూ అందడం లేదు. దీనిని సెయిల్‌లో విలీనం చేయడమే ఉత్తమ పరిష్కారం. మేం దీనిని స్వాగతిస్తున్నాం. దీనిని ఆమోదిస్తే అందరికీ మేలు జరుగుతుంది' అని విశాఖ ఉక్కు ఎగ్జిక్యూటివ్స్ సంఘం జనరల్ సెక్రటరీ కేవీడీ ప్రసాద్ అన్నారు.

పండుగల రద్దీ దృష్ట్యా 6 వేల ప్రత్యేక రైళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: దసరా, దీపావళి, ఛత్, దుర్గా పూజ పండుగల సందర్భంగా దాదాపు 6 వేల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం ప్రకటించారు. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే 108 రైళ్లకు అదనంగా జనరల్ కోచ్‌లను జత చేశామని తెలిపారు. అంతేకాకుండా 12,500 కోచ్‌లను మంజూరు చేశామని వివరించారు.

హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం

బీరుట్, సెప్టెంబరు 27: లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఉన్న హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై శుక్రవారం ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. హిజ్బుల్లాపై పోరాటం కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ఐక్యరాజ్య సమితిలో ప్రకటించిన కొద్ది సేపటికే ఈ దాడులు జరగడం గమనార్హం. బాంబు పేలుళ్ల ధాటికి 30 కి.మీ.దూరంలో ఉన్న ఇళ్లు కూడా కంపించాయి. ఈ దాడుల్లో కనీసం 25 మరణించినట్టు ఆరోగ్య శాఖ మంత్రి ఫిరాస్ అబియాద్ చెప్పారు.

సిద్దూపై లోకాయుక్తలో కేసు

ముడా ఇంటి స్థలాల వివాదంలో ఆయననే ఏ1

- ఏ2గా భార్య పార్వతి, ఏ3గా బావమరిది మల్లికార్జున
- ఈ రోజు సిద్దరామయ్య సీఎం.. రేపు ఉండకపోవచ్చు : ఖర్గే



బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటిస్థలాల వివాదంపై విచారణ జరిపేందుకు హైకోర్టు, ప్రజా ప్రతినిధుల కోర్టులు అనుమతులు ఇవ్వడంతో మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీఎం సిద్దరామయ్యను ఏ1గాను, ఆయన భార్య పార్వతి ఏ2గాను, బావమరిది మల్లికార్జున ఏ3గాను, భూయజమాని దేవరాజు ఏ4గానూ చేర్చారు. ఏ5గా ఇతరులను పేర్కొన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అందుకు అనుగుణంగానే ఐపీసీ, అవినీతి నియంత్రణ చట్టం, బినామీ ఆస్తుల లావాదేవీలు, భూ ఆక్రమణల నిర్బంధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ 120బి, 166, 403, 420, 426, 465, 468, 340, 351 సెక్షన్ల కింద, అవినీతి నియంత్రణ చట్టం 1988 నిబంధనలకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో మైసూరు లోకాయుక్త ఎస్పీ ఆచితూచి వ్యవహరించారు. భారతీయ న్యాయ సంహిత లేదా సీఆర్‌పీసీల కింద నమోదు, కోర్టు నిబంధనలు.. వంటి అంశాలపై లోకాయుక్త ఉన్నతాధికారులతో చర్చించేందుకు గురువారం బెంగళూరుకు వచ్చారు. సమగ్ర చర్చల అనంతరం శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూడు రోజుల మైసూరు పర్యటనకు శుక్రవారం సీఎం సిద్దరామయ్య వెళ్లిన సమయంలోనే ఎఫ్ఐఆర్ నమోదైంది. లోకాయుక్త అధికారులు దర్యాప్తు ఎప్పుడు ప్రారంభిస్తారనేది తెలియాల్సి ఉంది. మరోవైపు 'సిద్దరామయ్య ఈ రోజు సీఎంగా ఉన్నారు.. రేపు ఉండకపోవచ్చు..! ఆయనపై వ్యక్తిగతమైన ఆరోపణలు వచ్చినా బీజేపీ ఏకంగా కాంగ్రెస్‌పార్టీని డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తోంది' అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మండిపడ్డారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ఎవరైనా పార్టీ ప్రతిష్ఠ ముఖ్యమన్నారు. పార్టీ ముందు ఎవరూ గొప్ప కాదని అన్నారు. సిద్దరామయ్యపై లోకాయుక్త విచారణకు సంబంధించి మాట్లాడుతూ గోద్రా సంఘటన జరిగినప్పుడు నరేంద్రమోదీ సీఎం పదవికి రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. ముడా వివాదంలో చట్టపరంగా పోరాటం చేస్తామని అన్నారు. సిద్దరామయ్యకు పార్టీ అధిష్ఠానం మద్దతు ఎప్పుడూ ఉంటుందని, ఆయన పార్టీ ప్రతినిధి అని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో నేరుగా సీబీఐ విచారణకు అనుమతి రద్దు చేయడం కొత్తేమీ కాదని, దేవరాజ్ సీఎంగా ఉన్నప్పుడు కూడా చేశారని అన్నారు. మరోవైపు, ముడా భూ కుంభకోణం నేపథ్యంలో కర్ణాటకలో కేసుల విచారణకు సీబీఐకి అనుమతి ఉపసంహరించుకుంటూ ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది 'ప్రొఫెషనల్ దొంగ, ఓ అవినీతి పార్టీ' తీసుకున్న నిర్ణయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అభివర్ణించారు. 5 వేల కోట్ల ముడా స్కామ్‌లో సీఎం సిద్దరామయ్య సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

ఖర్గే కుటుంబంపై లోకాయుక్తకు ఫిర్యాదు

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కుటుంబం బెంగళూరులోని రెండు ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకుందని బీజేపీ నేత ఎన్ఆర్ రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. భూముల రికార్డులతో లోకాయుక్త ఐజీపీ సుబ్రమణ్యేశ్వరరావుకు శుక్రవారం ఈ ఫిర్యాదు చేశారు. ఖర్గే, ఆయన కుటుంబ సభ్యుల నేతృత్వంలోని సిద్దార్థ విహార ట్రస్టు పేరిట భారీ భూకుంభకోణానికి పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. *2014లో బీటీఎం లే అవుట్ 4వ స్టేజ్‌లో 8002 చదరపు మీటర్ల (86,133 చదరపు అడుగులు) విస్తీర్ణంగల నివాస స్థలాన్ని విద్యాసంస్థ అవసరాల పేరిట బీడీఏ నుంచి 30 ఏళ్ల సిద్దార్థ విహార ట్రస్టు సంస్థ లీజుకు పొందిందని అన్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించకుండా, 2024* మార్చిలో యలహంక వద్ద ఉండే హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్, హార్డ్‌వేర్ పార్క్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నివాసస్థలాన్ని మంజూరు చేయించుకోవడం ద్వారా న్యాయ ఉల్లంఘనకు పాల్పడ్డారని అన్నారు.

గడ్కరీ నోట మళ్లీ ప్రధాని మాట!

ముంబై, సెప్టెంబరు 27: తనకు వచ్చిన ప్రధాన మంత్రి పదవి అవకాశాల గురించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు, తర్వాత విపక్షాల నుంచి చాలా సార్లు ఈ ఆఫర్లు వచ్చాయని పునరుద్ఘాటించారు. గురువారం 'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందే గాక తర్వాత కూడా తనకు ప్రధాని పదవి ఇవ్వజూపారని చెప్పారు. జూన్‌లో ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని పదవి ఇస్తామని ఆఫర్ వచ్చిందా అని అడుగగా.. గడ్కరీ జవాబు దాటవేశారు. 'నా సిద్ధాంతంపై రాజీపడే ప్రసక్తే లేదు. అలాంటి ఆఫర్‌ను అంగీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ప్రధాని కావాలన్న లక్ష్యం నాకు లేదు' అన్నారు.

కేరళలో మరో మంకీపాక్స్ కేసు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: తమ రాష్ట్రంలో ఈ ఏడాది రెండో మంకీపాక్స్(ఎంపాక్స్) కేసు నమోదైనట్లు కేరళ ప్రకటించింది. యూఏఈ నుంచి ఎర్నాకుళం వచ్చిన 26ఏళ్ల వ్యక్తిలో ఈ వైరస్‌ను గుర్తించారు. అతడి రక్త నమూనాలు పుణెలోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కి పంపారు. దీంతో అది ప్రాణాంతక క్లేడ్ 1బీ వైరసా లేక క్లేడ్ 2బీ వైరసా అన్నది తేలనుంది. హరియాణాలోని హిస్సార్‌కు చెందిన యువకుడిలో ఈ ఏడాది తొలిసారి ఎంపాక్స్ వైరస్‌ను గుర్తించారు.

సుప్రీంకోర్టులో 'ట్వెల్త్ ఫెయిల్' ప్రదర్శన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: విధు వినోద్ చోప్రా దర్శకత్వంలో తెరకెక్కిన 'ట్వెల్త్ ఫెయిల్' సినిమాను సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ప్రదర్శించారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, ఇతర జడ్జిలు, మరో 600 మంది అధికారులు ఈ సినిమాను చూశారు. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు తమ పిల్లల్ని ప్రోత్సహించేలా న్యాయస్థాన సిబ్బందికి సినిమా స్ఫూర్తి కలిగించి ఉంటుందని జస్టిస్ చంద్రచూడ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సినిమా చూస్తుండగా తన కళ్లు చెమర్చాయన్నారు. కాగా, సుప్రీంకోర్టు కీలక తీర్పుల సారాంశాలతో కొత్త వెబ్ పేజీ ఆవిష్కృతమైంది. 'ల్యాండ్ మార్క్ జడ్జిమెంట్ సమ్మరీస్' పేరుతో సుప్రీంకోర్టే ఈపేజీని నిర్వహిస్తోంది.

స్కూల్ బాగా నడవాలని

11 ఏళ్ల బాలుడిని బలిచ్చారు!

- యూపీలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యం దుర్మార్గం

ఆగ్రా, సెప్టెంబరు 27: తమ స్కూలు అడ్మిషన్లతో కళకళలాడాలని ఆ బడిలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని బలిచ్చారు ఓ ప్రైవేటు పాఠశాల యజమానులు. యూపీలోని హత్రాస్‌లో ఈ ఘోరం వెలుగు చూసింది. డీఎల్ పబ్లిక్ స్కూల్ ఓనర్ జశోధన్ సింగ్‌కు తాంత్రిక పూజలపై విశ్వాసం మెండు. బడి విజయవంతంగా నడిచేందుకుగాను ఓ పిల్లాడిని బలివ్వాలని స్కూల్ డైరెక్టర్ అయిన తన కుమారుడు దినేశ్ భాగెల్‌కు సూచించగా సరేనన్నాడు. ఈ మేరకు జశోధన్, దినేశ్‌తో పాటు ప్రిన్సిపల్ లక్ష్మణ్ సింగ్ మరో ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి సెప్టెంబరు 23న హాస్టల్‌లో నిద్రిస్తున్న కృతార్థ్ (11) అనే బాలుడిని అపహరించారు. తాంత్రిక పూజల కోసం బడి ప్రాంగణంలోకి తీసుకెళ్లగా అక్కడ నిద్రలేచిన బాలుడు బిగ్గరగా ఏడుస్తుండటంతో గొంతు నులిమి చంపారు. తర్వాత బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, ఆస్పత్రికి తీసుకెళుతున్నామంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పగా.. వారొచ్చి దినేశ్ కారును అడ్డుకున్నారు. ఆ కారులోంచి బాలుడి మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని చంపిన చోట క్షుద్రపూజల సామగ్రి లభ్యమైంది.

నన్ను కొట్టిందని చంపేశా!

బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మహాలక్ష్మి అనే మహిళను హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో దాచిన ఘటనలో నిందితుడు ముక్తిరంజన్ ఒడిశాలోని తన స్వగ్రామంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన డెత్ నోట్‌లో నిందితుడు పలు అంశాలు పేర్కొన్నట్లు బెంగళూరు పోలీసులు తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. పెళ్లి చేసుకోవాలంటూ మహాలక్ష్మి ముక్తిరంజన్‌పై ఒత్తిడి తీసుకువచ్చింది. డబ్బులు డిమాండ్ చేయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆమె తనపై దాడి చేయడంతో, ముక్తిరంజన్ తిరిగి కొట్టాడు. మహాలక్ష్మి కిందపడి చనిపోయింది. ఆ తర్వాత నిందితుడు బ్లేడ్‌తో ఆమె శరీరాన్ని ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. ఈ విషయాలన్నీ ఇంటికి వెళ్లాక తన సోదరుడు శక్తిరంజన్‌కు చెప్పాడు. కాగా, ముక్తిరంజన్ 24న తమ ఊరి శ్మశానంలో ఉరేసుకొన్నాడు.

రక్షణశాఖ కమిటీలో ప్రతిపక్ష నేత రాహుల్

- గృహ, పట్టణ కమిటీ చైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డి, రైల్వే సారథిగా సీఎం రమేశ్
- కొత్తగా 24 పార్లమెంటరీ స్థాయీ సంఘాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రక్షణశాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి సభ్యత్వం లభించింది. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు కమ్యూనికేషన్లు, ఐటీ కమిటీలో చోటు దక్కింది. ఇదే కమిటీలో తృణమూల్‌కు చెందిన ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రాకు స్థానం లభించడం విశేషం. పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ వివరాలను శుక్రవారం లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించింది. కీలకమైన రక్షణశాఖ కమిటీ చైర్మన్‌గా రాధామోహన్ సింగ్, కమ్యూనికేషన్స్ అండ్ ఐటీ కమిటీ చైర్మన్‌గా నిశికాంత్ దూబే, హోం కమిటీ చైర్మన్‌గా రాధామోహన్ దాస్, ఆర్థిక వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా భర్తృహరి నియమితులయ్యారు. వీరందరూ అధికారపక్షమైన బీజేపీ ఎంపీలు. నాలుగు కమిటీలకు కాంగ్రెస్ సారథ్యం వహించనుంది. మహిళలు, విద్య, క్రీడా వ్యవహారాలు (దిగ్విజయ్ సింగ్), విదేశీ వ్యవహారాలు (శశిథరూర్), గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్(సప్తగిరి శంకర్ ఉలాకా), వ్యవసాయం, పశుపోషణ, ఆహార ఉత్పత్తి (చరణ్‌జిత్‌సింగ్) ఉన్నాయి. కాగా టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా, బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎంరమేశ్ రైల్వే కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు.

కమిటీల్లో తెలుగు ఎంపీలు: వాణిజ్యశాఖ- రేణుకా చౌదరి; హోంశాఖ, రక్షణ శాఖ కమిటీలు- కేశినేని శివనాథ్; మహిళలు, పిల్లలు, యువజనులు, క్రీడలు- దగ్గుబాటి పురందేశ్వరి; పరిశ్రమలు- గొల్లబాబూరావు, అరవింద్ ధర్మపురి, మల్లురవి, కొండావిశ్వేశ్వర్ రెడ్డి; సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ, అటవీ శాఖ- వంశీకృష్ణ గడ్డం, దామోదర రావు దివకొండ, పరిమళ్ నత్వానీ; రవాణా, పర్యాటక రంగం, సాంస్కృతికం- తంగెళ్ల శ్రీనివాస్, సురేశ్ షేట్కర్, విజయసాయిరెడ్డి; ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం- కడియం కావ్య, బైరెడ్డి శబరి, బి. పార్థసారథి రెడ్డి; సిబ్బంది, ప్రజాసమస్యలు, న్యాయశాఖ- ఎం.రఘునందన్‌రావు, కె. ఆర్ సురేశ్ రెడ్డి; కమ్యూనికేషన్లు, ఐటీ- ఆర్.రఘురాం రెడ్డి, ఎస్.నిరంజన్ రెడ్డి, కె.అప్పలనాయుడు; ఇంధనశాఖ- కుందూరు రఘువీర్; విదేశీ వ్యవహారాలు- డీకే అరుణ, అసదుద్దీన్ ఒవైసీ, వైఎస్ అవినాశ్ రెడ్డి, కే లక్ష్మణ్; ఆర్థిక శాఖ కమిటీ- లావు శ్రీ కృష్ణదేవరాయలు, సీఎం రమేశ్, పీవీ మిధున్ రెడ్డి, వేమిరెడ్డి, బాలశౌరి, వైవీ సుబ్బారెడ్డి; కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి- జీఎం హరీశ్ బాలయోగి, జి.లక్ష్మీనారాయణ; పెట్రోలియం, సహజవాయువు- బాలశౌరి, వద్దిరాజు రవిచంద్ర, ఎం గురుమూర్తి; రైల్వే కమిటీ- సీఎం రమేశ్, కే లక్ష్మణ్, గృహ, పట్టణ వ్యవహారాలు- మాగుంట శ్రీనివాసులు రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి; రసాయనాలు, ఎరువులు - ఈటల, దగ్గుమళ్ల, ఎం.రఘునాథ రెడ్డి, బలరాం నాయక్; బొగ్గు, గనులు, ఉక్కు - బీకే పార్థసారథి, అనిల్ కుమార్ యాదవ్ మందాడి; సామాజిక న్యాయం, సాధికారికత- గోడం నగేశ్; హోంశాఖ- తెన్నేటి కృష్ణ



విద్యాశాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి

- వచ్చే ఏడాది నుంచి ఇంటర్ పరీక్షల్లో మార్పులు
- 3 నుంచే బడులకు దసరా సెలవులు
- విద్యాశాఖ సమీక్షలో మంత్రి నారా లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ముందుగా పాఠశాల భవనాల్లో లీకులు లేకుండా చూడాలని, బెంచీలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు కచ్చితంగా ఉండాలని స్పష్టంచేశారు. అవసరాన్ని బట్టి అదనపు తరగతి గదుల నిర్మాణాలపై దృష్టిపెట్టాలన్నారు. పాఠశాల విద్యాశాఖపై శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో సమీక్ష నిర్వహించిన ఆయన ఈమేరకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసినా విద్యార్థులు ఎందుకు తగ్గిపోయారో పరిశీలించి, సమస్యలను సరిదిద్దాలన్నారు. నవంబరు 14న మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో వార్డు సభ్యుల నుంచి అందరూ పాల్గొంటారన్నారు. కొద్దిపాటి నిధులతో గ్రంథాలయాలను అభివృద్ధి చేయొచ్చని, ఫలితంగా యువతకు ఉపయోగకరంగా మారతాయని చెప్పారు. అమరావతిలో అత్యాధునిక సౌకర్యాలతో ప్రపంచ స్థాయి సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు.

11న ఉపాధ్యాయులకు సత్కారం

వరదల కారణంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించలేకపోయామని, నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి టీచర్లను సత్కరించాలని అధికారులను మంత్రి లోకేశ్ ఆదేశించారు. అక్టోబరు 3 నుంచే పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వాలన్నారు. ఇంటర్ విద్యలోనూ సమూల మార్పులు తీసుకొస్తామని మంత్రి చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్‌లో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెడతామన్నారు. జేఈఈ, నీట్, ఈఏపీసెట్ లాంటి పోటీ పరీక్షల కోసం ఇంటర్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ప్రశ్నపత్రాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, విజయరామరాజు, కృతిక శుక్లా, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యాటకానికీ పరిశ్రమ హోదా



ప్రపంచ పర్యాటక దినోత్సవ సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- పర్యాటకం - శాంతి నినాదంతో ప్రత్యేక పాలసీ
- ఈ సెక్టారుకూ రాయితీలు, ప్రోత్సాహకాలు
- హోటళ్లకు రాత్రి 12 గంటల వరకు అనుమతులు
- సంఘ విద్రోహ కార్యకలాపాలు చేస్తే అదే చివరి రోజు
- రాష్ట్రంలో నాలుగు ఐకానిక్ పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'పర్యాటక రంగాన్ని కూడా పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక హోదా కల్పిస్తాం. పారిశ్రామిక రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలు, రాయితీలు పర్యాటక రంగానికీ వర్తింపచేస్తాం' అని సీఎం చంద్రబాబు అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లాడారు. "పర్యాటక రంగంలో హోటళ్లు, ట్రావెల్ ఏజెన్సీలతో పాటు ఈ రంగం పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కదానికీ ఇక మీదట పరిశ్రమ హోదా వర్తిస్తుంది. ఇందుకోసం త్వరలో ఒక పాలసీని తీసుకొస్తాం. పర్యాటక రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న హోటళ్లకు రాత్రి 12 గంటల వరకు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశాన్ని కల్పిస్తాం. పోలీసుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు ఉండవు. ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను మంచిగా ఉపయోగించుకోవాలి. గంజాయి, డ్రగ్స్, అసాంఘిక శక్తులు పెచ్చుమీరితే మాత్రం అదే చివరి రోజు అవుతుందని గుర్తు పెట్టుకోవాలి.. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నాలుగు ఐకానిక్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. శ్రీశైలం, అఖండ గోదావరి, మహా సంగమేశ్వరం, సూర్యలంక ప్రాంతాలను ఐకానిక్ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం. పర్యాటక రంగం 20 శాతం ఉద్యోగాలు కల్పించాలి. విదేశీ యాత్రికులను ఆకట్టుకోవటంలో దేశంలో మూడో స్థానంలో నిలవాలి. దేశ జీడీపీలో పర్యాటక రంగం ద్వారా 6.5 శాతం ఆదాయం వస్తోందని, మన రాష్ట్రంలో 7.61 శాతం ఆదాయం వస్తోంది. దేశీయ పర్యాటకుల సందర్శనలో ఏపీ మూడో స్థానంలో ఉంది. విదేశీయుల సందర్శనలో 16వ స్థానంలో ఉంది. పర్యాటకానికి సంబంధించి మన రాష్ట్రంలో ఎన్నో వనరులు ఉన్నా.. మార్కెటింగ్ చేయలేకపోతున్నాం. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. నదులు, చరిత్ర, సంస్కృతి, పర్యావరణానికి అనేక ప్రత్యేకతలు, ప్రాచీన ఆలయాలు, బౌద్ధ ఆరామాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, 13 వన్య ప్రాణుల అభయారణ్యాలు, 3 జాతీయ పార్కులు, 400 సంవత్సరాల చరిత్ర కలిగిన హస్తకళలైన కొండపల్లి బొమ్మలు, కలంకారీ, లేపాక్షి వంటివి ఉన్నాయి. రాష్ట్రంలో పేరుమోసిన పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. బీచ్ టూరిజం, హెలీ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేసుకోగలిగిన వనరులు ఉన్నాయి. అరకు, లంబసింగి, కోనసీమ వంటి అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్రంలో 206 స్వచ్ఛమైన బీచ్‌లు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. విశాఖలో రుషికొండకు బ్లూ ఫ్లాగ్ వచ్చిందని, సూర్యలంక, కాకినాడ, మచిలీపట్నం బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నాం. పర్యాటకం-శాంతి అనే నినాదంతో వెళ్తాం. 'ఏ ఇజంలు లేవు. వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పించే రంగం పర్యాటకరంగమే. నైపుణ్యత కల్పిస్తే పర్యాటక రంగంలో మూడు రెట్ల ఆదాయం పెరుగుతుంది" అని అన్నారు.

తిరుమల వెళ్లే అన్యమతస్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే..

'ప్రతి ఆలయానికి, ప్రతి మతానికి కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ఉండే సంప్రదాయాలను గౌరవించటం కూడా ముఖ్యం. అన్యమతస్థులు తిరుమల వెళ్తే డిక్లరేషన్ ఇవ్వాలి. అది ఇవ్వకుండా వెళ్తే తప్పు, చట్టవిరుద్ధం. భవిష్యత్తులో ఏ దేవాలయాల్లో కూడా అపచారాలు లేకుండా చూసే బాధ్యత తీసుకుంటా' అని చంద్రబాబు అన్నారు.

పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కర్నూలు జిల్లా ఆదోనిలో రూ.100 కోట్లతో విమల రీజెన్సీ స్టార్ హోటల్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.6 కోటతో తిరుపతి జిల్లాలో చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రూ.7.32 కోట్లతో అనకాపల్లి జిల్లాలో చేపట్టే సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఏపీటీడీసీ, ఐఆర్‌సీటీసీల మధ్య సంయుక్త పర్యాటక విధానాలపై ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం జరిగింది.



విచారణలో అన్నీ అబద్ధాలే!

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సహకరించని వైసీపీ నాయకులు
- నివేదిక సిద్ధం చేసిన పోలీసులు
- రేపు సిద్ధార్థ లూథ్రాకు అందజేత

గుంటూరు, సెప్టెంబరు 27: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితులైన వైసీపీ నాయకులు పోలీసుల విచారణకు ఏమాత్రం సహకరించడం లేదు. ఏ ప్రశ్నకు కూడా సూటిగా సమాధానం చెప్పలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు పోలీసుల విచారణలో ఏ ప్రశ్న అడిగినా.. 'తెలియదు.. గుర్తు లేదు.. సంబంధం లేదు' అంటూ పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఆధారాలతో కూడిన ప్రశ్నలకు కూడా.. ఇదే సమాధానం చెప్పారు. పోలీసుల విచారణకు సహకరించాలని కోర్టులు ఆదేశించినప్పటికీ నిందితులు సహకరించకుండా కోర్టులలో పిటిషన్‌లు దాఖలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో పురోగతి, నిందితులు దర్యాప్తునకు సహకరించకపోవడం వంటి అంశాలపై పోలీసు అధికారులు తమ తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు అందజేసేందుకు ఒక మధ్యంతర నివేదిక సిద్ధం చేశారు. ఆదివారం నివేదికను ఆయనకు అందజేయనున్నారు. 2021 అక్టోబరు 19న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసి విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. నాటి వైసీపీ ప్రభుత్వం తూతూ మంత్రంగా కేసు కట్టి పక్కన పడేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కేసుపై పోలీసులు దృష్టి సారించారు. కేసు నీరుగార్చేందుకు ప్రయత్నించిన అప్పటి సీఐ, ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేశారు. ఈ కేసులో నిందితులు కోర్టుల చుట్టూ తిరుగుతూ దర్యాప్తునకు బ్రేకులు వేస్తూ వచ్చారు. జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు నిందితుల బెయిల్ పిటిషన్లు కొనసాగాయి. మొత్తం 107 మంది నిందితుల్ని గుర్తించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అందులో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌తో సహా 28 మందిని ఇప్పటివరకు అరెస్టు చేశారు.

ల్యాబ్‌ల బాటలో ఆలయాలు!

- తిరుమల లడ్డూ కల్తీ వివాదంతో కలకలం
- పరీక్షలకు అయోధ్య రామమందిర ప్రసాదం
- పూరీ జగన్నాథుడి మహాప్రసాదం తనిఖీలకు
- అర్చకుల పర్యవేక్షణలోనే నైవేద్యాలు

తయారు చేయాలి : అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర

అయోధ్య/పూరీ, సెప్టెంబరు 27: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలతో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవస్థానాల్లోనూ ఆలజడి మొదలైంది. దేవాలయాల్లో పంపిణీ చేసే ప్రసాదాల స్వచ్ఛతపై వివాదం ముసిరిన నేపథ్యంలో వివిధ ఆలయాలతో పాటు అయోధ్య రామమందిరం కూడా తన ప్రసాదం నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపింది. వాటి ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది. ఇక ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయంలో అందించే మహాప్రసాదం నాణ్యతను నిర్ధారించడానికి రెండంచెల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ జగన్నాథ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్(ఎస్‌జేటీఏ) నిర్ణయించాయి. స్వామివారికి నివేదించే పదార్థాల్లో వినియోగించే నెయ్యి తదితర పదార్థాల స్వచ్ఛతను నిర్ధారించడమే దీని లక్ష్యం. తిరుపతి లడ్డూ కల్తీ వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శుక్రవారం ప్రకటించారు. శ్రీమందిర్‌లో మహాప్రసాదానికి అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. తిరుమలలో కొన్ని అవాంఛనీయ సమస్యలు తలెత్తాయని, పూరీలో ఆటువంటి ఘటనలు జరగడం తమకు ఇష్టం లేదన్నారు. నెయ్యితో సహా అన్ని పదార్థాలను ఆలయ వంటగదిలోకి తీసుకెళ్లే ముందు ఒకసారి, మహాప్రసాదం తయారీ పూర్తయిన తర్వాత మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని వివరించారు. ప్రసాదంలో నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణకు త్వరలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలు చేపడతామని మంత్రి చెప్పారు. జగన్నాథుడి మహాప్రసాదంలో కల్తీ జరిగే అవకాశమే లేదని స్పష్టం చేశారు.

ఎన్‌డీడీబీ నివేదికపై ఉన్నతస్థాయి విచారణ

తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉపయోగించినట్లు ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చి (ఐసీఏఆర్) సభ్యుడు వేణుగోపాల్ బాదరవాడ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఐదు పేజీల లేఖ రాశారు. దేశంలోని అన్ని దేవాలయాల్లోనూ ఆవు పెరుగును కవ్వంతో చిలికి తీసిన వెన్నను కాచగా వచ్చిన నెయ్యి వాడకాన్ని తప్పనిసరి చేయాలని కోరారు.

దేవాలయాలను అపవిత్రం చేసే కుట్ర

దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న నెయ్యి నూనెల స్వచ్ఛతపై అయోధ్య రామాలయం ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అర్చకుల పర్యవేక్షణలోనే ప్రసాదాలు తయారుచేసి వాటి పవిత్రతను కాపాడాలని, అలాంటి వాటిని మాత్రమే దేవతామూర్తులకు నైవేద్యంగా సమర్పించాలని సూచించారు. ప్రముఖ దేవాలయాలు, మఠాల్లో బయటి సంస్థలు తయారుచేసే ప్రసాదాలను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో లభించే నెయ్యి, నూనెల స్వచ్ఛతపై కఠినంగా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని సత్యేంద్ర దాస్ కోరారు. ప్రసాదాలు కల్తీ చేయడం ద్వారా దేశంలోని పవిత్రమైన దేవాలయాలను అపవిత్రం చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

వందెకరాలు కబ్జా చేశాడు!

- స్థలం కోసం ప్రాణాలు తీసేందుకు వైసీపీ నేతల కుట్ర
- అక్రమ రిజర్వేషన్‌తో సర్పంచ్‌గా ఎన్నిక
- తెలంగాణ మద్యం అమ్మనీయడం లేదని వైసీపీ నేతల దాడి
- 'బుర్రా' అనుచరుల అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్నాం
- టీడీపీ గ్రీవెన్స్‌కు పోటెత్తిన వైసీపీ బాధితులు



పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శబరి

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ బాధితులు టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తారు. శుక్రవారం ఆ పార్టీ నేతలు నిర్వహించిన గ్రీవెన్స్‌లో తమ సమస్యలపై పెద్ద సంఖ్యలో వినతులు అందజేశారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు అర్జీలు స్వీకరించి, బాధితుల గోడు విన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఆదేశాలిచ్చారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలానికి చెందిన భూ బాధితులు గొట్టం శ్రీనివాసరెడ్డి, దుగ్గెం దానియేలు, వేసపోగు సాల్మన్‌రాజు, రామయ్య, పెద్దయ్యతో పాటు మరికొందరు అర్జీ ఇచ్చి, తమ పట్టా భూములతో పాటు పెద్దారవీడులో దాదాపు వందెకరాల భూమిని సర్పంచ్ కొడుకు దుగ్గెం చినభాస్కర్ కబ్జా చేశాడని, అధికారులు చర్యలు తీసుకుని, తమ భూముల్ని తమకు ఇప్పించాలని వేడుకున్నారు. తన భూవిని కొట్టేసేందుకు వైసీపీ నేతలు తనను చంపాలని చూస్తున్నారని నూర్జహాన్ అనే వ్యక్తి ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి కొడాలి నాని అండతో బీసీ-సీకి చెందిన మహిళ.. ఎస్సీ మహిళగా తప్పుడు ధ్రువీకరణ పత్రంతో సర్పంచ్‌గా కొనసాగుతుంటే.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కృష్ణా జిల్లా తమిరశ గ్రామానికి చెందిన రమణమ్మ ఫిర్యాదు చేశారు. ఒంటరి మహిళనైన తన ఇంట్లో వైసీపీ నేతలు తెలంగాణ మద్యం పెట్టి అమ్ముకోవడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నానని తనపై దాడి చేశారని పల్నాడు జిల్లా మోర్జంపాడుకు చెందిన మరియమ్మ వాపోయారు. దీనిపై తాను కేసు పెడితే తననే 10రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌రెడ్డి సహకారంతో 40ఏళ్లుగా.. తమ సాగులో ఉన్న భూమిని 22ఏ నుంచి తొలగించి, అక్రమంగా ఇతరులకు కట్టబెట్టారని, దీనిపై నిలదీసినందుకు అక్రమ కేసులు పెట్టించారని ప్రకాశం జిల్లా దాదిరెడ్డిపాలేనికి చెందిన అబ్బూరి శేషయ్య భూమిరెడ్డిపల్లికి చెందిన చావా హరికృష్ణ వాపోయారు. తమ గ్రామంలో ఇప్పటి వరకు టీడీపీ తరఫున ఎవ్వరూ పోటీ చేయలేదని, 2021లో తొలిసారి సర్పంచ్‌గా తాను పోటీచేశానన్న కక్షతో తన పొలంలో ధాన్యం, ఇంట్లో ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లారని, ఆడవారిపై దాడులు చేశారని, ధాన్యం కొన్న కొందరు డబ్బులు ఇవ్వడం లేదని, పోలీసుల చుట్టూ తిరిగినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని అనంతపురం జిల్లా కణేకల్లు మండలానికి చెందిన కురబ లాలూ మోహన్ వాపోయారు. 1,250 మంది జనాభా ఉండే తమ నాలుగు గ్రామాలను కనపర్తి పంచాయతీ నుంచి విడదీసి, కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని తాము 29 ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తుంటే.. గత టీడీపీ ప్రభుత్వంలో జీవో ఇచ్చే సమయంలో ఎన్నికల్లో లబ్ధి కోసం వైసీపీ నేతలు అడ్డుపడ్డారని తోపుపాలెం, పల్లెపాలెం, గోవిందరాజులపట్టుపుపాలెం, మేకల సోమయ్యవారి పట్టుపుపాలెం గ్రామస్థులు అర్జీ ఇచ్చారు. ఇంకా పదుల సంఖ్యలో ఫిర్యాదులొచ్చాయి. గ్రీవెన్స్‌కు వచ్చిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తమ పార్లమెంట్ పరిధిలోని ప్రజల సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు.

సమ్మె విరమించిన పీహెచ్‌సీ వైద్యులు

- ఆరోగ్యశాఖ మంత్రి హామీలపై సంతృప్తి
- నేటి నుంచి విధుల్లోకి.. ప్రభుత్వానికి లేఖ

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ కోటా కుదించవద్దని, జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు వారాలనుగా కొనసాగిస్తున్న సమ్మెను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శుక్రవారం విరమించారు. ఈమేరకు సాయంత్రం సచివాలయంలో ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును కలిసి సమ్మె విరమిస్తున్నట్లు లేఖ అందించారు. ఇన్ సర్వీస్ కోటా రిజర్వేషన్‌ను ప్రభుత్వం కుదిస్తూ జీవో 85ను విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం క్లినికల్ కోటాలో 30 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 15 శాతానికి కుదించింది. అది కూడా ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ పీహెచ్‌సీ వైద్యులు రెండు వారాల పాటు సమ్మె కొనసాగించారు. దీంతో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రెండు సార్లు, అధికారులు రెండు సార్లు వైద్యులతో చర్చలు జరిపారు. చివరిసారిగా బుధవారం జరిగిన చర్చల్లో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వైద్యులకు కొన్ని హామీలు ఇచ్చారు. జీవో 85ను సవరణ చేసేందుకు అంగీకరించారు. క్లినికల్ భాగంలో 15 శాతం తగ్గించిన సర్వీస్ కోటాను 20శాతానికి పెంచేందుకు అంగీకరించారు. సర్వీస్ కోటాను 6 బ్రాంచ్‌లకే పరిమితం కాకుండా అన్ని బ్రాంచ్‌ల్లో సర్వీస్ వైద్యులకు అవకాశం కల్పిస్తాన్నారు. దీని వల్ల 258 సీట్లు పొందే అవకాశం వైద్యులకు కల్పించారు. సర్వీస్‌లో చేరక ముందే వైద్యులు ఏదైనా బ్రాంచ్‌లో డిప్లొమా పూర్తి చేసినా పీజీకి అనుమతిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు ఇన్‌సర్వీస్‌లో రెండో పీజీ చేసుకునే వెలుసుబాటు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం పెద్ద మనసుతో ముందుకు వచ్చి జీవో 85ను సవరించడంతో పాటు ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వైద్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ సమ్మె విరమణకు నిర్ణయించారు. ఆరోగ్యశాఖ మంత్రితో జరిపిన చర్చల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ శనివారం నుంచి వైద్యులు విధుల్లోకి చేరనున్నట్లు ప్రకటించారు.

అంధులకూ దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వాలి

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా అంధులకు అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును పొన్నలూరి శ్రీనివాస ఫణి కోరారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా శారీరక దివ్యాంగులకు మాత్రమే అవకాశం వస్తోందని, అంధులకు అవకాశం కల్పించాలని కోరారు. తాను 1999 నుంచి టీడీపీలో ఉంటూ క్రియాశీలంగా వ్యవహరించానని,వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించానని చెప్పారు. అంధుల కోటాలో తనకు దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరారు. చట్ట సభల్లో ఒక శాతం రిజర్వేషన్ అంధులకు కల్పించాలని తాను నారాయణాద్రి నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రి వరకు పాద యాత్ర చేశానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కల్పించిన ఆటంకాలను అధిగమించి ఈ పాద యాత్ర చేశానని తెలిపారు. బ్రెయిలీ లిపిలో ఎంతో మంది అంధులకు విద్య బోధించానని తెలిపారు.

48 గంటల్లో పాస్‌పోర్టులు సరెండర్ చేయండి

- విచారణకు ఎప్పుడు పిలిచినా వెళ్లాలి... సహకరించాలి
- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో వైసీపీ నేతలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 48 గంటల్లో పాస్‌పోర్టులు దర్యాప్తు అధికారులకు సరెండర్ చేయాలని తెలుగుదేశం పార్టీ ఆఫీసుపై దాడి కేసులో నిందితులైన వైసీపీ నేతలను సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు విచారణకు పూర్తిగా సహకరించాలని స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీ ఆఫీసుపై దాడి చేశారనే అభియోగంతో వైసీపీ నేతలపై ఏపీ పోలీసులు కేసులు నమోదు చేశారు. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని వైసీపీ నేతలు మన్యం జగదీశ్, మద్దాలి వెంకట సుబ్బారావు, చిన్నబత్తిన వినోద్ కుమార్, సనగసెట్టి హరిబాబు, బండారు అంజనేయులు, షేక్ అమితా అలియాస్ అమితాబ్, గెల్లిపోగు రాజు అలియాస్ ఇసుక రాజు హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ వారికి నిరాశ ఎదురైంది. హైకోర్టు తీర్పును ఈ నెల 22న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ గోయల్, న్యాయవాది అల్లంకి రమేశ్, ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబరు 1కి వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఏడుగురిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. 48 గంటల్లో పాస్‌పోర్టు సరెండర్ చేయాలని, దర్యాప్తునకు సహకరించాలని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

ఉత్తమ పర్యాటక గ్రామంగా అహోబిలం

- తెలంగాణ నుంచి నిర్మల్, సోమశిల ఎంపిక



అవార్డుతో అహోబిలం దేవస్థానం అధికారి కిడాంబి సేతురామన్

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)/ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 27: ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైంది. 2024కు సంబంధించి నిర్వహించిన ఉత్తమ పర్యాటక గ్రామాల పోటీలో 8 విభాగాల్లో 36 గ్రామాలను విజేతలుగా కేంద్రం శుక్రవారం ప్రకటించింది. స్పిరిచ్యువల్-వెల్‌నెస్ విభాగంలో అహోబిలం విజేతగా నిలిచింది. తెలంగాణ నుంచి క్రాఫ్ట్ విభాగంలో నిర్మల్ (నిర్మల్ జిల్లా), స్పిరిచ్యువల్-వెల్‌నెస్ విభాగంలో సోమశిల (నాగర్‌కర్నూల్ జిల్లా) అవార్డులకు ఎంపికయ్యాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర పర్యాటక శాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. నంద్యాల ఇంటాచ్ చాప్టర్ కన్వీనర్ శివకుమార్ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి లజ్వాంతి నాయుడుతో కలసి అహోబిలం దేవస్థానం కమ్యూనికేషన్ అధికారి కిడాంబి సేతురామన్ అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో అహోబిలం ఉత్తమ పర్యాటక కేంద్రంగా అవార్డు అందుకోవడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పండుగలకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

- సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో రాష్ట్ర స్థాయి పండగలకు ప్రభుత్వ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ దేవదాయ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి. ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ఆ జిల్లాలో సీనియర్ మంత్రి లేదా దేవదాయ శాఖ మంత్రి, లేదా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంతో పాటు అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అదనపు నిధులు ఖర్చయితే దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి అనుమతిస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కంగన కుంపటి

బాలివుడ్ నటి, భారతీయ జనతాపార్టీ పార్లమెంట్ సభ్యురాలు కంగనా రనౌత్ ఇతరులమీద చేస్తున్న విమర్శల ప్రభావం ఏపాటిదో తెలియదు కానీ, తన దూకుడు వ్యాఖ్యలతో పార్టీకి మాత్రం నష్టం చేస్తున్నారు. రద్దయిన సాగుచట్టాలను తిరిగి తీసుకురావాలంటూ ఆమె చేసిన కొన్ని వరుస వ్యాఖ్యలమీద గురువారం హర్యానా బీజేపీ ప్రతినిధి విరుచుకుపడిన తీరు చూసినప్పుడు, ఈ హిమాచల్ ప్రదేశ్ మండీ ఎంపీ వ్యాఖ్యలతో హర్యానా రైతులకు బాగా మండిందని స్పష్టంగా అర్థమవుతుంది. హర్యానాని కాంగ్రెస్ వశం చేసుకోవడానికి మీరొక్కరు చాలు అని పార్టీ అభిమాన నెటిజన్లు ఆమెను వెంటాడుతున్నారు. పదిరోజుల్లో హర్యానాలో ఎన్నికలు ఉండగా ఆమె ఈ వ్యాఖ్యలతో ఏడాదిపాటు సాగిన సాగుచట్టాలవ్యతిరేక ఉద్యమాన్ని రైతులకు మళ్ళీ గుర్తుచేశారు. ఆ కాలంలో బీజేపీ పెద్దలంతా తమపట్ల ఎంత అమానుషంగా వ్యవహరించారో, ఎంతగా చులకనచేశారో రైతులకు గుర్తుకొచ్చి ఉంటుంది. మూడు వ్యవసాయచట్టాల విషయంలో పాలకుల అలనాటి కాఠిన్యానికి కంగన ఓ బలమైన ప్రతీక కనుక బీజేపీ ఇంతగా భయపడటం సహజం.

గతంలో బీజేపీ అధినాయకులు సదరు చట్టాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలకు, ఇప్పుడు ఆమె చేసిన వ్యాఖ్యలు భిన్నమైనవేమీ కావు. ఆర్థికంగా బలంగా ఉన్న కొన్ని రాష్ట్రాలకు చెందిన కొద్దిమంది రైతులు మాత్రమే ఈ మూడుచట్టాలను వ్యతిరేకిస్తున్నారని, దేశవ్యాప్త రైతుల ప్రయోజనాలను రైతుల ముసుగులో ఉన్న కొన్ని దుష్ట శక్తులు బలిపెడుతున్నాయని వారు అప్పట్లో వాదించారు. ఖలిస్తానీ తీవ్రవాదులు ఉద్యమంలో వచ్చిచేరారన్న విమర్శలు సైతం చేశారు. రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో మకాం వేసుకొని, ఎండకు ఎండుతూ వానకూ తడుస్తూ పోరాడుతూంటే సమస్త వ్యవస్థలూ సహాయ నిరాకరణ చేశాయి, విరుచుకుపడ్డాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్‌లో కేంద్రమంత్రి కుమారుడు రైతులమీదకు తన కారుపోనిచ్చి కొందరి ప్రాణాలు తీసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. రైతుల నిరసనను కేంద్రపాలకులు తమపై తిరుగుబాటుగా, భావిస్తున్నారనేందుకు ఇటువంటి అనేక ఉదాహరణలు ఆ కాలంలో ఉన్నాయి. ఆ పోరాటాన్ని అణచివేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో, ముంచుకొస్తున్న పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల్లో ఓటమి భయంతో ఆ చట్టాలను రద్దుచేస్తున్నట్టుగా ప్రభుత్వం ప్రకటించింది.

కేంద్రం వాటిని ఉపసంహరించుకున్నప్పటికీ, ఏడాదిపాటు సాగిన ఆ పోరాటాన్ని రైతులు గుర్తుంచుకుంటారు. ఆ కాలంలో నిరసనకారులను ఉగ్రవాదులుగా, దానిని ఖలిస్తానీ ఉద్యమంగా అభివర్ణించిన కంగనా రనౌత్ వంటివారిని మరీనూ. అప్పటి అవమానాలను ఎన్నేళ్ళయినా మరిచిపోరనడానికి ఈ ఏడాది జూన్‌లో కంగనమీద చండీగఢ్ విమానాశ్రయంలో ఒక సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చేసిన దాడి ఓ ఉదాహరణ. సాగుచట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఉద్యమం అలాగే కొనసాగితే భారత్‌లోనూ బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు తలెత్తేవని కంగన మరో వ్యాఖ్యచేశారు. మళ్ళీ సాగుచట్టాల ఊసుతెచ్చి, పార్టీ ఒత్తిడిమేరకు వెనక్కుతీసుకొని, ఆమె క్షమాపణలు కోరుతూండవచ్చు, అది ఆమె వ్యక్తిగత అభిప్రాయమంటూ పార్టీ కూడా చేతులుదులుపుకొనే ప్రయత్నం చేస్తుండవచ్చు. కానీ, మూడోమారు అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి జాట్లు ఇప్పటికే దూరమైనారని విశ్లేషణలు వెలువడుతున్నాయి. మహిళా మల్లయోధుల ఉద్యమం పట్ల కేంద్రప్రభుత్వ వైఖరి కూడా ఇందుకు దోహదం చేసింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కంగన వ్యాఖ్యల ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది వేరే విషయం. కానీ, గతంలో బీజేపీ ప్రతినిధి ఒకరు ఓ టీవీ చర్చలో మహమ్మద్ ప్రవక్తమీద దూకుడు వ్యాఖ్యలు చేసి దౌత్యసమస్యలు తెచ్చిపెట్టిన ఉదాహరణ కూడా ఉన్నది కనుక కంగనవంటివారిని కంట్రోల్‌లో ఉంచడం అందరికీ మంచిది.

విద్యార్థిలోకపు పోరుపతాక

విద్యార్థి ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది పీడీఎస్‌యు చరిత్ర. ఎన్నో పోరాటాలనూ, సమరశీలతనూ, త్యాగాలనూ, రాజకీయ పనిరీతిని తనలో ఇముడ్చుకుని తెలుగు నేలను ముఖ్యంగా విద్యార్థి సమాజాన్ని చలింప చేసినది. జ్వలింప చేసినది పీడీఎస్‌యు. 1974 అక్టోబర్ 12, 13 తేదీలలో మొదటి మహాసభలో పీడీఎస్‌యుగా నిర్మాణాన్ని సంతరింపచేసుకున్న ఆ సంస్థకు 2024 అక్టోబర్‌కు 50 ఏండ్లు నిండాయి. ఒక విద్యార్థి సంఘం, అందునా పోరాటాల చరిత్ర, విప్లవోద్యమ దృక్పథం గల సంస్థ ఇంతకాలం కాలానికి ఎదురీదుతూ నిలబడటం అరుదైన సందర్భమే. ఈ సందర్భంగా ఈ సంస్థలో కృషి చేసినవారు, అమరులైన వారు వారి జీవిత మధురిమలను ఉద్యమంలోనే చవిచూశారు. త్యాగాలతో పునీతమైన ఆ చరిత్రను మననం చేసుకోవడానికి 2024 సెప్టెంబర్ 30న ఉస్మానియా యూనివర్సిటీలోని టాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యు స్వర్ణోత్సవం జరుపుకుంటున్నది. ఆ 50 వసంతాల పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా మననం చేసుకోవడం ఎంతో సముచితం. అవసరం కూడా.

1960వ దశకం ప్రపంచంలో, ముఖ్యంగా భారత దేశంలో అల్లకల్లోలంగా నడిచింది. అధిక ధరలు, నిరుద్యోగం, పనిభారం, రుణభారం, ఆశ్రిత పక్షపాతం, నిరంకుశత్వం ఇవన్నీ సమాజాన్ని పట్టి పీడించాయి. అస్వతంత్రత పెద్ద ఎత్తున కొనసాగింది. ఈ నేపథ్యంలోనే 1968లో ఫ్రాన్స్‌లో డీగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమం ప్రజ్వరిల్లింది. అది భద్రత కోసం, ప్రజాస్వామ్యం కోసం నినదించింది. ఈ పోరాటం ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావాన్ని ప్రసరింప చేసింది. భారతదేశ విద్యార్థి లోకంపై కూడా ఆ ప్రభావం పడింది. ఆ క్రమంలోనే అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వియత్నాం ప్రజలు, విద్యార్థులు చేసిన దేశభక్తియుత గెరిల్లా పోరాటం, పుస్తకాలు వదిలేసి విద్యార్థులు సైతం నేల మాళిగల్లోకి దూరి చేసిన గెరిల్లా పోరాటం ఉత్తేజాన్ని కలిగించింది. మరోవైపు చేగువేరా సాహసాలు, క్యూబా విముక్తి తరువాత లాటిన్ అమెరికాలో విప్లవం కోసం ఆయన చేసిన త్యాగాలు చెరగని ముద్రను వేశాయి. ఈ సందర్భంలోనే నక్సల్బరీ, శ్రీకాకుళ గోదావరిలోయ ప్రజల పోరాటాలు, సాయుధ సంఘర్షణలు తెలుగు సీమను పులకింపచేశాయి.



ఈ సందర్భంలోనే ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ చదువుతూ, గోల్డ్‌మెడల్ సాధించిన జార్జిరెడ్డిని సమాజ చింతకుడిగా రూపుదిద్దుకోవడానికి ప్రేరణ అయ్యాయి. యూనివర్సిటీలోని ర్యాగింగ్, ఆశ్రిత పక్షపాతం, హాస్టల్స్‌లో సౌకర్యాల లేమి, మెస్‌లో దందాలు, అధికారుల ఆగడాలు, గ్రామీణ విద్యార్థుల పట్ల జరిగే అవహేళన ఇవన్నీ కదిలించాయి. ఈ సమస్యలన్నీ జార్జిని పోరాట వీరునిగా మలిచాయి. ఆ క్రమంలోనే నీలం రామచంద్రయ్య (ఉపాధ్యాయ ఎమ్మెల్సీ) సహచర్యంతో రాజకీయ నిర్మాణ పరిణతి పొంది జార్జిరెడ్డి రాజకీయ, నిర్మాణ దక్షకుడయ్యాడు. విద్యార్థులకు సమరశీల పోరాట వేదిక వుండాలని భావించి, సహచరులను సమన్వయ పరిచి పీడీఎస్ అనే సంస్థను స్థాపించాడు. అది యూనివర్సిటీలో విద్యార్థుల పోరాట పతాకగా మారింది. మతోన్మాదులకూ, ఛాందసవాదులకూ సింహస్వప్నంగా మారింది. ఎన్నో పోరాటాలు చేసి, ఎన్నెన్నో విజయాలు సాధించింది. ఈ ఫలితాలను మింగలేని మతోన్మాద మూకలు 1972 ఏప్రిల్ 14న జార్జిని కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ పోరాటాల క్రమంలో 1975 జూన్ నుంచి 1977 మార్చి వరకు ఎమర్జెన్సీ నియంతృత్వాన్ని ఎదుర్కొన్నది. రహస్యంలోకి నాయకత్వం పోవాల్సి వచ్చింది. సంస్థ కార్యకలాపాలకు, ఉద్యమాలకు బ్రేకు పడింది.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత తిరిగి పునర్నిర్మాణం జరిగింది. మిగిలిన వారు, ఉద్యమబాట పట్ల ఆసక్తి వున్న వారితో కార్యక్రమాలు, నిర్మాణ రూపం ఆరంభించారు. అనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎస్‌యు బలమైన సంస్థగా ఎదిగింది. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో సౌకర్యాల కోసం, వారిని గౌరవంగా చూడాలనే అంశంపై ఎన్నో పోరాటాలు చేసి, విజయాలు సాధించింది. మహిళలకు, విద్యార్థినులకు సమాన హక్కుల కోసం నినదించింది. ర్యాగింగ్‌పై కన్నెర్ర చేసింది. వివిధ కళాశాలల్లో గూండాగిరి, రౌడీ గ్యాంగ్‌లపై పోరాడి, వారి కీళ్ళు విరిచింది. కళాశాల సీట్లు పెంచాలని, సౌకర్యాలు మెరుగుపరచాలని, అధ్యాపకుల నియామకం కోసం ఎన్నో పోరాటాలు చేసింది. నిరుద్యోగం, అధిక ధరలను నిరసించింది. రాజకీయ అంశాలపై తన శాస్త్రీయ ఆలోచనలను సమాజంలో నలుగురికి పంచింది.

నిర్బంధాల శిబిరాల నుంచి, ఆంక్షల చట్రాల నుంచి, ఛాందసభావాల నుంచి, అభివృద్ధి నిరోధకత్వం నుంచి దాడులను, ఉక్కు చట్రాలను ఎదుర్కొని 5 దశాబ్దాలుగా పీడీఎస్‌యు పురోగమిస్తున్నది. ఈ క్రమంలోనే 1972–73 లో డీఎస్‌గా, 1974లో ఆర్ఎస్‌యుగా, 1984 నుంచి 2013 దాకా మరో రెండు మూడు విభజనలను ఎదుర్కొని సైతం తన సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ, పోరాట కృషిని కొనసాగిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి లోకపు పోరు పతాకగా నిశ్చలంగా నిలబడింది.

○ పోటు రంగారావు

పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యమేదీ?

మన ఇరుగు పొరుగు దేశాలలో ఒకటైన చైనాతో మనకు 3,448 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉన్నది. అయినా చైనాను మన దేశంలో ఎందుకనో ఎవరూ ఒక పొరుగు దేశంగా భావించరు. ఆశ్చర్యకరమైన విషయమిది. మరో రెండు పొరుగు దేశాలు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో కూడా మన పొలిమేరలు చాలా దీర్ఘమైనవి. పశ్చిమాన పాక్‌తో ఉన్న సరిహద్దు (3,310 కిలోమీటర్లు), తూర్పున బంగ్లాదేశ్‌తో ఉన్న సరిహద్దు (4,096 కిలోమీటర్లు) పొడవునా పూర్తిగా కంచె నిర్మించుకున్నాం. భారత్, నేపాల్‌లు 'తెరిచిన సరిహద్దు' (ఓపెన్ బోర్డర్) విధానాన్ని అనుసరిస్తున్నాయి. అడపాతడపా ఏవో కొన్ని కీచులాటలు మినహా ఉభయ దేశాల మధ్య వస్తు సేవల రవాణా, ప్రజల నిర్నిబంధ రాకపోకలకు ఆ స్వేచ్ఛా సరిహద్దు విధానం ఇతోధికంగా తోడ్పడుతోంది. చిన్న దేశమైన భూటాన్‌తో మనకు 578 కిలోమీటర్ల సరిహద్దు ఉన్నది. మనకు వ్యూహాత్మక ప్రాధాన్యమున్న భౌగోళిక నెలవులో ఉన్న పొరుగు దేశం భూటాన్. ఆ చిన్న దేశంతో స్నేహ సంబంధాలకు న్యూఢిల్లీ అమిత ప్రాధాన్యమిస్తోంది. శ్రీలంక ఒక సన్నని జలసంధితో భారత భూభాగం నుంచి వేరుపడి ఉంది చారిత్రక, సాంస్కృతిక కారణాల రీత్యా మనకు ఎంతో ప్రాధాన్యమున్న దేశమది. అయినప్పటికీ ఈ పొరుగు దేశం నుంచి కూడా మనకు తరచు సమస్యలు ఏర్పడుతూనే ఉన్నాయి. మాల్దీవులు కొంచెం దూరంగా ఉన్న పొరుగు దేశం. ఆ దేశ విధానాలపై చైనా ప్రభావం పెరుగుతున్నప్పటికీ మాల్దీవులతో మంచి సంబంధాలు నెరపడానికి మనం ప్రయత్నిస్తున్నాం. 1988లో మాల్దీవులలో అధికారాన్ని కబళించడానికి ఒక సైనిక ముఠా చేసిన ప్రయత్నాలను మనం విఫలం చేశాం. ఇప్పుడు ఆ 'ఆపరేషన్ కాక్టస్'ను గుర్తు చేసుకునేవారు భారత్‌లో ఎవరైనా ఉన్నారా అనేది నాకు సందేహమే. ఇరుగు పొరుగు దేశాలలో మనకు చాలా చిన్న సరిహద్దు ఉన్న దేశం ఆఫ్ఘానిస్తాన్. కేవలం 106 కిలోమీటర్లు మాత్రమే ఉన్న సరిహద్దు అది. సరే ఆ దేశంతో మన సంబంధాలు వసంత కాలంలో వర్థిల్లితే హేమంత రుతువులో క్షీణించిపోవడం అనేక దశాబ్దాలుగా ఒక పరిపాటిగా ఉన్నది. చైనా మినహా ఇతర పొరుగు దేశాలన్నీ దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్)లో సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి.


▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈ పొరుగు దేశాల పట్ల భారత్ ఎలా వ్యవహరిస్తోంది? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి రాగానే తన అలవాటు ప్రకారం శబ్ద పటాటోపంతో తమ విదేశాంగ విధానం లక్ష్యం 'నైబర్‌హుడ్ ఫస్ట్' (పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యత)గా ప్రకటించారు. ఇరుగు పొరుగున ఉన్న దేశాల పట్ల ప్రధానమంత్రి వ్యక్తిగత శ్రద్ధ ఎంత ప్రగాఢమైనదో తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాను. సార్క్ సభ్య దేశాలలో నరేంద్ర మోదీ చివరిసారి ఎప్పుడు పర్యటించారు? 'పిఎమ్ ఇండియా' వెబ్ సైట్‌లో ఆ వివరాలను కనుగొన్నాను: 2024 మార్చిలో భూటాన్, 2022 మేలో నేపాల్, 2021 మార్చిలో బంగ్లాదేశ్, 2019 జూన్‌లో మాల్దీవులు, 2019 జూన్‌లో శ్రీలంక, 2016 జూన్‌లో ఆఫ్ఘానిస్తాన్, 2015 డిసెంబర్‌లో పాకిస్థాన్‌ను నరేంద్ర మోదీ చివరిసారి అధికారికంగా సందర్శించారు. గత పది సంవత్సరాలలో మోదీ ఐదు సార్లు నేపాల్‌ను, మూడు సార్లు భూటాన్‌ను, మూడు సార్లు శ్రీలంకను, రెండు పర్యాయాలు బంగ్లాదేశ్‌ను, రెండు సార్లు మాల్దీవులును, రెండు సార్లు ఆఫ్ఘాన్‌ను, ఒకసారి పాకిస్థాన్‌ను సందర్శించారని కూడా ఆ వెబ్ సైట్ ప్రకారం తెలుసుకున్నాను. నరేంద్ర మోదీ గత పదేళ్లలో మొత్తం 82 విదేశీపర్యటనలు చేశారు. ఆ పర్యటనల్లో భాగమే ఇరుగు పొరుగు దేశాలకు ఈ 18 సందర్శనలు. 2024లో భూటాన్‌లో ఒకరోజు పర్యటన మినహా మరే ఇతర పొరుగు దేశంలోనూ ఆయన రెండు సంవత్సరాలకు పైగా పర్యటించనే లేదు!



ఈ ఏడాది మార్చిలో భూటాన్‌లో ఒకరోజు పర్యటన మినహా మరే ఇతర పొరుగు దేశంలోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు సంవత్సరాలకు పైగా పర్యటించనే లేదు! దక్షిణాసియాలో భారత్ ప్రభావ ప్రాబల్యాలు అంతకంతకూ తగ్గి పోతున్నాయి. ఇది మనం స్వయంగా కొనితెచ్చుకున్న దుస్థితి. మోదీ సర్కార్ నైబర్ హుడ్ ఫస్ట్ విధానం వాస్తవంగా పొరుగు దేశాలకు చివరి ప్రాధాన్యాన్ని మాత్రమే ఇస్తూ భారత్ పట్ల ఆ దేశాల స్నేహశీలత, సుహృద్భావాన్ని క్షీణింపజేసింది.

18వ సార్క్ శిఖరాగ్ర సదస్సు 2014లో నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో జరిగింది. 19వ సార్క్ శిఖరాగ్రం నవంబర్ 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగవలసి ఉంది. అయితే భారత్ ఆ శిఖరాగ్ర సదస్సును బాయ్‌కాట్ చేసింది. భారత్‌ను అనుసరించి మరో నాలుగు దేశాలు కూడా ఆ శిఖరాగ్రానికి హాజరు కాలేదు. దరిమిలా సార్క్ శిఖరాగ్ర సదస్సు జరగనే లేదు. సార్క్ 'ఒక సంపూర్ణ వైఫల్యం' అని జస్వంత్ సింగ్ (వాజపేయి ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి) అభివర్ణించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా సార్క్‌పై జస్వంత్ మాటే తుది మాటగా అంగీకరించింది.

ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత నరేంద్ర మోదీ 2015– జూన్, 2018 మధ్య చైనాలో ఐదుసార్లు పర్యటించారు. మియన్మార్‌ను రెండు సార్లు, మారిషస్‌ను ఒక పర్యాయం సందర్శించారు. చైనా తన చేతలతో మోదీకి కోపం తెప్పించింది. చైనాకు దీటుగా మోదీ ప్రతిస్పందించలేక పోయారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం మోదీ నిస్సహాయుడై పోయారు. సరిహద్దుల్లో ఎదురెదురుగా మొహరించిన సైనిక దళాల ఉపసంహరణ విషయమై చర్చలకు చైనానే ఎజెండాను నిర్దేశిస్తోంది. ఆ చర్చలు పదే పదే జరుగుతూనే ఉన్నాయి. అయినా సత్ఫలితాలు ఎండమావులుగా ఉన్నాయి. వాస్తవాధీన రేఖ వెంబడి తన సైనిక దళాల మొహరింపును చైనా ఇతోధికంగా పెంచింది. సరిహద్దు ప్రాంతాలలో రోడ్లు వేస్తోంది, వంతెనలు నిర్మిస్తోంది, జనావాసాలను ఏర్పాటు చేస్తోంది, ఆయుధాల నిల్వకు భారీ వసతులను అభివృద్ధి పరుస్తోంది.


ఇరుగు పొరుగు దేశాల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించినందుకు మనం భారీ మూల్యమే చెల్లించాము నేపాల్‌లో ప్రభుత్వం మారగలదని మనం ఊహించలేక పోయాం. కె.పి.శర్మ ఓలి మళ్లీ ప్రధానమంత్రి అయ్యారు. షేక్ హసీనా ఉన్న పాటున బంగ్లాదేశ్ నుంచి శరణార్థిగా భారత్‌కు రావలసి వస్తుందనే విపత్కర పరిస్థితిని ముందే పసిగట్టడంలో మనం పూర్తిగా విఫలమయ్యాం. రానిల్ విక్రమసింఘెకు ఎనలేని ప్రాధాన్యమిచ్చాం. అనూర దిస్సనాయకెను ఉపేక్షించాం. ఇప్పుడు దిస్సనాయకె 42.3 శాతం ఓట్లతో శ్రీలంక అధ్యక్ష పీఠం అధిష్ఠించారు. మాల్దీవుల అధ్యక్షుడుగా ఎన్నికైన మొహమ్మద్ మయిజ్జు తొలి చర్య తమ దేశంలోని భారతీయ సైనిక సలహాదారులను వెనక్కి వెళ్లిపొమ్మని ఆదేశించడమే. ఇక పాకిస్థాన్ విషయానికి వస్తే మోదీ ప్రభుత్వం విధానాలను దేశీయ రాజకీయ పరిస్థితులు ప్రభావితం చేస్తున్నాయనే అభిప్రాయం కలుగుతోంది.

చెప్పవచ్చిన దేమిటంటే దక్షిణాసియాలో భారత్ ప్రభావ ప్రాబల్యాలు అంతకంతకూ తగ్గి పోతున్నాయి. ఇది మనం స్వయంగా కొనితెచ్చుకున్న దుస్థితి. ప్రపంచ వ్యవహారాలలో భారత్‌కు శాంతి నిర్మాతగా ప్రతిష్ఠ సమకూర్చేందుకు మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం ఆరాటపడుతోంది. రష్యా, ఉక్రెయిన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల నాయకులతో మోదీ తరచు సమావేశమవడం, మోదీ సర్కార్ శాంతి సాధన ప్రయత్నాలకు తార్కాణాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ శాంతిని కాపాడేందుకు మోదీ కృషి సఫలం కావాలని కోరుకుంటున్నాం. అయితే పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యం అనే విధానం వాస్తవంగా పొరుగు దేశాలకు చివరి ప్రాధాన్యం మాత్రమే ఇస్తుందని, భారత్ పట్ల ఆ దేశాల స్నేహశీలత, సుహృద్భావాన్ని అంతకంతకూ క్షీణింపజేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నిష్కర్షగా చెప్పక తప్పడం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఈ భ్రష్టత్వానికి బాధ్యత ఎవరిది జగన్?

హిందూ దేవాలయాల ఆచారవ్యవహారాలలో అంతర్భాగం శౌచధర్మం. దేవుణ్ణి కొలిచే భక్తులు, పూజాదికాలు నిర్వహించే పూజారులు, నైవేద్య కైంకర్యాలు తయారుచేసేవారు విధిగా శౌచధర్మం పాటించాలని; దేవుని ఆరగింపునకు తయారు చేసే నైవేద్యం భక్తితో, పవిత్రతతో, శుచితో, మేలిమి సంగంధాలతో రూపొందించాలని శాస్త్రాలు చాలా స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా, కలియుగ దైవంగా భావించే తిరుమల తిరుపతి వేంకటేశ్వరునికి అందించే నైవేద్య కైంకర్యాలన్నీ నిర్దిష్ట ప్రమాణాలకు లోబడిన కల్తీలేని వస్తువులతోనే తయారు చేయాలి. అంతేకాదు.. తిరుమల తిరుపతి దేవస్థానంలోని ప్రతి ఒక్కరూ ధార్మిక నిష్ఠను పాటించాలని శాస్త్రాలు నొక్కి చెబుతున్నాయి.



హిందూయేతర మతస్థులు ఏడుకొండల స్వామివారిని దర్శించుకోవాలంటే.. తమకు దేవుడి పట్ల నమ్మకం ఉందన్న డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. స్వామివారికి జరిగే బ్రహ్మోత్సవాలలోను, ఇతర పండుగ దినాలలో పాలకులు సతీసమేతంగా దర్శనం చేసుకొని స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీ. చారిత్రకంగా చూసినపుడు, అనాదిగా అనేక మంది రాజులు శ్రీవేంకటేశ్వరస్వామిని భక్తి ఆరాధనలతో కొలుచుకొన్నారు. 500 సంవత్సరాల క్రితం విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు ఏడు పర్యాయాలు తిరుమలకు యాత్రలు చేసి శ్రీ వేంకటేశ్వరస్వామికి నవరత్నఖచిత కిరీటంతో సహా ఎన్నో విలువైన వజ్రవైఢూర్యాలు, బంగారు వెండి కానుకలు సమర్పించారు.

రాజుల కాలం ముగిసి దేశంలో ప్రజాపాలన మొదలైన తర్వాత కూడా ఆయా సందర్భాలలో రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పని చేసిన నాయకులు తిరుమల తిరుపతి ఆలయ పవిత్రతను కాపాడడానికి తమవంతు కృషి చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.టి.రామారావుకు వేంకటేశ్వరస్వామి పట్ల ఎనలేని భక్తిప్రపత్తులు ఉండేవి. తన 60వ జన్మదిన సందర్భంగా ఎన్.టి.రామారావు శ్రీ వేంకటేశ్వరస్వామి పాదాల చెంత తిరుపతిలో తెలుగుదేశం పార్టీ తొలి 'మహానాడు'ను నిర్వహించారు. అలాగే తిరుపతిలో ఎన్నికల ప్రచారం ముగించుకొని తిరుమల వెళ్లి తలనీలాలు సమర్పించి దైవ దర్శనం చేసుకొన్నారు. ఆ ఎన్నికలలో అఖండ విజయం సాధించి అధికారం చేపట్టిన తర్వాత.. తిరుమల తిరుపతిని వాటికన్ సిటీ తరహాలో అభివృద్ధి చేస్తానని ప్రకటించి.. అందులో భాగంగా తిరుమల తిరుపతిలో ఎన్టీఆర్ ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా, సామాన్య భక్తుల కోసం మహాప్రాంగణం ఏర్పాటు, ఆర్టీసీ బస్టాండ్, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ చొరవతోనే తిరుమలలో 1986లో భక్తులకు ఉచితంగా భోజనం పెట్టే 'నిత్యాన్నదాన పథకం' మొదలైంది. తిరుమల కొండమీద హిందూ సంస్కృతీ సంప్రదాయాలను; ఆచార వ్యవహారాలను నిష్ఠతో పాటించడానికి ఎన్టీఆర్ ఎన్నో మార్పులు తెచ్చారు.

> నిజానికి, జగన్ పాలనలో టీటీడీ ద్వారా జరిగిన అక్రమాల పుట్టలో.. 'లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి' అన్నది ఒక అంశమే. లోతుగా దర్యాప్తు జరిపితే విస్తుపోయే వాస్తవాలెన్నో వెలికివస్తాయి. ఒక్క టీటీడీయే కాదు.. రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాలలో జరుగుతున్న లోటుపాట్లను సమీక్షించాలి. ముఖ్యంగా, దేవాదాయ శాఖపై దృష్టి పెట్టి భక్తులకు మరిన్ని సేవలు అందేవిధంగా మార్పులు తేవాలి. దేవాలయాలపై వచ్చే ఆదాయాన్ని దేవాలయాల అభివృద్ధికే ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు; ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు తిరుమల తిరుపతిలో ఏం జరిగిందో తెలుసుకోవడానికి కొన్ని సంఘటనలను ఉదహరించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. 2004లో తెలుగుదేశం ఓటమి చెంది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే తిరుమల తిరుపతి పవిత్రతను దెబ్బతీసే అనేక సంఘటనలు జరిగాయి. కొండమీద రాజకీయ కార్యకలాపాలు సాగించడానికి వీలులేదు. అలాగే, అన్యమత ప్రచార కార్యక్రమాలు చేపట్టడం నిషేధం. కానీ, 2004 తర్వాత ఆనాటి పాలకులు ఉదాసీనంగా, చూసీచూడనట్లు వ్యవహరించడంతో శ్రీవారి కొండమీద మహాపచారాలు అనేకం జరిగాయి. ఆనాడు తిరుమలలో చెట్ల చుట్టూ ఏర్పాటు చేసిన 'ట్రీగార్డు'లలో శిలువ గుర్తు కన్పించేటట్లు చేశారు. మోటారు సైకిళ్లకు రాజకీయ జెండాలు కట్టుకొని కొండపై రాజకీయ ర్యాలీ తీశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా.. తన అనుంగు సహచరుడైన కరుణాకరరెడ్డిని టీటీడీ చైర్మన్ చేశారు. కరుణాకర రెడ్డి నాస్తికుడిగా, కమ్యూనిస్టుగా, క్రిస్టియన్‌గా తిరుపతిలో ప్రసిద్ధుడు. టీటీడీ చైర్మన్‌గా ఆయన నియామకం మంచిది కాదని హిందూధార్మిక సంస్థల ప్రతినిధులు హెచ్చరించినా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఖాతరు చేయలేదు.

2019–2024 మధ్య వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో తిరుమలలో జరిగిన ఘోరాలు, అపచారాలు, అవినీతి కార్యక్రమాలు అన్నీ ఇన్నీ కావు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జరిగిన అపచారాలకు మించిన స్థాయిలో జగన్ అండ్ కో అక్రమాలకు పాల్పడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని పూర్తిగా తన రాజకీయ అవసరాల కేంద్రంగా మార్చేశారు. టీటీడీ బోర్డుకు చైర్మన్‌గా, సభ్యులుగా ఎంపిక చేసేవారికి నేరచరిత ఉండకూడదు. కానీ, జగన్ పాలనలో నిబంధనల్ని, సంప్రదాయాల్ని గోదాట్లో కలిపేశారు. టీటీడీ చైర్మన్‌గా నాలుగేళ్లపాటు సొంత బాబాయిని నియమించుకున్నారు. చివరి ఏడాదిలో కరుణాకర రెడ్డిని తెచ్చారు. ఇక, టీటీడీ సభ్యులుగా లిక్కర్ కుంభకోణంలో ఉన్నవారిని, టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడ్డ పాత్రదారులకు, స్మగ్లర్లకు చోటు కల్పించారు. పన్నెండు మంది సభ్యులు మాత్రమే ఉండాల్సిన టీటీడీ బోర్డును ఇరవైనాలుగు మంది సభ్యులతో రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారు. మరో 52 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. అయితే, న్యాయస్థానం జోక్యంతో ప్రత్యేక ఆహ్వానితులకు చెల్లుచీటి పాడక తప్పలేదు. పెద్ద పదవుల్లో ఉన్నవారు తమ భవిష్యత్తు అవసరాలకు పనికొస్తారనే ముందుచూపుతో.. ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్‌సూద్‌కు "మీ వాళ్లు ఎవరైనా ఉంటే చెప్పండి.. టీటీడీ బోర్డులో సభ్యులుగా నియమిస్తాం" అంటూ కబురు చేసిన ఘటన, అందుకు వారిద్దరూ జగన్ ఆఫర్‌ను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చడం సంచలనం సృష్టించింది. టీటీడీ జెఈవో పోస్టుకు రాష్ట్రంలో అధికారులే లేనట్టు వివాదాస్పదుడైన ధర్మారెడ్డిని కేంద్ర సర్వీసుల నుంచి తెప్పించుకున్నారు. అందరూ కాంట్రాక్టర్లుగా మారి కొండపై వందలాది కోట్లతో నామినేషన్ల పద్ధతిన పనులను సొంతవాళ్లకు పంచేశారు. చివరకు భక్తులు సమర్పించిన తల నీలాలను కూడా ఇతర దేశాలకు అక్రమ రవాణా జరగడం సభ్యసమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.

జగన్ అధికారంలో ఉండగా తిరుమల తిరుపతి పవిత్రతను దెబ్బతీసిన వారిలో మంత్రిగా పనిచేసిన ఆర్‌కె.రోజా మొదటిస్థానంలో ఉంటారు. వారానికి ఒకటిరెండు సార్లు మందీమార్బలంతో, టిక్కెట్లు కొనకుండానే ఆర్‌కె.రోజా దర్శనాలకు వెళ్లడాన్ని అందరూ గమనించారు. పైగా, కొండమీద రాజకీయాలు మాట్లాడకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ.. దాదాపుగా ప్రతి సందర్భంలో ఆర్.కె. రోజా స్వామి దర్శనానంతరం బయటకొచ్చి మీడియాతో రాజకీయాలు మాట్లాడారు. చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లపై పచ్చిగా రెచ్చిపోయి మాట్లాడారు. ఇక, శ్రీవారి బంగారాన్ని సెక్యూరిటీగా చూపి అప్పులు తెచ్చుకునేందుకు కూడా ఆనాటి ప్రభుత్వం వెనుకాడలేదు. పైగా, టీటీడీ నిధుల్ని రాష్ట్ర ఖజానాకు మళ్లించే ప్రయత్నాలు జరిగాయి. జగన్ తాను క్రిస్టియన్ అని పలు సందర్భాలలో బాహాటంగా చెప్పుకున్నారు. ఎపిజె అబ్దుల్ కలాం దేశానికి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు తిరుమలను సందర్శించిన సందర్భంలో డిక్లరేషన్‌పై సంతకం చేసి ఓ ఉన్నత సంప్రదాయాన్ని గౌరవించారు. కానీ, జగన్ మాత్రం తనకు నిబంధనలు, సంప్రదాయాలు పట్టనట్టు ముఖ్యమంత్రి హోదాలో శ్రీవారిని దర్శించుకున్న సందర్భాలలో డిక్లరేషన్‌పై మాత్రం సంతకం పెట్టకుండా నిబంధనలను ఉల్లంఘించారు. తిరుమల తిరుపతి పవిత్రతను దెబ్బతీసిన అనేక అక్రమాలకు, అవినీతికి పాల్పడిన జగన్ అండ్ కో పాపాలకు నిష్కృతి లేదు.

నిజానికి, జగన్ పాలనలో టీటీడీ ద్వారా జరిగిన అక్రమాల పుట్టలో.. 'లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి' అన్నది ఒక అంశమే. లోతుగా దర్యాప్తు జరిపితే విస్తుపోయే వాస్తవాలెన్నో వెలికివస్తాయి. వాటన్నింటినీ ఇప్పుడు బయటకు తీయాలి. 'దొంగే.. దొంగ దొంగ' అనే చందంగా అరుస్తున్న వారి అక్రమాలను, అవినీతిని వెలికితీసి వారి భరతం పట్టకపోతే ప్రజల్లో నమ్మకం మరింత సడలిపోతుంది. ఒక్క టీటీడీయే కాదు.. రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాలలో జరుగుతున్న లోటుపాట్లను సమీక్షించాలి. ముఖ్యంగా, పరిపాలనా రంగంలో సంస్కరణలకు నాంది పలికిన చంద్రబాబునాయుడు.. దేవాదాయ శాఖపై దృష్టిపెట్టి భక్తులకు మరిన్ని సేవలు అందేవిధంగా మార్పులు తేవాలి. దేవాలయాలపై వచ్చే ఆదాయాన్ని దేవాలయాల అభివృద్ధికే ఖర్చు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. పాలక మండలి సభ్యుల నియామకంలో స్థానికులకే ప్రాధాన్యం కల్పించాలి. అంతిమంగా గాయపడిన భక్తుల మనోభావాలను గమనంలోకి తీసుకొని తిరుమలతోసహా రాష్ట్రంలోని అన్ని దేవాలయాల పవిత్రతను కాపాడాల్సిన తక్షణ కర్తవ్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై ఉంది.

• సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

దళితుల ఐక్యతను కోరిన జాషువ

కాలంతో పోటీ పడి జీవించే మహాకవి గుర్రం జాషువ. ప్రతినిత్యం ప్రజల నాలుకల మీద ప్రతిధ్వనించే జాషువ పద్యాలు ఎప్పుడు చదివినా తాజాగా ఉంటాయి. మానవ మనుగడకు అడ్డు వచ్చే విద్రోహాలను, జీవించే హక్కును కాలరాచే కుట్రలను వ్యతిరేకించి వాటిని ఎదుర్కొనే శక్తి యుక్తులను తన కవిత్వం ద్వారా జాషువ ప్రచారం చేశాడు. విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ లాంటి ఉద్దండ కవి పండితులు ఏర్పరచిన సాహిత్య దృక్పథాలకు భిన్నంగా, ప్రత్యామ్నాయ కవితాతత్వాన్ని ఆవిష్కరించాడు. బుద్ధుడు, క్రీస్తు, మహాత్మాగాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వంటి మహనీయులు అందించిన ఉమ్మడి భావజాల స్ఫూర్తికి జాషువా కవిత్వం అక్షర దర్పణంగా నిలుస్తుంది. 'అకలంకంబగు హేతువాదము', 'సత్యాన్వేషణాసక్తి', 'సాంఘిక కళ్యాణ పిపాస', దేశభక్తి, దళితుల సర్వతోముఖ ప్రగతి, మహిళాభ్యుదయ చింతన, తదితర అంశాలను ఆయన ఆర్ద్రంగా కవిత్వీకరించాడు. అందువల్ల జాషువ ఈనాటి అస్తిత్వ ఉద్యమాలకు మార్గదర్శిగా కనిపిస్తాడు. వర్తమాన చైతన్యానికి ఊతమిచ్చే ఎన్నో అంశాలను, సమకాలీన సమాజాభివృద్ధికి అవసరమైన సాంస్కృతిక విలువలను జాషువ ఆనాడే తన కవిత్వంలో పొందుపరచి నవయుగ కవి చక్రవర్తిగా విమర్శకుల నీరాజనాలందుకున్నాడు. జాషువ కవిత్వం వెన్నెల తుఫాన్. ఆ వెన్నెల్లో అంటరాని గబ్బిలాలు ఆవేదనతో భాషించాయి. ఆ తుఫాన్‌లో నాలుగు పడగల హైందవ నాగరాజులు ఉలిక్కి పడ్డాయి. ఈ కవికోకిల సాహిత్యం ఒక కన్నీటి సునామీ. అవిచ్ఛిన్నమైన ఆ సృజనవాహిని ఒక్క కుల సమస్య దగ్గరే ఆగిపోలేదు. మనిషిని పీడించే అనేకరకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను తడుముతూ నిమ్నోన్నతాలను సమం చేస్తూ జీవితపు సన్నని పార్శ్వాల్లోగుండా ప్రవహించింది. కులీన వర్గాల ఆధిపత్యం నిరాఘాటంగా కొనసాగుతున్న సాహిత్యంలో తక్షణం కవిగా నిలబడటానికి తొలిదశలో జాషువ పౌరాణిక నాటకాలు రాసినప్పటికీ ఆ ప్రభావం నుండి బయటపడి సామాజిక బాధ్యతతో విశిష్టమైన ఖండ కావ్యాలను, సందేశాత్మకమైన లఘు కావ్యాలను వెలువరించాడు. భారతీయ సమాజంలో వేళ్లూనుకున్న కులపీడనను తీవ్రంగా నిరసిస్తూ ఆయన రాసిన గబ్బిలం కావ్యం గత సహస్రాబ్దిలో వెలువడిన ఐదు గొప్ప పుస్తకాల్లో ఒకటిగా (ప్రముఖ ఆంగ్ల దినపత్రిక పయనీర్ సర్వే ప్రకారం) ప్రఖ్యాతిగాంచింది. గబ్బిలం స్వరూపం– దేశారాధన.. స్వభావం– దళిత వేదన. ఈ రకమైన అపూర్వ శిల్పవ్యూహంతో రచించడం వల్లనే ఈ కావ్యం సంప్రదాయ పండితులతో పాటు అధునాతన కవులకు కూడా ప్రీతిపాత్రమయింది.

తెలుగు సాహిత్యంలో ఘనత వహించిన చాలామంది కవులు, రచయితలు వీధిలో తిష్టవేసిన చెత్త గురించి మాట్లాడారు కానీ తమ ఇంటిని ఆవరించిన బూజు గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ఇందుకు భిన్నంగా జాషువ స్వీయ లోపమ్ములను అర్థం చేసుకొని, సాంఘిక దురన్యాయాలను ఖండిస్తూ గొప్ప సాహిత్యాన్ని సృష్టించాడు. సామాజిక అసమానతలను ఎంత తీవ్రంగా ప్రశ్నించాడో అంతే పదునుగా దళితుల మధ్య రగులుతున్న అంతర్గత ఉప కుల భేదాలను కూడా విమర్శించాడు. 'ఇంటి గుట్టు', 'పంచముడు' వంటి ఖండికలతో పాటు గబ్బిలం తదితర కావ్యాలలో కూడా అనేక సందర్భాలలో ఈ వైరుధ్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మాల మాదిగల నడుమ బుసలు కొట్టే కుల, మత శాఖాపరమైన విభేదాలను, వివాదాలను కుండబద్దలు కొట్టినట్లు తన కవిత్వంలో తేటతెల్లం చేశాడు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే భావనతో అనునిత్యం సంఘర్షణలు రగులుతూనే ఉంటాయి. అణగారిన వర్గాలు కూడా దీనికి అతీతం కాదు. "కలదమ్మ్రావణమంటరానితన మాకర్షింపుమీయుండియాపాలమమందుంగల మాలమాదిగలకున్" అంటూ జాషువ సామాజికరోగాన్ని గుర్తి తెలియజేశాడు. ఇలాంటి పెను రోగంతోనే మాలమాదిగలు పరస్పరం దూషించుకుంటున్నారని, కృష్ణులు, క్రీస్తులు ఎంతమంది దేవుళ్ళు జన్మించినా ఈ రెండు జాతుల మధ్య ఐక్యతను సాధించలేరని జాషువ ఆవేదన చెందాడు. అంతఃకలహాలలో సతమతమవుతూ సమాజంలో తమకు జరుగుతున్న అన్యాయాలను వారు ఎదిరించలేక పోతున్నారని జాషువ మదన పడ్డాడు. "పంచముల లోన మాదిగవాడ నేను/ పంచమీయులలో మాలవాడతండు/ ఉభయులము క్రైస్తవ మతాన నొదిగినాము/ సోదరత గిట్టుబాటు కాలేదు మాకు" అని దళితుల మధ్య ఉన్న వైషమ్యాలను జాషువ నిరసించాడు. 'సిగ్గు విడిచి హెచ్చు తగ్గుల కోసమై తన్నుకొనుట మాకు తప్పు గాదు" అని వ్యంగ్యంగా నిందించాడు. 'బియెలె మేలు' విద్యాబిరుదుల్ సాధించామని గర్వపడే మాలలు, మాదిగలు కుల మహాలోభంతో, తగాదాలతో తెగలుగా విడిపోతున్నారని జాషువ ఆవేదన చెందాడు. 'కులకక్ష్యాభ్రష్ట దుర్మతి' అని తన జాతి జనులను ఆయన తీవ్రంగా మందలించాడు. "మాల యేసుక్రీస్తు, మాదిగలకు గాడు / మాదిగేసుక్రీస్తు మాకూ గాడు" అంటూ కరుణామయునికి కూడా వర్ణ పంకిలము పులుముతున్నారని, 'కాకులందు మాలకాకి, మాదిగ కాకి' వారి విరోధములను బహిర్గతం చేస్తున్నాయని ఇరువర్గాలను చూసి ఆ కవిచక్రవర్తి విస్మయంతో బాధ పడ్డాడు. ప్రాబల్య వర్గాల, సవర్ణ హిందువుల ఆధిపత్యాన్ని అవహేళన చేస్తున్నారు కానీ దళితులు తమ తప్పులను తెలుసుకోవటం లేదని జాషువ హితవు చెప్పాడు. రోదసీలోకి కూడా సునాయాసంగా ప్రయాణం చేసే ప్రజ్ఞాశాలియైన మానవుడు 'పరస్పర విద్వేష విషాద చండశిఖ'ను ఆర్పలేక పోతున్నాడని వ్యాఖ్యానించాడు. "చండా లత్వంబొక పక్క/ గుండెలు తిని వేయుచుండ గొప్పల కొరకై/ యొండొరులుకలహమాడుచు/ నుండెదరా" అని జాషువ దళితుల దయనీయమైన పరిస్థితిని సూటిగా దూషించాడు. బహుజనుల మధ్య రగులుతున్న అంతర్గత వైషమ్యాలను కూడా జాషువ విమర్శించాడు. "మా చాకలి వారు మంగలియు జాతుల గొప్పదనాల కోసమై /బాకులు బట్టి నిల్చెదరు పంచమజాతియున్ రెండు ముక్కలై/ తాకదు ముట్టదని' దళితులతో పాటు బహుజనులకు ఆయన లెక్కలేని చివాట్లు పెట్టాడు. ఒక్కొక్క కులానికి ఒక్కొక్క పదవి కట్టబెట్టటం ద్వారా ఆ కుల చైతన్యాన్ని నీరుగార్చ వచ్చునని రాజకీయ నాయకులు భావిస్తారని, ఈ పదవుల వలలో చిక్కుకోవద్దని దళితులకు జాషువ సూచించాడు. "ఐకమత్య బలవద్ఘన రజ్జువు నుండి భిన్నమై తొలగిన నూలు పోగులకు తీరపు చిక్కులు రాకపోవునే" అని జాషువ హెచ్చరించాడు.

> జాషువ కవిత్వం వెన్నెల తుఫాన్. ఆ వెన్నెల్లో అంటరాని గబ్బిలాలు ఆవేదనతో భాషించాయి. ఆ తుఫాన్‌లో నాలుగు పడగల హైందవ నాగరాజులు ఉలిక్కిపడ్డాయి. ఈ కవికోకిల సాహిత్యం ఒక కన్నీటి సునామీ. అవిచ్ఛిన్నమైన ఆ సృజనవాహిని ఒక్క కుల సమస్య దగ్గరే ఆగిపోలేదు. మనిషిని పీడించే అనేకరకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను తడుముతూ నిమ్నోన్నతాలను సమం చేస్తూ జీవితపు సన్నని పార్శ్వాల్లోగుండా ప్రవహించింది.



◆ డాక్టర్ కోయి కోటేశ్వర రావు
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్

(నేడు గుర్రం జాషువ జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



జ్యోతి వెలిగిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి, ఎమ్మెల్యేలు



ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటక వరాలు కురిపించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి జరిగిన పర్యాటక దినోత్సవంలో ఆయన విజయవాడ, మచిలీపట్నం గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఇక్కడి పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను తెలియజేశారు.



సిటీలో సీ ప్లేన్

ప్రకాశం బ్యారేజీ ఎగువన ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు

- పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు వరాలు
- కృష్ణానది నుంచి నేరుగా శ్రీశైలం, పర్యాటక ప్రాంతాలకు..
- మంగినపూడి బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం యత్నాలు
- మచిలీపట్నానికి త్వరలో ప్రపంచస్థాయి పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదిలో సీ ప్లేన్ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన నదిలో సీ ప్లేన్ ప్రాజెక్టును ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించిన కసరత్తు జరుగుతోందని, ఇక్కడి నుంచి శ్రీశైలం తదితర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఇక మచిలీపట్నం బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశామన్నారు. ఈ సర్టిఫికెట్ వస్తే మచిలీపట్నం బీచ్‌కు గ్లోబల్ గుర్తింపు వస్తుందని సీఎం పేర్కొన్నారు.

విజయవాడ వరదలపై ఆవేదన

విజయవాడలో వరదల గురించి సీఎం తన మనసులోని ఆవేదనను తెలిపారు. విజయవాడలో వరదలు వచ్చినపుడు మూడు రోజుల పాటు మంచినీరు కూడా ఇవ్వలేకపోవడం బాధ కలిగించిందన్నారు. 'విజయవాడ అతలాకుతలమైపోయింది. పది రోజులు నేను కూడా బాధపడ్డా. మనసును చలించేసింది. కనీసం నీరు ఇవ్వలేకపోయానన్న మనోవేదన అనుభవించా. పది రోజులు నేను బురదలో తిరిగాను. మా ఆఫీసర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ తిరిగి సాధారణ స్థితికి తీసుకురావటానికి ప్రయత్నించారు. మా చర్యలను చూసిన తర్వాత రాష్ట్రం మొత్తం స్పందించింది. సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.425 కోట్లు ఇచ్చారు. ఆరో తరగతి చదివే చిన్న కుర్రాడు నాలుగేళ్లు పొదుపు చేసుకున్న రూ.10 వేలు ఇచ్చాడు. నీకు బాధ వేయటం లేదా.. అని నేను అడిగితే వరద బాధితుల కష్టాలను తాను టీవీల్లో చూశానని, వారి కష్టం తీర్చుతున్నందుకు ఆనందంగా ఉందని, ఎలాంటి బాధ లేదని ఆ చిన్నపిల్లోడు సమాధానమిచ్చాడు. ఒక ఆడబిడ్డ సహాయం చేయటానికి నా దగ్గరకు వచ్చింది. భర్త చనిపోయి బయటకు రానటువంటి ఆ ఆడబిడ్డ వరద బాధితుల వేదన కొంతైనా తీర్చటానికి తాను దాచుకున్న రూ.2 లక్షలను రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చింది. తన వంతు బాధ్యత నిర్వర్తించకపోతే తాను తప్పు చేసినదానిని అవుతానని నాతో అన్నది. ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకం ఉన్నప్పుడే ఇలాంటివి సాధ్యపడతాయి.' అని చంద్రబాబు అన్నారు.

బెజవాడకు అవార్డులే అవార్డులు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏపీటీడీసీ నేతృత్వంలో హోటళ్లు, పర్యాటక ప్రాంతాలు, ట్రావెల్ ఏజెన్సీలకు అవార్డులను ప్రకటించారు. విజయవాడ నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌కు 'బెస్ట్ త్రీ స్టార్' హోటల్ అవార్డు లభించింది. జింగ్-హయత్ హోటల్‌కు 'బెస్ట్ రెస్టారెంట్', యునైటెడ్ తెలుగు కిచెన్స్‌కు 'బెస్ట్ స్టాండ్ అలోన్' రెస్టారెంట్ అవార్డులు వరించాయి. ఫార్చ్యూన్ మురళీలో పనిచేసే కనికెళ్ల చంద్రశేఖర్‌కు 'బెస్ట్ చెఫ్' అవార్డు లభించింది. నగరానికి చెందిన ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ అనే ఏజెన్సీకి 'బెస్ట్ ట్రావెల్ ఏజెంట్' అవార్డు వరించింది. పర్యాటకాన్ని పెంపొందించే 'బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ'గా అతిథి హాలిడేస్‌కు గౌరవం దక్కింది. 'బెస్ట్ అడ్వెంచర్ టూర్ ఆపరేటర్'గా అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) నిలిచింది.



బీఆర్‌టీఎస్ రోడ్డు గులాబీతోట రైవస్ కాల్వపై ఇరిగేషన్ స్థలంలో అనధికారికంగా నిర్మిస్తున్న భారీ భవనం



ప్రసాదంపాడుకు చెందిన వైసీపీ నేత ఆక్రమించిన బుడమేరు స్థలం (ఇన్‌సెట్‌లో) ఆక్రమణ స్థలంలో నిర్మించిన ఫుట్‌బ్రిడ్జి

కట్టబెట్టేస్తున్నారు..

రైవస్ కాల్వపై రూ.కోట్ల విలువ చేసే స్థలం కబ్జా

బుడమేరు వాగు సృష్టించిన విధ్వంసానికి ప్రధాన కారణం ఆక్రమణలు. 20 మీటర్ల నుంచి 120 మీటర్ల వెడల్పు ఉండాల్సిన బుడమేరు నగరంలో చాలాచోట్ల 10 మీటర్లకే పరిమితమైంది. దీంతో కాల్వ ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయి వరద నీరు నగరాన్ని ముంచెత్తింది. ఇటువంటి పరిస్థితుల్లో బుడమేరు ఆక్రమణలకు చెక్ పెట్టాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు కాసులకు కక్కుర్తిపడి నగరం మీదుగా ప్రవహిస్తున్న రైవస్ కాల్వ గట్లను సైతం ఆక్రమణదారులకు కట్టబెట్టేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన వెయ్యి గజాల స్థలంలో భారీ నిర్మాణం చేస్తున్నా చోద్యం చూస్తున్నారు.

- అనధికారికంగా భారీ భవన నిర్మాణం
- ప్రసాదంపాడులో ఎకరం బుడమేరు స్థలం స్వాహా
- కాసులకు కక్కుర్తిపడి వదిలేస్తున్న నీటిపారుదల శాఖ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/గుణదల) నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, గులాబీతోట ప్రాంతాల్లోని రైవస్ కాల్వ గట్టు మొత్తం ఆక్రమణలకు గురవుతోంది. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోని ఈ స్థలం కబ్జా అవుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. గులాబీతోట వద్ద రైవస్ కాల్వ గట్టుపై సుమారు 1,000 గజాల స్థలంలో ఓ సామాజికవర్గానికి చెందిన కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆనాటి ప్రజాప్రతినిధుల అండతో అడ్డగోలుగా ఈ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు ఆ స్థలంలో జీప్లస్ టూ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. బుడమేరు ఉగ్రరూపం చూసిన స్థానికులు కాల్వ గట్టుపై చేపడుతున్న ఈ భారీ భవన నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోతోంది. తమ భవనానికి కౌన్సిల్‌లో ఆమోదం కూడా పొందామని భవన యజమానులు చెప్పడం గమనార్హం. ఇరిగేషన్ స్థలంలో కార్పొరేషన్ వారు కల్యాణ మంటపానికి అనుమతి ఇవ్వటం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బుడమేరు కాల్వనూ..

విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడుకు చెందిన ఓ వైసీపీ నేత రియల్ ఎస్టేట్ సంస్థతో కలిసి ఏకంగా బుడమేరును ఎకరం మేర కబ్జా చేసి దానికి దొంగ పత్రాలు సృష్టించడం గమనార్హం. దీని విలువ రూ.7 కోట్ల వరకు ఉంటుంది. ఆక్రమించిన బుడమేరు స్థలానికి దొంగ పత్రాలు సృష్టించడానికి గతంలో ప్రసాదంపాడులో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి సహకరించారు. ఈయన ఈ భూమికి ఏకంగా పాస్ పుస్తకాలు, అడంగల్ సృష్టించేయడం గమనార్హం. తొలుత బుడమేరు చెంతనే ఉన్న పట్టా భూమిని తన బంధువుల పేరుపై కొనుగోలు చేసిన ఈ వైసీపీ నేత ఆ తర్వాత బుడమేరును పూడ్చేసి ఎకరా మేర ఆక్రమించేశారు. ఈ మొత్తం భూమికి పట్టా భూమి నెంబరుతోనే పాస్ పుస్తకాలు, అడంగల్ సృష్టించేశారు. ఆక్రమించిన స్థలానికి చేరుకునేందుకు బుడమేరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఫుట్‌బ్రిడ్జి నిర్మించేయడం విశేషం. ప్రస్తుతం ఈ మొత్తం విస్తీర్ణంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థతో కలిసి వెంచర్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొలికపూడి వేధింపుల నుంచి

కాపాడండి

పార్టీ కేడర్‌ను ఇబ్బంది పెడుతున్నారు

- మహిళలను లైంగికంగా వేధిస్తున్నారు
- విజయవాడలో టీడీపీ శ్రేణుల ధర్నా
- మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు



ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తిరువూరు, సెప్టెంబరు 27 : తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. స్థానిక పార్టీ కేడర్‌ను, మహిళలను వేధింపులకు గురిచేస్తున్నాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రి వద్ద శుక్రవారం టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఇటీవల చిట్యాల సర్పంచ్ తుమ్మపల్లి శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మనస్థాపానికి గురైన ఆయన భార్య కవిత నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిట్యాలతో పాటు పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి కవితను పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే లైంగిక వేధింపులపై విచారణ జరిపించాలని, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడిని కలిశారు. ఎమ్మెల్యే తమను వేధిస్తున్నాడని, మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. చిట్యాల గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్లే ఆయన భార్య కవిత ఆత్మహత్యకు యత్నించారని, పార్టీకి నష్టం కలిగించడంతో పాటు కేడర్‌ను ఇబ్బంది పెడుతున్న కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తిరువూరులో జరుగుతున్న పరిణామాలపై పూర్తిస్థాయిలో సమాచారం అధిష్ఠానం దృష్టిలో ఉందని, కేడర్ ఇచ్చిన ఫిర్యాదును కూడా తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.



నేడే నిమజ్జనోత్సవం

భవానీపురం, సెప్టెంబరు 27 : విద్యాధరపురంలోని లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్స్‌లో వేంచేసియున్న 72 అడుగుల మట్టి విజయ మహా గణపతి విగ్రహం నిమజ్జనోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదానం, అనంతరం లడ్డూ వేలం, సాయంత్రం 6 గంటలకు ఉన్నచోటనే నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు డూండీ రాకేశ్ తెలిపారు. కాగా, శుక్రవారం రాత్రి 350 మంది ముత్తయిదువలు వైభవలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

అక్టోబరు 15 తర్వాతే..

రీచ్‌లో ఇసుకు తవ్వకాలకు అధికారుల ప్రయత్నాలు

- స్టాక్ పాయింట్లలో తగ్గుతున్న నిల్వలు
- కేంద్ర అనుమతులు వచ్చాక కొత్త పాయింట్లలో తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలను పెంచడానికి తవ్వకాలు చేపట్టాలని భూగర్భ గనుల శాఖ నిర్ణయించింది. ఇందుకోసం అక్టోబరు 15 తర్వాత ముహూర్తం నిర్ణయించింది. జగ్గయ్యపేట మండలంలో ఉన్న అనుమంచిపల్లి స్టాక్ పాయింట్‌లో 56 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. కంచికచర్ల మండలం మొగులూరు స్టాక్ పాయింట్‌లో 70 వేల మెట్రిక్ టన్నులు, కీసర స్టాక్ పాయింట్‌లో 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. మొత్తంగా జిల్లాలో లక్షా41వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ స్టాక్ పాయింట్ల నుంచి రోజుకు 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయిస్తున్నారు. రోజురోజుకు నిల్వలు తగ్గుతున్న తరుణంలో స్టాకును పెంచాలని అధికారులు నిర్ణయించారు. అక్టోబరు 15 తర్వాత నదిలో గుర్తించిన రీచ్‌ల్లో తవ్వకాలు చేయాలని భావిస్తున్నారు.

నదిలో సర్వే

నదిలో ఇసుక లభ్యత ఎక్కడ ఉందన్న దానిపై ఇప్పటికే సర్వే చేశారు. భూగర్భ గనుల శాఖ, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంయుక్తంగా చేసిన ఈ సర్వేలో చందర్లపాడు మండలంలో మూడు ప్రాంతాలను గుర్తించారు. భూగర్భ గనుల శాఖ, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జగ్గయ్యపేట నుంచి కృష్ణానదిలో సర్వే చేయగా, చందర్లపాడు మండలంలో ఉన్న కాసరబాద్, కాసరబాద్ 4, రుక్కనూరు వంటి 5 ప్రాంతాల్లో 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉన్నట్టు అంచనా వేశారు. అయితే, ఇక్కడ యంత్రాలతో తవ్వకాలకు అవకాశం ఉండదని నిర్ధారించారు. యంత్రాలతో తవ్వితే పర్యావరణానికి విఘాతం కలుగుతుందని భావించారు. ఇక్కడ నీటి లభ్యతతో పాటు ఇసుక లభ్యత ఉంటుందని గుర్తించారు. నదిలో ఇసుకను కూలీలతో తవ్వించి బోట్ల ద్వారా ఒడ్డుకు తరలిస్తారు. అక్కడి నుంచి ఎక్స్‌కవేటర్లతో లారీల్లో పోస్తారు. ఇలా చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వాలి. కేంద్రం నుంచి నిపుణుల బృందం వచ్చి ఈ మూడు ప్రాంతాలను పరిశీలిస్తుంది. కాగా, ఇసుక లభ్యత ఉన్న ఈ మూడు ప్రాంతాల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని భూగర్భ గనుల శాఖ అధికారులు కేంద్ర పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి జగ్గయ్యపేట వరకు మొత్తం 15 రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ 15 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ రీచ్‌లకు పర్యావరణ శాఖ, సీఎఫ్‌వో (కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్స్), సీఎఫ్ఈ (కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతులున్నాయి. కొత్తగా గుర్తించిన ప్రదేశాల్లో ఇసుకను తవ్వడానికి అనుమతులు రావాల్సి ఉంది.

అదిరెన్.. చంద్రయాన్



స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల సందర్భంగా విజయవాడ రైల్వే డివిజన్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో 'వేస్ట్ టూ ఆర్ట్' ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. చంద్రయాన్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

6లో



ముంచేసిన వాన

నగరంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఎక్కడికక్కడ నీరు స్తంభించిపోయింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో బురద పేరుకుని ఉండటం వల్ల బాధితులు ఇబ్బందులు పడ్డారు.

ఖిల్లా.. ఖిల్లాస్!


ఖిల్లాపై ప్రేమకలాపాల్లో మునిగిపోయిన యువ జంట

- ప్రేమికుల అడ్డాగా కొండపల్లి కోట
- నిఘా నిల్ - ప్రేమికులు ఫుల్
- ప్రకృతి అందాల మధ్య యువత ఆగడాలు
- వెళ్లేందుకు భయపడుతున్న పర్యాటకులు

వారికి వీకెండ్‌తో పని లేదు.. సెలవు రోజులు కానవసరం లేదు.. కళాశాలలకు డుమ్మా కొటడ్డం! కొండపల్లి ఖిల్లా ఎక్కేయడం.. అక్కడ పోలీసుల నిఘా లేకపోవడం, అడ్డు చెప్పే వారు, అడిగే వారు లేరనే ధీమా.. యువత పెడదోవ పడుతున్నారనడానికి కొండపల్లి ఖిల్లాపై కనిపిస్తున్న దృశ్యాలే నిలువెత్తు నిదర్శనం.

ఇబ్రహీంపట్నం : మానసిక ప్రశాంతత కోసం పర్యాటక ప్రాంతానికి వెళుతుంటారు చాలా మంది. మంచి పర్యాటక ప్రాంతాన్ని చూసి వీక్షించి ఆనందించి ఆ రోజంతా అక్కడి అందాలను వర్ణించుకుంటూ కుటుంబంతో ఉల్లాసంగా గడిపేస్తుంటారు. అయితే కొంత మంది ఆకతాయిలు ఇప్పుడు పర్యాటక ప్రాంతాలను అసాంఘిక నిలయాలుగా మార్చేస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. పర్యాటక కేంద్రమైన కొండపల్లి ఖిల్లా ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. ముఖ్యంగా ప్రేమ జంటలు కోటను చూసే వంకతో కొండపల్లి ఖిల్లాపైకి వస్తున్నారు. కేవలం రూ.30 టికెట్ ధర చెల్లించి లోనికి వెళ్లి ఎంతసేపు కోటలో ఉంటున్నారో ఏం చేస్తున్నారో ఎవ్వరికీ తెలియని పరిస్థితి. కొన్ని జంటలు కోట లోపలికి వెళ్లి వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. ఎవరు ఏ పొదలో ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఇక్కడ నెలకొంది. కొందరైతే బహిరంగగానే కోట గోడలపైనే అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇక ఖిల్లా రోడ్డులో పొదల్లోకి దారులు ఉన్న చోట టూవీలర్స్ ఆగి ఉంటున్నాయి. ఎక్కడ చూసినా ప్రేమ జంటలే దర్శమిస్తున్నాయి. ముఖ్యంగా కళాశాలకు వెళ్లే యువత ప్రేమ స్పాట్‌గా ఖిల్లాను ఎంపిక చేసుకొని రోజు మొత్తం ఇక్కడే గడిపేస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోటను చూసే అనుమతి ఉంటుంది. అయితే లోనికి వెళ్లే వారు ఏం చేస్తున్నారో సరైన పర్యవేక్షణ లేదు. కోటలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు ఏ ఒక్కటి పని చేయడం లేదు. దీంతో పర్యాటక ముసుగులో ఉన్న ప్రేమ జంటలు మరింత రెచ్చిపోతున్నారు. నిజంగా కోట అందాలను, కొండపైన ప్రకృతి దృశ్యాలను చూద్దామని వెళ్లే వారికి ప్రేమ జంటల వ్యవహారం ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ క్రమంలో కోటకు పర్యాటకుల సంఖ్య తగ్గిపోతూ వస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కోటకు ఉన్న పేరు ప్రఖ్యాతులు ఇలా అసాంఘిక కార్యకలాపాల వల్ల పాడవకుండా ఉండాలంటే గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


ఖిల్లాకెళ్లే దారిలో ఓ జంట..


పనిచేయని సీసీ కెమెరాలు


దుర్గమ్మ సేవలో కర్ణాటక అటవీ పర్యావరణ మంత్రి ఈశ్వర్ ఖండ్రే

దుర్గమ్మ సేవలో కర్ణాటక మంత్రి

వన్‌టౌన్ : కర్ణాటక రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

లడ్డూ కల్తీ ఘటనలో దోషులకు శిక్ష తప్పదు

- జంక్షన్‌లో అఖండ దీపానికి ఘన స్వాగతం


జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో దేవిచంద్ర

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27 : తిరుమల లడ్డూ ప్రసాదం ప్రతిష్ఠను దిగజార్చిన దోషులను వేంకటేశ్వరస్వామి తప్పకుండా శిక్షిస్తాడని పెద్దాపురం శ్రీతారా వారాహి లోక కల్యాణర్ధ సేవా భారత్ ట్రస్ట్ ఫౌండర్, బచ్చు ఫౌండేషన్ చైర్మన్ బచ్చు అవినాశ్ దేవిచంద్ర అన్నారు. లడ్డూ ప్రసాదం అపవిత్రతకు ప్రాయశ్చిత్తంగా 11 రోజుల దీక్షతో పాటు ఈ నెల 23న పెద్దాపురం నుంచి తిరుమలకు అఖండ దీపంతో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం హనుమాన్‌జంక్షన్ చేరుకుంది. స్థానిక అభయాంజనేయ స్వామిని సందర్శించారు. ఈ సందర్భంగా దేవిచంద్ర మాట్లాడుతూ, గత ప్రభుత్వ వైఫల్యమో, బోర్డు సభ్యుల తప్పిదమో లడ్డూ ప్రసాదం విషయంలో పాపం జరిగిందన్నారు. దానికి ప్రాయశ్చిత్తంగా అఖండ దీపంతో పాదయాత్ర చేసి తిరుమల వేంకటేశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.


డీఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కుల వివక్షకు వ్యతిరేకంగా జాషువా రచనలు

గవర్నర్‌పేట : సమాజంలో కుల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడిన కవి జాషువా అని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అనారు. కవి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవీపీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం పూలే, అంబేడ్కర్ భవన్‌లో నివాళి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం తయారు చేసిన విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, జాషువా రాసిన కావ్యాలు ప్రజాదరణ పొందాయన్నారు. డీఎస్సీ విద్యార్థుల కోసం త్వరలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అంకయ్య, న్యాయవాది సంపర శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎస్ లెనిన్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతికుమార్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా ఆపండి

- కాంగ్రెస్ నేత గిడుగు రుద్రరాజు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ప్రశ్నించారు. మచిలీపట్నం బృందావనపుర కళ్యాణ మండపంలో నూతన డీసీసీగా గొల్లు కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రుద్రరాజు మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉండగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు పవన్ కళ్యాణ్ వ్యతిరేకించారని, అవసరమైతే ఆమరణ దీక్షకైనా దిగుతానని చెప్పారన్నారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చినందున కేంద్రంపై వత్తిడి తీసుకు రావాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లు కృష్ణ మాట్లాడుతూ, మండలాల్లో, పట్టణాల్లో కమిటీలను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధనేకుల మురళీమోహన్, వి.సంజీవరెడ్డి, మొవ్వ మోహనరావు, విజయవాడ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కదిలారు..!

ముంపు గ్రామాల్లో ఎన్యూమరేషన్ [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

బాధితులను ఆదుకుంటాం : కేశినేని చిన్ని

కంచికచర్ల, సెప్టెంబరు 27 : విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని చిన్ని చొరవతో ఎట్టకేలకు మండలంలో వరద ముంపునకు గురైన ఇళ్ల వివరాలను సేకరించేందుకు రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ముంపుబారిన పడిన ఇళ్లను శుక్రవారం సాయంత్రం నుంచి అధికారులు ఎన్యూమరేషన్ చేస్తున్నారు. ఒకవైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద వల్ల మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి, పెండ్యాల గ్రామాల్లో వందలాది ఇళ్లు ముంపునకు గురయ్యాయి. బాధితులకు జరిగిన నష్టం గురించి 'మాకు సాయం చేయరా?' అంటూ 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఎంపీ కేశినేని చిన్ని స్పందించారు. కలెక్టర్ సృజనతో పాటు కంచికచర్ల తహసీల్దార్ జాహ్నవితో ఫోన్‌లో మాట్లాడారు. తొమ్మిది గ్రామాల బాధితులకు ప్రభుత్వసాయం అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో తక్షణమే ఎన్యూమరేషన్ పూర్తి చేసి సాయం అందేలా చూడాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం సాయంత్రం నుంచి గ్రామాల్లో ఇళ్ల ముంపు బాధితుల వివరాలు సేకరణ ప్రారంభించారు.

ప్రజా సంక్షేమంలో బ్యాంకర్ల పాత్ర కీలకం

- ప్రాధాన్య రంగానికి రూ.27 వేల కోట్ల ప్రతిపాదనలు
- బ్యాంకుల వారీగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలి
- బ్యాంకర్లు ముంపు ప్రభావిత ప్రజలకు అవసరమైన సేవలు అందించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన


బ్యాంకింగ్ వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 27 : ప్రజా సంక్షేమం, ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకొనేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన బ్యాంకర్లను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన 9వ జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాలు జరిగాయి. తొలుత కలెక్టర్ సృజన, ఎల్‌డీవో పీఎం పూర్ణిమ, సమావేశ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, ఎల్‌డీఎం కె.ప్రియాంకతో కలిసి 2024-25 ఆర్థిక సంవత్సర బ్యాంకింగ్ వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక కింద వ్యవసాయ రంగానికి రూ.13,400 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.11,300 కోట్లు రుణ లక్ష్యాలను నిర్దేశించినట్టు తెలిపారు. మొత్తం ప్రాధాన్య రంగానికి రూ.27 వేల కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.46 వేలకోట్ల మేర లక్ష్యాలను రుణ ప్రణాళికలో పొందుపరిచినట్టు వివరించారు. ఇతర ప్రాధాన్య రంగానికి రూ.2,300 కోట్ల రుణాలను ప్రతిపాదించినట్టు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళిక లక్ష్యాల్లో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు పురోగతిని చూస్తే ప్రాధాన్య రంగంలో 37.81 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 50.47 శాతం, మొత్తం వార్షిక ప్రణాళికలో 45.79 శాతం మేర లక్ష్యాలను చేరుకున్నట్టు వివరించారు. పూర్తిస్థాయిలో రుణ లక్ష్యాలను చేరుకొనేందుకు బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు దిశగా ప్రోత్సహించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రధానమంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిధి, ఆర్థిక అక్షరాస్యత, ఏపీ టిడ్కో-పీఎంఏవై(యూ) తదితరాలపైనా సమావేశంలో చర్చించారు.

వరద ప్రభావిత ప్రజలకు కీలకం..

గతంలో ఎప్పుడూ లేనివిధంగా విజయవాడ అర్బన్‌తో పాటు పరిసర ప్రాంతంలో ముంపు నష్టం వాటిల్లిందని, బాధితులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు వీలుగా వారికి బ్యాంకింగ్ సేవల ద్వారా ఆర్థిక చేయూతనివ్వాల్సి వుందన్నారు. ఇప్పటికే బ్యాంకింగ్ ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా రీ షెడ్యూలింగ్, కొత్త మూలధన రుణాల మంజూరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతోందని, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రకృతి విపత్తు ప్రభావిత జిల్లాల్లో ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సేవలు అందించాలని స్పష్టం చేశారు. సమావేశానికి వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయండి

- కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ బాలాజీ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరునుంచి గృహనిర్మాణశాఖ అధికారులతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గృహనిర్మాణం చేసుకునే లబ్ధిదారులతో అధికారులు శనివారం సమావేశాలు నిర్వహించి, పనులను వేగవంతం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని ఇంటినిర్మాణ పనులను వచ్చేఏడాది మార్చినెలనాటికి పూర్తిచేసేలా ప్రణాళికను రూపొందించాలన్నారు. గృహనిర్మాణంలో భాగంగా ప్రభుత్వం నుంచి ఇనుము, ఇసుక, సిమెంటు తదితర సామగ్రిని త్వరితగతిన ఇస్తామని హామీ ఇచ్చిపనులు ప్రారంభించేలా లబ్దిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ ఈఈ వెంకట్రావ్, డీఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాలు పెరగాలి

- దగ్గుబాటి పురంధేశ్వరి



మాట్లాడుతున్న దగ్గుబాటి పురంధేశ్వరి

వన్‌టౌన్, సెప్టెంబరు 27 : రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాలు పెరగాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. భవానీపురం ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సభ్యత్వ నమోదుపై జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో సభ్యత్వాలు ఇప్పటి వరకు 12లక్షలు మాత్రమే అయ్యాయని, లక్ష్యాలకు చేరువ కావాలని చెప్పారు. అక్టోబరు 15వరకు జరగనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు. దేశంలో 18 కోట్ల సభ్యత్వాలతో బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఉందన్నారు. సభ్యులు కూడా ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వాలను పునరుద్ధరించుకోవాలన్నారు. మోదీ సమర్థవంత పాలన చూసి ప్రజలందరూ స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఆమె విమర్శించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీపై హిందువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సిట్ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే రూ.12,500 కోట్లు, రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు, అనంతపురం నుంచి అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకు రూ.29వేల కోట్లు నిధులు అందించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లాభాల బాటలోకి తీసుకురావటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏపీకి రైల్వే జోన్ అంశం కూడా పరిశీలనలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కుగా భావిస్తున్న అన్ని అంశాలను దశల వారీగా అమలు చేస్తామని చెప్పారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకేరోజున 13వేల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు నెలకొల్పారన్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద మీనన్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కృష్ణదాస్, ఏపీ ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సేవలు పూర్తి ఉచితం

- రుసుం వసూలు చేసినట్టు ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ సృజన



కృష్ణలంక : పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు వైద్య సేవలపై రోగుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేసినా ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు పథక సేవల అమలుపై శుక్రవారం కలెక్టర్ సృజన కలెక్టరేట్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పథకం అమలుతీరుపై సమీక్షించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం పరిధిలోని నెట్‌వర్క్ ఆస్పత్రులలో నిబంధనలు అతిక్రమించి, వసూళ్లకు పాల్పడిన కొన్ని ఆస్పత్రులకు కలెక్టర్ జి.సృజన అధ్యక్షతన క్రమశిక్షణా కమిటీ జరిమానాలు విధించింది. భవిష్యత్తులో ఇలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందించాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ పేర్కొన్నారు. రోగులకు సేవలందించే విషయంలో వైద్యమిత్రలు, టీంలీడర్లు నిరంతరం అప్రమత్తంగా వుండాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్ పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో మరో ఐదుగురు ఇంజనీర్ల బదిలీ

- ఇప్పటి వరకు 29 మందిపై చర్యలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29 : ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహించి యూనిట్లు ఆగిపోయేందుకు కారణమైన ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నతాధికారులపై క్రమశిక్షణ చర్యల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో శుక్రవారం మరో ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులను బదిలీ చేస్తూ జెన్కో యాజమాన్యం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటి వరకు మొత్తం 29 మంది ఇంజనీరింగ్ అధికారులను బదిలీ చేస్తూ సీరియస్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తుంది. ఇంజనీరింగ్ విభాగంలో ఆస్థాయిలో గతంలో ఎన్నడూ ఎన్టీటీపీఎస్‌లో బదిలీలు జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు జరుగుతున్న బదిలీల వెనుక బలమైన కారణాలు ఉన్నట్టు తెలుస్తున్నది. యూనిట్లు ఆగిపోవడం, వాటిని సకాలంలో పని చేయించలేకపోవడం వెనుక చాలా మంది ఇంజనీర్ల నిర్లక్ష్య ధోరణిపై జెన్కో యాజమాన్యం మండిపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బదిలీలు జరుగుతున్నాయని టాక్ నడుస్తుంది.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్-2024

లబ్బీపేట, సెప్టెంబరు 27 : జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో అక్టోబరు 13వ తేదీ ఉదయం 6 గంటలకు 'ఇండియా పోస్ట్ రన్ 2024'ను గుంటూరులో నిర్వహిస్తున్నట్టు పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి తెలిపారు. కృష్ణలంక బాలాజీనగర్‌లోని పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో క్రీడాకారులను, యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంగా ఈ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 5కె, 10కె విభాగాలలో, 3కె రన్ ఫన్ రన్‌గా నిర్వహించడం జరుగుతుందని, 5కె, 10కె పురుషుల, మహిళల విజేతలకు రూ.2,40,000 వరకు నగదు రివార్డులు అందించడంతో పాటు, రన్‌లో పాల్గొనే వారికి టీషర్టు, ఫినిషర్స్ మెడల్, హైడ్రేషన్, న్యూట్రిషన్ సపోర్ట్, వైద్య సదుపాయం అందించడం జరగుతుందని తెలిపారు. 3కె రన్ 1.5కిలోమీటరు, 5కె రన్ 2.5 కిలోమీటరు, 10కె రన్ 5కిలోమీటర్లు, 25సంవత్సరాల లోపు, 25 నుంచి 40 ఏళ్ల లోపు, 40ఏళ్ల పైబడిన విభాగాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రన్ గుంటూరులోని ఎల్ కాలేజీ నుంచి ప్రారంభమై గవర్నమెంటు మెడికల్ కాలేజీ హస్టల్, ప్రభుత్వ ఫీవర్ హస్పటల్, హోసన్నా మందిర్ మీదుగా తిరిగి ఎల్ కాలేజీ వరకు కొనసాగుతుందన్నారు. రన్‌ను మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారని, పాల్గొనదలచిన వారు తమ వివరాలను ఇండియా పోస్ట్‌రన్‌ఏపీ.ఐక్యూ301.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, విజేతలకు అదేరోజు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

న్యూస్ బాక్స్

మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా శిరీషరాణి



విజయవాడ : హైకోర్టు న్యాయవాది వల్లభనేని శిరీషరాణిని ఆంధ్రా రీజియన్(నెల్లూరు, ప్రకాశం మినహా) లోని మున్సిపాలిటీలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మూడేళ్లపాటు ఈమె బాధ్యతల్లో కొనసాగుతారు. శిరీషరాణి స్వస్థలం ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ముదినేపల్లి మండలం చేవూరు.



బెస్ట్ ఔట్‌గోయింగ్ వైద్య విద్యార్థినిగా అన్విత

విజయవాడ : సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల బెస్ట్ ఔట్ గోయింగ్ విద్యార్థినిగా అన్విత పుట్టగుంట ఎంపికయ్యారు. 2019 నుంచి 2024 వరకు వరుసగా నాలుగేళ్ల కళాశాలలో అత్యుత్తమ విద్యా ప్రదర్శనకు గాను ఓవరాల్ బెస్ట్ స్టూడెంట్‌గా నిలిచి ఈ పురస్కారాన్ని సాధించారు. అన్విత ప్రముఖ పారిశ్రామికవేత్త, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీశ్ కుమార్తె. శుక్రవారం కళాశాలలో అన్వితకు మెమొంటో, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు.

జిల్లా రవాణా శాఖ అధికారిగా మనీషా బాధ్యతల స్వీకారం




మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా నూతన రవాణా అధికారి జి.మనీషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మను మనీషా మర్యాద పూర్వకంగా కలిశారు.

జగ్గయ్యపేట వైసీపీ ఇన్‌చార్జ్‌గా తన్నీరు నియామకం



జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌గా తన్నీరు నాగేశ్వరరావును నియమించారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు పార్టీ కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. తన్నీరు నాగేశ్వరరావు కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా, మునిసిపల్ చైర్మన్‌గా పనిచేశారు. వైసీపీ పంచాయతీ చాంబర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. విజ్ఞాన్ స్కూల్స్ అధినేతగా ఉన్న తన్నీరు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచి సామినేని ఉదయభాను ముఖ్యఅనుచరుడిగా, సన్నిహితుడిగా పేరుగాంచారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తానని, సంచలనాల కోసం వివాదాస్పద అంశాల జోలికి వెళ్లబోమని చెప్పారు.


జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సమ్మెలో పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమ్మె

మచిలీపట్నం టౌన్ : పారిశుధ్య కార్మికుడు ఫణీంద్రను తొలగించినందుకు నిరసనగా శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో ఆసుపత్రిలో ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోయింది. 120 మంది పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆందోళన చేపట్టారు.

వేస్ట్ టూ ఆర్ట్

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్



రైల్వే స్టేషన్, సెప్టెంబరు 27 : స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలు సందర్భంగా విజయవాడ రైల్వే డివిజన్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో వేస్ట్ టూ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎన్విరాన్‌మెంటల్, హౌస్‌కీపింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లోని అంశాలను ఆయన తిలకించారు. ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, రైల్వేలోని అన్ని విభాగాల సిబ్బంది, కాకినాడ, విజయవాడ, నరసాపూర్, మచిలీపట్నం డిపోలకు చెందిన విద్యార్థులు, సిబ్బంది ఎగ్జిబిషన్‌లో తాము తయారుచేసిన అంశాలు ప్రదర్శించారు. మెటల్ స్క్రాప్ నుంచి రూపొందించిన అశ్వాన్ని విజయవాడ వేగన్ డిపో సిబ్బంది రూపొందించారు. డీఆర్ఎం మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన భారతదేశాన్ని, రైల్వేలను చూసేందుకు స్వచ్ఛతా హి సేవ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటి వరకు విజయవాడ రైల్వే డివిజన్ 1200 ఈవెంట్‌లను నిర్వహించిందని, ఈరోజున నిర్వహించిన వేస్ట్ టూ ఆర్ట్ ప్రాజెక్టు రీ సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. అదనపు డీఆర్ఎంలు పి.ఈ. ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, తదితరులు పర్యావరణ పరిరక్షణ, తదితరాల గురించి మాట్లాడారు. విద్యార్థులు కల్చరల్ ఫెస్ట్‌లో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందచేశారు. డీఈఎన్ ఎం.కిషోర్ వందన సమర్పణ చేశారు.


వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం ఎ పాటిల్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

రేషన్ బియ్యం పట్టివేత

పాయకాపురం, సెప్టెంబరు 27 : నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం నున్న గ్రామంలో రేషన్ బియ్యం తరలిస్తున్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రెండు వాహనాల్లో బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు వాహనాలను స్వాధీనపరచుకుని నున్న రూరల్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టూరిజంలో ఉపాధి అవకాశాలు మెండు

ఎస్ఆర్ఆర్‌లో టూరిజం డే వేడుకలు

కృష్ణలంక, సెప్టెంబరు 27 : ప్రస్తుత తరుణంలో టూరిజంకి ఎన్నో అవకాశాలున్నాయని, ఈ కోర్సు చదవడం వల్ల విద్యార్థులు మంచి ఉద్యోగాలు పొందే అవకాశం వుందని ఈ కోర్స్‌ని విస్తృతం చేయాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి కోరారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ టూరిజం డే జరిగింది. ప్రపంచ టూరిజం డే పురస్కరించుకొని చరిత్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ బి.ప్రకాశం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.హరిప్రసాద్ టూరిజం డే ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. టూరిజంలో వున్న ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కె.అజయ్‌బాబు, ఎ.ఉమా తరంగిణి, కె.మల్లేశ్వరి, ఫాతిమా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో..

మొగల్రాజపురం: సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భారతదేశ మ్యాప్‌లో ఏ రాష్ట్రం దేనికి ప్రసిద్ధి, అక్కడి సంప్రదాయాలు, వస్త్రధారణ, పంటలు, పర్యాటక ప్రదేశాలు, అభిరుచులు తెలిపే విధంగా పొందు పరిచారు. అనంతరం విద్యార్థులు ఆయా రాష్ట్రాల సంప్రదాయాలను తెలిసేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. చివరలో పర్యాటక ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల ర్యాలీ

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములుకండి

భారతీనగర్, సెప్టెంబరు 27: నగర అందాలను మరింత పెంచటానికి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల ప్రకారం శుక్రవారం మూడవ డివిజన్‌లోని కామినేని నగర్ డొంకరోడ్లో నగర పాలక సంస్థ అధికారుల సమక్షంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని గోడపై పెయింటింగ్స్ వేశారు. అనంతరం కాలనీలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్లంట్రాన్స్‌ఫర్మేషన్ చేస్తున్నామన్నారు. నగర పరిధిలో ఉన్న మురికి వాడల్లో అందమైన వాల్ పెయింటింగ్స్ ద్వారా ఒక అందమైన మార్పుని తీసుకు వస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఈఈ స్వామ్రాజ్యం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



గోడపై పెయింటింగ్ వేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులో గద్దె పరిశీలన

ఆటోనగర్: ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులో వర్షపు నీటిలో మునిగి పోయిన రహదారిని శుక్రవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వర్షపునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 13 డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

వన్‌టౌన్, సెప్టెంబరు 27: భవానీపురం 40వ డివిజన్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో వరద బాధిత విద్యార్థి సాయిలోహిత చదువు నిమిత్తం కాండ్రేగుల రవీంద్ర రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పొనుగుపాటి చిన సుబ్బయ్య, నారాయణ, మన్నం నారాయణరావు, కె.శ్రీనివాసరావు, సి.హెచ్.రామానాయుడు, నాదెండ్ల అంకయ్య, ఆనందరెడ్డి, ప్రసాద్, వెంకటనారాయణ, సుబ్బారావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొండరాళ్ల తొలగింపు

వన్‌టౌన్, సెప్టెంబరు 27: ఇటీవల సంభవించిన వరదలు, తీవ్ర వానలు కారణంగా పశ్చిమలోని షాజహూర్ ముసాఫిర్ ఖానా భవనంపై పడిన కొండరాళ్లను శుక్రవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొండకు ఆనుకుని ఉన్న భవనంపై నానుడు వానలు కారణంగా కొండచరియలు పెద్దఎత్తున విరిగిపడ్డాయి. తాజాగా వాటిని తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ పరిశీలించి తగు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, సెప్టెంబరు 27 : భవానీపురం 11కేవీ హెచ్‌బీ కాలనీ, ఫీడర్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఐజీ, ఎల్ఐసీ ఆఫీసు, రిలయన్స్ ఫ్రెష్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా....

శివపంచాక్షరీ స్తోత్రాలు ఆలపించిన వీరమహిళలు



కృష్ణలంక, సెప్టెంబరు 27 : పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా శుక్రవారం కృష్ణలంకలోని పాతపోలీస్ స్టేషన్ రోడ్డులో గల కోదండ రామాలయంలో లలితా సహస్రనామం, శివపంచాక్షరీ స్తోత్రాలను జనసేనకు చెందిన వీర మహిళలు ఆలపించారు. ఈ కార్యక్రమం జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పోతిరెడ్డి అనిత పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మండలి రాజేష్, అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, ఎన్నమనేని కృష్ణ, కొవ్వూరు కిరణ్‌బాబు, పుప్పాల సుబ్బారావు, పోతిరెడ్డి రమణ, మోహన్‌ప్రసాద్, జీవీ చందు శివరామకృష్ణ, టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

పాత శివాలయం ఈవోగా షణ్ముగం బాధ్యతల స్వీకారం

వన్‌టౌన్, సెప్టెంబరు 27: స్థానిక శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం) ఈవోగా నటరాజన్ షణ్ముగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పాత శివాలయం ఈవోగా పనిచేసిన కె.సురేష్ వేదాద్రి దేవస్థానానికి బదిలీ అయ్యారు. గుడివాడలోని శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహించిన నటరాజన్ షణ్ముగం పాత శివాలయం ఈవోగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈవోగా పనిచేసిన సురేష్ షణ్ముగంకు బాధ్యతలు అప్పగించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నటరాజన్ షణ్ముగం

వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సన్యాసిరావు

స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా నాగం సన్యాసిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి ఇన్‌ఛార్జి ఈవోగా బాధ్యతలు నిర్వహించిన జి.కొండూరు గ్రూపు టెంపుల్ ఈవో మోహనరావు దినవహి వారి సత్రానికి బదిలీ అయ్యారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా పనిచేసిన నాగం సన్యాసిరావు బ్రాహ్మణవీధి వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ఆలయంలో గుమస్తాగా పనిచేసిన అజయ్ అంబారుపేట దేవస్థానానికి, ఆయన స్థానంలోకి కృష్ణాజిల్లా, మచిలీపట్నంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గుమస్తాగా పనిచేస్తున్న మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఆయన కూడా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

దుర్గగుడి ఏసీగా సాంబశివరావు

శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం దత్తత సంస్థ సీవీ రెడ్డి చారిటీస్ సహాయ కమిషనర్‌గా నూతక్కి సాంబశివరావు బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నెమలి దేవస్థానంలో బాధ్యతలు నిర్వహించిన ఆయన కృష్ణాజిల్లా సహాయ కమిషనర్‌గా, దుర్గగుడి ఏసీగా బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా ఏసీగా రెండు రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న ఆయన శుక్రవారం దుర్గగుడి ఏసీగా బాధ్యతలు స్వీకరించారు.

బాధితులకు నిత్యావసరాల కిట్ల పంపిణీ

భవానీపురం, సెప్టెంబరు 27 : కబేళా, రామరాజ్యనగర్‌ల్లో వరద బాధితులకు సమరసత సేవా ఫౌండేషన్ సేవాభారతి ఆధ్వర్యంలో 241 కుటుంబాలకు నిత్యావసరాల కిట్లను స్థానిక కళ్యాణ వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ఆర్ఎస్ఎస్ ప్రాంతా కార్యకరణ్ పాకాల త్రినాథ్, వివేకానంద ఫౌండేషన్ సభ్యులు రమణ, వెంకటేశ్వరస్వామి గుడి కమిటీ సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను గుర్తించి వారికి నిత్యావసరాలను అందించామని బాధ్యులు శివశంకర్, జయశంకర్, స్థానికులు బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

నలందలో లిటిల్ చాంప్స్ ఒలింపియాడ్ పోటీలు రేపు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 27: నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో ఈనెల 29న రెండేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు ఎన్‌వీఎన్ లిటిల్ చాంప్స్ పేరుతో వివిధ పోటీలు కేటగిరి వారీగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాదల పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌వీఎన్ కార్నివాల్ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 8 గంటలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎంట్రీ ఫీజు లేదని, నగర చిన్నారులు అందరూ పాల్గొనవచ్చని తెలిపారు.



పైలెట్ ట్రైనింగ్ కన్సల్టెన్సీ వెబ్‌సైట్ ఆవిష్కరణ

పటమట, సెప్టెంబరు 27 : అశోకన్‌నగర్‌లోని తూర్పు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పైలెట్ ట్రైనింగ్ కన్సల్టెన్సీ వెబ్ సైట్‌ను టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కన్సల్టెన్సీ ద్వారా ఇతర దేశాల్లో పైలెట్ ట్రైనింగ్ స్కూల్స్‌లో తక్కువ ధరకు ట్రైనింగ్ ఇప్పించడం జరుగుతుందన్నారు. యువతంతా ఎక్కువ ఉపాధి అవకాశాలున్న పైలెట్ శిక్షణ తీసుకోవాలని సూచించారు. పైలెట్ కన్సల్టెన్సీ యజమాని తెన్నేటి ఉదయ్ మాట్లాడుతూ తాను పైలెట్‌గా శిక్షణ పొందే సమయంలో తనకు సరైన మార్గం చూపేవారు లేక ఎన్నో ఇబ్బందులకు గురయ్యాయని, తన లాగా ఎవరూ ఇబ్బంది పడకూడదని ఉద్దేశ్యంతో తాను ఈ కన్సల్టెన్సీని స్థాపించానన్నారు. తాము ఇండియా, కెనడా, ఆస్ట్రేలియాలో పేరు ప్రఖ్యాతలు కలిగిన ఏడు ట్రైనింగ్ సెంటర్‌లు అనుసంధానం అయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కిలారు శ్రావణ్, పొట్లూరి దర్శిత్, తుమ్మల వెంకట్, ఎం నితిన్, ఎన్ చిన్న నాగేశ్వరరావు, జె వెంకట్‌సాయిలు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 27 : సేవా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వరద బాధిత ప్రాంతాల్లో భోజన ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. సంస్థ ఛైర్మన్ పల్లెపోగు సలోమీ ప్రసాద్ జక్కంపూడి కాలనీలోని వరద బాధితులకు, నిరాశ్రయులైన 400 మందికి భోజన ప్యాకెట్లను అందజేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

భవానీపురం,సెప్టెంబరు 27 : 45వ డివిజన్ బృందావన్ కాలనీ కరెంట్ ఆఫీసు రోడ్డుకు అనుసంధానంగా రూ. 19.70లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టే రోడ్డు సీసీ రోడ్డు పనులకు టీడీపీ సీనియర్ నాయకుడు మైలవరపు కృష్ణ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ బుచ్చిబాబు, స్థానిక నాయకులు వెంకటయ్య, అబ్రహం,శివ, కాంట్రాక్టర్ తిరుపాల్‌లు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పోకు విశేష స్పందన



విజయవాడ, ఆంధ్రజ్యోతి : లబ్బీపేటలోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - వస్త్ర ప్రదర్శన, అమ్మకాలకు విశేష స్పందన లభిస్తోంది. దసరా పండుగ సరదాగా జరుపుకొనేందుకు అద్భుతమైన వస్త్రాలు, వివాహ వేడుకల కోసం సంప్రదాయ వస్త్రాలు, వేర్వేరు రాష్ట్రాలకు చెందిన అన్ని రకాల మగ్గం ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు మొదలైన వాటికి 50 శాతం తగ్గింపును ఇస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈనెల 30వ తేదీ వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది.

బెజవాడ బార్‌కు వాటర్ కూలర్ బహుకరణ



విజయవాడ లీగల్, సెప్టెంబరు 27 : బెజవాడ బార్ అసోసియేషన్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం సర్కిల్ హెడ్ అభిజిత్ సింహ శుక్రవారం వాటర్ కూలర్ బహుకరించి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అభిజిత్ సింహను న్యాయవాదులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా), కంచర్ల రవి, జేకే చక్రవర్తి, సంపర శ్రీనివాస్, కలతోటి క్రాంతికుమార్, జీవీ రామశర్మ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయంపై దృష్టి పెట్టండి

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 27 : ప్రజా ప్రతినిధులు రాజకీయ వివాదాలు కట్టిబెట్టి వరద బాధితుల సహాయంపై దృష్టి పెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి వరద బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులు బ్యాంకు ఖాతాలతో వస్తున్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు లోపాలను సరిదిద్ది వరద బాధితులకు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

ప్రజల మన్ననలు పొందుతున్న చంద్రబాబు



చిట్టినగర్, సెప్టెంబరు 27: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల నోట ఇది మంచి ప్రభుత్వం అని మన్ననలు పొందుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ కొనియాడారు. శుక్రవారం 48వ డివిజన్ చిట్టినగర్ సొరంగం రోడ్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై టీడీపీ స్థానిక నాయకులతో ఎంఎస్ బేగ్ సమావేశం అయ్యారు. ప్రభుత్వం 100 రోజుల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం పథకాలపై నాయకులతో మాట్లాడారు. అనంతరం డివిజన్ అధ్యక్షులు ఎంఎస్ బేగ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరాబత్తుల రమణ, కూటమి నాయకులు ఉప్పాడి రాము, పిళ్లా వెంకన్న, తమ్మిన సోమేష్, చొక్కర అప్పారావు, గుండాల నాని, గుండపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

వన్‌టౌన్, సెప్టెంబరు 27: స్థానిక పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ ఎలక్ట్రానిక్స్ మూడో సంవత్సరం విద్యార్థులు శుక్రవారం గుంటూరు జిల్లా డోకిపర్రులోని జోసియల్ లిమిటెడ్ కంపెనీలో ఇండస్ట్రియల్ విజిట్ చేశారు. 100 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కంపెనీలో టాయిలెట్ సోపులు, ఫ్యాటీయాసిడ్స్, రిఫైన్డ్ గ్లిజరిన్ తయారు చేయటంతో పాటు ప్లాస్టిక్, పెయింట్స్, టైర్లు, మెటల్ పాలిష్ వంటి వస్తువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను ఇక్కడ తయారు చేస్తారు. ఆరు మెగా వాట్ల బయోమాస్ పవర్ ప్లాంట్ ఉంది. వీటన్నింటినీ విద్యార్థులు సందర్శించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇండస్ట్రియల్ విజిట్ ఇన్‌ఛార్జి డీడీవీ ప్రసాద్, డిపార్టుమెంట్ కో-ఆర్డినేటర్లు కె.వంశీకృష్ణ, ఆర్.శ్రావణిలు ఆధ్వర్యంలో విద్యార్థి బృందం ఇండస్ట్రియల్ విజిట్ చేసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణల అనుమతితో ఇండస్ట్రియల్ విజిట్‌కు వెళ్లారు.

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు



కొరటాల శివ

'మా అందరి నాలుగేళ్ల కష్టమే 'దేవర' చిత్రం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ఇస్తున్న రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లకు ధన్యవాదాలు. నందమూరి అభిమానులకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం. 'దేవర' కోసం దర్శకుడు కొరటాల శివ చాలా కష్టపడ్డారు. ఎన్టీఆర్ ఇరగదీశాడు. తను వన్ మ్యాన్ షో చేశాడు. నాకెంతో గర్వంగా ఉంది' అన్నారు కల్యాణ్‌రామ్. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంతో ఆయన నిర్మించిన 'దేవర' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెలబ్రేషన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత కొరటాల శివ మాట్లాడుతూ 'ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మూడేళ్ల కష్టం 'దేవర. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, సుధాకర్‌లకు ధన్యవాదాలు. చివరి నిముషం వరకూ అందరూ కష్టపడ్డారు. అందుకే ఇంత పెద్ద విజయం దక్కింది' అన్నారు. 'దేవర' చిత్రాన్ని తెలంగాణలో విడుదల చేసిన దిల్ రాజు మాట్లాడుతూ ' స్టార్ హీరో సినిమా రిలీజ్ అనగానే పండగ వాతావరణం ఉంటుంది. నేను రాత్రి సినిమా చూశా. ఈ చిత్రం ఇంత పెద్ద విజయం సాధించిందంటే కారణం ఎన్టీఆరే. వన్ మ్యాన్ షోతో సినిమాను నిలబెట్టారు' అన్నారు.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

'ఢిల్లీలో మీ స్నేహితులు...' అనకుండా ఉండాల్సింది'

● ప్రకాశ్‌రాజ్ ఉద్దేశం నాకు అర్థమైంది - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



'ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియా ద్వారా వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో పెట్టిన ఓ పోస్ట్‌లో పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి 'మీ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్నాయి... కేంద్రంలోని మీ స్నేహితులకు ధన్యవాదాలు' అని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేయడం దుమారం రేపింది. దీనిపై తాజా ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో నేను స్పందిస్తే... 'ఢిల్లీలో మీ స్నేహితులు...' అంటూ కామెంట్ చేయాల్సిన అవసరం ప్రకాశ్‌రాజ్‌కు లేదు. ఆయన పోస్ట్‌ను నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని చెప్పారు. 'ప్రకాశ్‌రాజ్ నాకు మంచి మిత్రుడు. రాజకీయంగా దారులు వేరైనా మా మధ్యన ఒకరంటే ఒకరికి గౌరవం ఉంది. ఆయనతో కలసి పనిచేయడం ఇష్టం' అని కూడా పవన్ చెప్పారు.

మనకేం కావాలి.... ప్రకాశ్‌రాజ్ తాజా ట్వీట్

తిరుపతి లడ్డూ కల్తీ వివాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రకాశ్‌రాజ్ శుక్రవారం మరోసారి సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దిగారు. అందులో 'మనకేం కావాలి... ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి... తద్వారా రాజకీయ లబ్ధిని సాధించడమా? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా...పరిపాలనా సంబంధమైన... అవసరమైన తీవ్రమైన చర్యలతో... సున్నితంగా సమస్యను పరిష్కరించుకోవడమా?' అంటూ పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించకుండా ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు.

మూల్యం చెల్లించుకోకతప్పదు - ఖుష్బూ

లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. తిరుమల లడ్డూను కల్తీ చేసినవాళ్లు ఎవరైనా మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. 'ఆ వేంకటేశ్వర స్వామి అంతా చూస్తున్నాడు. లడ్డూను కల్తీ చేయడం అంటే కోట్లాది మంది ప్రజల విశ్వాసాలు, మనోభావాలు దెబ్బతీయడమే. అని ఖుష్బూ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం ● 28 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com



వంద రోజుల్లో విజయాలెన్నో...

ఆరు హిట్స్.. అనేక ఫ్లాపులతో చిత్రసీమ ప్రథమార్థాన్ని ముగించింది. అతి కీలకమైన ద్వితీయార్థంలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాలలో.. భారీ చిత్రాలు అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పటికే మూడు నెలలు ముగిశాయి. ఇక ఉన్నది మూడు నెలలే.. ఈ మూడు నెలల్లో అరడజను భారీ చిత్రాలు క్యూలో ఉండటం విశేషం. వాటిలో అలరించేవి ఎన్ని.. చరిత్ర సృష్టించేవి ఏవి.. అంచనాలను తారుమారు చేసేవి ఎన్నో తెలియాలంటే ఏడాదిలోని ఆఖరి వారం వరకూ వేచి చూడాల్సిందే.

పుష్పరాజ్ కోసం ఎదురుచూపులు

2021లో విడుదలైన 'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఏ రేంజ్‌లో సత్తా చాటిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని దర్శకుడు



సుకుమార్ మంచి హైప్‌తో క్లైమాక్స్‌ను ముగించారు. మొదటి భాగానికి మించిన హిట్ కొట్టాలనే లక్ష్యంతో మేకర్స్ ఈ సీక్వెల్‌ను చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దుతున్నారు. మొదటి భాగంలో పుష్పరాజ్‌గా అందరినీ అలరించిన అల్లుఅర్జున్.. రెండో భాగం 'పుష్ప:ద రూల్'లో ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని అభిమానులు ఆసక్తిగా కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

గేమ్ చేంజర్‌గా...

రామ్‌చరణ్, డైరెక్టర్ శంకర్ కలయికలో తెరకెక్కుతోన్న మాగ్నమ్ ఆపస్ ఎంటర్టైనర్ 'గేమ్ చేంజర్'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని టాక్. అందులో ఒక పాత్ర అవినీతితో పోరాటం చేస్తుందని సమాచారం. ఈ సినిమాపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డిసెంబరు 20న ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

దసరాకి వేట మొదలు

'జై భీమ్' ఫేమ్ టీ.జే.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమి





తాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహద్ ఫాజిల్, మంజువారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. రజనీకాంత్, అమితాబ్ 33 ఏళ్ల తర్వాత కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కన్నప్ప కనువిందు...

మంచు విష్ణు నటిస్తున్న మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప'. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. ఇందులో ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ సహా పలువురు తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను కేన్స్ చిత్రోత్సవంలో విడుదల చేయడం విశేషం. డిసెంబర్ 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోరాట యోధుడి పాత్రలో...

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా.. నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. నవంబర్ 14న దాదాపు పది



భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో సూర్యకు పాన్ ఇండియా గుర్తింపు ఖాయం అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

గోపీచంద్ విశ్వం

గోపీచంద్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న గోపీచంద్‌కు, శ్రీనువైట్లకు ఈ సినిమా రిజల్ట్ కీలకం కానుంది. దసరా కానుకగా అక్టోబర్ 11న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

9 ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 28 సెప్టెంబరు 2024

అల్లం... అమృతం



తడిగా ఉన్న అల్లపు దుంపని ఆర్ద్రకం అంటారు. దీనినే శృంగవేరి అనికూడా పిలుస్తారు. ఎండిన అల్లానికి శొంఠి అని పిలుస్తారు. ఎండిన అల్లానికి కొమ్ములు ఉంటాయి కాబట్టి- దీనిని తెలుగులో శొంఠి కొమ్ము అనటమూ ఉంది. కర్ణాటకలోని శృంగేరీ ప్రాంతంలో అల్లం బాగా పండుతుంది కాబట్టి ఆ ప్రాంతాన్ని 'శృంగవేర గిరి' అన్నారు. శంకరాచార్యుల వారు తన పీఠాన్ని ఇక్కడే ప్రతిష్ఠించారు. అదే శృంగేరిగా ప్రసిద్ధి చెందిందని చెప్తారు.

లాభాలెన్నో...

అల్లానికి ఆయుర్వేదంలో ఒక ప్రత్యేకమైన స్థానముంది. స్థూలకాయం, వాపులు, అజీర్తి, మలబద్ధతలను తగ్గించటానికి దీనిని వాడతారు. గడ్డలు, ట్యూమర్లు ఏర్పడకుండా, రక్తం గడ్డకుండా రక్తప్రసారం మెరుగుపరచటంలో అల్లం కీలకమైన పాత్ర పోషిస్తుంది. అంతే కాదు.. మనం తినే పోషకాలు వంటబట్టడానికి.. వ్యాధినిరోధకశక్తి పెరగటానికి కూడా ఇవి ఉపకరిస్తాయి. ఇక అల్లాన్ని ఇతర పదార్థాలతో కలిపి తింటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.



- అల్లం తురుమును బెల్లం పాకం పట్టి ఉండలుగా చేసి చప్పరిస్తే- శ్వాసకోశ వ్యాధులు తగ్గుతాయి. ఊపిరి తీసుకొనే పద్ధతిలో మార్పు వస్తుంది. నాలుకపై ఏర్పడే పలుచని జిగురు పొర తొలగిపోయి రుచి తెలుస్తుంది. గొంతు శ్రావ్యత కూడా పెరుగుతుంది.
- అల్లాన్ని పాలల్లో వేసి బాగా పొంగనిచ్చి.. ఉదయాన్నే తాగితే టీబీలాంటి జబ్బులు రావు.
- అల్లం రసం, నిమ్మరసం కలిపి దానిలో తగినంత ఉప్పు వేసి తాళింపు పెట్టుకోవాలి. ఇలా తయారయిన పలుచటి చట్నీని అన్నంతో కలుపుకొని క్రమం తప్పకుండా తింటే కడుపులో ఉండే నుసి పురుగులు పోతాయి. జీర్ణశక్తి మెరుగుపడుతుంది.

ఎలా తినాలి?


అల్లాన్ని ఎలా తినాలనే విషయాన్ని క్షేమశర్మ- తన క్షేమ కుతూహలంలో పేర్కొన్నాడు. క్షేమశర్మ చెప్పిన సూత్రం ప్రకారం- అల్లాన్ని- "భోజనాగ్రే సదాపథ్యం"లో తినాలి. అంటే భోజనంలో మొదటి ముద్దగా తినాలి. అంతే కాదు. వంకాయ, కంద వంటి కూరలు అరగటం కష్టమవుతుంది. అందువల్ల వాటిలో అల్లాన్ని తప్పనిసరిగా కలపాలి. తేలికగా అరిగే బీర, పొట్ల, సొర, పాలకూర, తోటకూర వంటి వాటిలో అల్లాన్ని కలపాల్సిన అవసరం లేదు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి. అల్లానికి వేడి చేసే స్వభావం ఉంది. అందువల్ల వేడి శరీర తత్వం ఉన్నవారు అల్లాన్ని పరిమితంగా తీసుకోవాలి. శరీరానికి వేడి కలిగించే వెల్లుల్లితో అసలు కలపకూడదు. అల్లం, వెల్లుల్లి - ఈ రెండు ఔషధాలు కూడా! వీటిని మితంగానే వాడాలి. అతిగా వాడితే ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయి.

• గంగరాజు అరుణాదేవి

వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఫుల్

శరీరం వ్యాధుల బారిన పడకుండా కాపాడేవి యాంటీ ఆక్సిడెంట్లే. ఇవి పండ్లు, నట్స్ వంటి వాటిలో పుష్కలంగా లభిస్తాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని అంటున్నారు పోషకాహార నిపుణులు.

బెర్రీలు: బ్లూబెర్రీ, రాస్బెర్రీ, బ్లాక్‌బెర్రీలలో ప్రొయాంథోసియానిడిన్స్ అనే యాంటీఆక్సిడెంటు ఉంటుంది. ఇది గుండెజబ్బులు, క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఉదయాన్నే స్మూతీగా తీసుకోవచ్చు. యోగర్ట్ లేక తృణధాన్యాలతో కలిపి తీసుకోవచ్చు.



గ్రేప్స్ : వీటిలో సి విటమిన్‌తో పాటు మెగ్నీషియం లభిస్తుంది. సాధారణ కెరోటినాయిడ్‌గా పిలిచే బీటా కెటోరిన్ నుంచి రెస్‌వర్తాల్ వరకు బోలెడు యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో లభిస్తాయి.


వాల్‌నట్స్ : యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే వాల్‌నట్స్ పది, పదిహేను తీసుకుంటే చాలు. వంద గ్రాముల వాల్‌నట్స్‌లో 15.2 గ్రాముల ప్రొటీన్, 65.2గ్రాముల ఫ్యాట్, 6.7గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేకాకుండా ముఖ్యమైన ఎమైనో యాసిడ్స్ లభిస్తాయి.

గ్రీన్ టీ : ఇందులో కెటచిన్ ఫాలిఫెనాల్స్ అనే మిశ్రమం ఉంటుంది. ఇది శరీరంలో ఇతర రసాయనాలతో కలిసి పని చేసి థర్మోజెనెసిస్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. క్యాన్సర్, గుండెజబ్బులు దరిచేరకుండా చూస్తుంది. అధిక కొలెస్ట్రాల్ సమస్యకు పరిష్కారం చూపుతుంది.

కివీ పండు : విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. నీటిలో కరిగే యాంటీ ఆక్సిడెంటు ఉంటుంది. కణాలను డ్యామేజ్ చేసే ఫ్రీ రాడికల్స్‌ను ఇది న్యూట్రలైజ్ చేస్తుంది. విటమిన్ సి తగినంత తీసుకుంటే ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్తమా వంటి జబ్బుల తీవ్రత తగ్గుతుంది. కోలన్ క్యాన్సర్, ఎథెరోస్క్లెరోసిస్, డయా బెటిక్ హార్ట్ డిసీజ్ వంటి జబ్బులు రాకుండా నిరోధిస్తుంది.



రెడ్ యాపిల్స్ : ఇందులో ఫైటోన్యూట్రియెంట్స్, ఫ్లావనాయిడ్స్, పాలీఫెనొలిక్స్ వంటివి పుష్కలం. 100గ్రాముల యాపిల్‌లో యాంటీ ఆక్సిడెంట్ స్ట్రెంత్ (ఓఆర్ఏసీ వాల్యూ) 5900 టీఈగా ఉంటుంది. క్వెర్‌సెటిన్, ఎపికెటచిన్, ప్రొసినాడిన్ బి2 వంటి ముఖ్యమైన ఫ్లావనాయిడ్లు లభిస్తాయి. ఇవన్నీ ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి.



స్ట్రాబెర్రీలు : వీటిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ న్యూట్రియెంట్లు ఉంటాయి. ఇవి కార్డియోవాస్క్యులర్ జబ్బుల నుంచి కాపాడతాయి. డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది. బ్రెస్ట్, సెర్వికల్, కోలన్, ఇసియోఫేగల్ వంటి క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి.

వంటిల్లు

పండుగల్లో పసందుగా

పండగ సీజన్ వచ్చేస్తోంది. పండగ కన్నా ముందే కొన్ని పిండి వంటలు ట్రై చేస్తే బావుంటుంది కదా! అందుకే కొన్ని స్పెషల్ పిండి వంటలు ఇస్తున్నాం.. ఆస్వాదించండి..



జిటాయ్ ఫిర్‌దౌస్
(గుమ్మడి పరమాన్నం)

కావాల్సిన పదార్థాలు

బాగా పండిన గుమ్మడికాయ (చిన్న ముక్కలు చేసుకోవాలి), వెన్న తీయని పాలు- 2 లీటర్లు, పంచదార- 200 గ్రాములు, ఏలకుల పొడి- ఒక స్పూను, సగం పైనాపిల్ (చిన్న ముక్కలు చేసుకోవాలి)

తయారీ విధానం

పాలలో గుమ్మడి ముక్కలను వేసి ఉడకపెట్టాలి. కొద్ది సేపటి తర్వాత మగ్గిన ముక్కలను గుజ్జుగా చేయాలి. రెండు లీటర్ల పాలు బాగా చిక్కపడిన తర్వాత పంచదార వేయాలి. పంచదార వేసిన తర్వాత 10 నిమిషాలు కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత పొయ్యి మీద నుంచి కిందకు దింపి పైనాపిల్ ముక్కలు, ఏలకుల పొడి కలపాలి.

జాగ్రత్తలు
- బాగా పండిన గుమ్మడికాయ తియ్యగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ పంచదార వేయాల్సి అవసరం లేదు.
- పంచదార బదులుగా బెల్లం పొడిని కూడా వేసుకోవచ్చు
- పైనాపిల్ ముక్కలను వేడిగా ఉన్నప్పుడు కలపకూడదు.

అనోఖి ఖీర్

కావాల్సిన పదార్థాలు

తెల్ల ఉల్లిపాయలు- వంద గ్రాములు, పంచదార- వంద గ్రాములు, పాలు- రెండు లీటర్లు, ఏలకుల పొడి- ఒక స్పూను, డ్రైఫ్రూట్స్- తగినన్ని

తయారీ విధానం
- తెల్ల ఉల్లిపాయలను చిన్న ముక్కలుగా తరగాలి. వాటిని నీళ్లలో బాగా కడగాలి. ఆ తర్వాత ఒక మూకుడులో నీళ్లు పోసి వాటిలో ఉల్లిపాయలను ఉడికించాలి. ఉల్లిపాయలు మగ్గిన తర్వాత స్టౌ మీద నుంచి దింపాలి. నీళ్లను పారబోసి ఉడికిన ఉల్లిపాయల ముక్కలను చల్లబర్చాలి.
- పాలను బాగా మరగనివ్వాలి. వాటిలో చల్లారిన ఉల్లిపాయల ముక్కలు వేయాలి. ఈ మిశ్రమం దగ్గరపడిన తర్వాత పంచదార, ఏలకుల పొడి వేయాలి.
- చల్లారిన తర్వాత సర్వ్ చేసేముందు డ్రై ఫ్రూట్స్ వేయాలి.

జాగ్రత్తలు
- కేవలం తెల్ల ఉల్లిపాయలను మాత్రమే వాడాలి. మామూలు ఉల్లిపాయలను వాడకూడదు.
- వాసన పోయేదాకా ఉల్లిపాయలను ఉడికించాలి.



కుబానీ ట్రిఫిల్



కావాల్సిన పదార్థాలు

ఒక స్పాంజ్ కేకు, యాప్రికాట్- 200 గ్రాములు, పాలు- ఒక లీటరు, కస్టర్డ్ పౌడర్- నాలుగు టీ స్పూనులు, పంచదార- 200 గ్రాములు, పళ్ల ముక్కలు- ఒక కప్పుడు, ఫాంటా- 200 ఎంఎల్ బాటిల్, జామ్- తగినంత, ఫ్రెష్ క్రీమ్- ఒక కప్పుడు, డ్రై ఫ్రూట్స్- తగినన్ని

తయారీ విధానం

కస్టర్డ్: ఒక గ్లాసులో కొద్దిగా పాలను తీసుకొని కస్టర్డ్ పౌడర్‌ను కలపాలి. మిగిలిన పాలను బాగా మరగనివ్వాలి. దానిలో పంచదార, కస్టర్డ్ పాల మిశ్రమాన్ని వేసి చిక్కపడేదాకా ఉడికించాలి. ఆ తర్వాత స్టౌ మీద నుంచి కిందకు దింపి చల్లబరచాలి.

యాప్రికాట్ ప్యూరీ: యాప్రికాట్‌లు నీళ్లలో 24 గంటలు నానబెట్టాలి. వాటిలో నుంచి గింజలు తీసేయాలి. ఆ తర్వాత యాప్రికాట్‌లను చిన్న చిన్నముక్కలుగా తరగాలి. ఒక గిన్నెలో నీళ్లు పోసి.. వంద గ్రాముల పంచదార వేయాలి. ఉడుకుతున్న పంచదార నీళ్లలో యాప్రికాట్ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. బాగా మగ్గిన తర్వాత స్టౌవ్ మీద నుంచి దింపి చల్లబరచాలి.

ట్రిఫిల్ తయారీ: కేకును రెండు ముక్కలుగా చేయాలి. ఈ రెండు ముక్కలకు జామ్‌ను రాయాలి. ఆ తర్వాత కేకును చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. ఆ తర్వాత ముక్కల్లో ఫ్యాంటా పోయాలి. ఆ ముక్కలపై పళ్లముక్కలు పరచాలి. దానిపైన యాప్రికాట్ ప్యూరీని సరిసమానంగా ఉండేలా రాయాలి. ఆ పైన కస్టర్డ్‌ను కూడా వేయాలి. ఆ తర్వాత పైభాగంలో క్రీమ్, డ్రైఫ్రూట్స్‌ను కూడా వేయాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరచి తింటే బావుంటుంది.

జాగ్రత్తలు
- కస్టర్డ్‌ను కొద్దిగా చిక్కగా చేయాలి.
- ఫ్యాంటా బదులుగా తియ్యటి నారింజరసాన్ని కూడా వాడవచ్చు
- స్పాంజ్ కేకు తాజాగా ఉంటే రుచి బావుంటుంది.

వాళ్లకు ఆమే గ్రాండ్‌మాస్టర్

ఇద్దరు పిల్లలు గ్రాండ్‌మాస్టర్లు. వారి ఆటోగ్రాఫ్‌ల కోసం అభిమానులు ఎగబడుతుంటే ఆ తల్లి కళ్ల వెంట ఆనందభాష్పాలు వస్తున్నాయి. న్యూస్ ఛానళ్లు పోటీ పడి ఇంటర్వ్యూలు తీసుకుంటుంటే ఆ తల్లి మనసు ఆనందంతో నిండిపోతోంది. అక్కాతమ్ముడు ఇద్దరూ గ్రాండ్‌మాస్టర్ హోదాలు పొందడం చరిత్రలో ఇదే మొదటిసారి. చెన్నైకు చెందిన ప్రజ్ఞానంద, వైశాలిల విజయం వెనక వారి తల్లి నాగలక్ష్మి కృషి ఎంతో ఉంది.



పిల్లలు ఆటల్లో రాణించాలంటే మంచి శిక్షణ ఒక్కటే సరిపోదు. పిల్లల కెరీర్‌ను తీర్చిదిద్దడంలో పేరెంట్స్ పాత్ర కీలకం. నిత్యం వారి వెంటే ఉంటూ వాళ్లకు కావలసినవన్నీ సమకూర్చి పెట్టాలి. ఆ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి పిల్లలిద్దరినీ ఉన్నత శిఖరాల్లోకి చేర్చింది నాగలక్ష్మి. బాల్యంలో ప్రజ్ఞానంద చేయిపట్టుకుని క్లాసులకు తీసుకువెళ్లేది. ఇప్పటికీ అంతర్జాతీయ మ్యాచుల కోసం విదేశాలకు వెళుతుంటే తోడుగా ఉంటోంది. ఒత్తిడి దరిచేరకుండా చూస్తూ విజయాలు సాధించేలా చేస్తోంది. ఎక్కడికి వెళ్లినా ఇంటి దగ్గర తయారుచేసిన ఆహారాన్ని మాత్రమే కుమారుడికి అందిస్తుంది. ఇందుకోసం ఒక ఇండక్షన్ స్టవ్, రైస్‌కుక్కర్, కొన్ని మసాల పదార్థాలను తన వెంట తీసుకెళుతుంది. ఎక్కడ ఆడేందుకు వెళ్లినా ఇంటి భోజనం తప్పక అందేలా చూస్తుంది ఆ తల్లి. బయటి ఆహారం తింటే ఆరోగ్యం చెడిపోతుందనేది ఆమె భయం. "మంచి ఆహారం అందిస్తేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది" అని అంటారామె. పిల్లలు సైతం అమ్మ చేతి వంటను మాత్రమే తినడానికి ఇష్టపడతారు. అందుకే కష్టం అనుకోకుండా సామగ్రిని తరలించి వంట చేసి పెడుతూ ఉంటుంది. "ప్రొటీన్ ఆహారం అందించడంపై ఎక్కువ దృష్టి పెడతాను. పిల్లలిద్దరూ వెజిటబుల్ సాంబార్‌ను బాగా ఇష్టపడతారు" అని చెబుతారు నాగలక్ష్మి.

> **పిల్లలకు ఆటల పట్ల ఆసక్తి ఉంటే బాగా ఆడమని ఒత్తిడి పెట్టకూడదు. కేవలం పేరెంట్స్‌గా మనం ఎంకరేజ్ చేయాలి. సపోర్టు అందించాలి. వాళ్లు గెలిస్తే మనకు సంతోషం. ఒకవేళ గెలవకపోయినా ఎంకరేజ్ చేయాలి. నెక్ట్స్ టైమ్ బాగా ఆడటానికి ప్రయత్నించు అని చెప్పాలి.**

బాధ్యతంతా తనపైనే...

నాగలక్ష్మి గృహిణి. ఆమె భర్త బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉద్యోగ బాధ్యతలతో బిజీగా ఉండేవారు. దాంతో పిల్లల బాధ్యతలను ఆమె తీసుకున్నారు. ఎక్కడ టోర్నమెంట్ జరిగినా పిల్లలను తీసుకుని వెళ్లిపోతారు. ఆమె కష్టం వృథా పోలేదు. పిల్లలిద్దరూ చదరంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. వారిని చూసి దేశం మొత్తం గర్విస్తోంది. వైశాలి ముందుగా చదరంగం నేర్చుకునేందుకు ఆసక్తి చూపింది. ఆ తరువాత ప్రజ్ఞానంద సైతం చెస్‌పై ఆసక్తి పెంచుకున్నారు. ఇద్దరూ ఒకే ఆటను కెరీర్‌గా ఎంచుకోవడం పట్ల కుటుంబ సభ్యులు మొదట్లో అభ్యంతరం చెప్పారు. తరువాత వాళ్లే గొప్ప మద్దతును అందించి పిల్లల విజయంలో కీలక పాత్ర పోషించారు. "ప్రజ్ఞానందను శిక్షణ కోసం రోజూ తీసుకొచ్చే వారు.



అతను ఆడుతున్నప్పుడు ఒక మూలన కూర్చుని ప్రార్థన చేస్తుండేవారు. కొడుకు ఆట పూర్తయ్యే వరకు ఆమె ప్రేయర్ చేసే వారు. ప్రజ్ఞానంద ఆడటానికి కూర్చుంటే చాలు తను ప్రేయర్ చేసేది" అని చెన్నైకి చెందిన బ్లూమ్ చెస్ అకాడమీ కోచ్ త్యాగరాజన్ చెప్పుకొచ్చారు. త్యాగరాజన్ ప్రజ్ఞానందకు మొదటి కోచ్‌గా ఉన్నారు. ప్రజ్ఞానంద ప్రపంచ ప్రసిద్ధ చెస్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సెన్‌తో ఫైనల్ మ్యాచ్ ఆడుతున్నప్పుడు ఆమె పక్కనే నిలుచుని ఉంది. ప్రతి పురుషుడి విజయం వెనక ఒక మహిళ ఉంటుంది అన్న నానుడిని నిజం చేస్తూ, ప్రజ్ఞానంద వెంట ఉండి ఎలాంటి ఒత్తిడి లేకుండా చేసి, విజయతీరాలకు చేరుకునేలా చేసింది. హంగేరీలో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో వైశాలి, ప్రజ్ఞానందలిద్దరూ బంగారు పతకాలు గెలుచుకున్న టీమ్‌లో భాగంగా ఉన్నారు. ఇది ఎంతో ఆనందాన్నిచ్చిందని అంటారు నాగలక్ష్మి. "పిల్లలిద్దరూ బంగారు పతకాలు గెల్చుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా ఆనందాన్ని పంచుకోవడానికి మాటలు రావడం లేదు" అని మ్యాచ్ అనంతరం తన సంతోషాన్ని పంచుకున్నారు నాగలక్ష్మి.

అమేజింగ్ చెస్ మామ్

పిల్లలతో హంగేరీ వెళ్లిన నాగలక్ష్మి అక్కడ లెజెండరీ చెస్ ప్లేయర్ సుసాన్ పొల్గర్‌ను కలుసుకున్నారు. ఈ విషయాన్ని పొల్గర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "ఇద్దరు చెస్ సూపర్‌స్టార్‌ల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన 'అమేజింగ్ చెస్ మామ్'ని కలుసుకున్నాను" అని పొల్గర్ రాసుకొచ్చారు. పిల్లల కెరీర్ కోసం తన చిన్న చిన్న సంతోషాలను కూడా వదులుకున్నారు. "ఇంట్లో పిల్లలు చెస్ ఆడుకుంటే డిస్టర్బ్ కాకూడదని టీవీ కూడా పెట్టే దాన్ని కాదు. ఇంట్లో పిన్ డ్రాప్ సైలెంట్ ఉండేలా చూసే దాన్ని. ఇంటికి ఎవరైనా వస్తే పార్కింగ్ ప్రదేశానికి వెళ్లి మాట్లాడి పంపే దాన్ని. అలాంటి వాతావరణం వాళ్లకు కల్పించేదాన్ని. అప్పుడే ఏకాగ్రతతో ఆడేవారు" అని అంటారు నాగలక్ష్మి. ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోన్న నాగలక్ష్మిని మనమూ అభినందిద్దామా!

మేకప్

అందం.. అప్రమత్తంగా...

మనం పాటించే చిన్నపాటి నియమాలు, జాగ్రత్తలు మేకప్ ప్రభావాన్ని ఇనుమడింపజేస్తాయి. కాబట్టి మేకప్ వేసుకోవడం మొదలుపెట్టిన తొలినాళ్లలో సాధారణంగా దొర్లే వీలున్న పొరపాట్ల పట్ల అప్రమత్తంగా నడుచుకోవాలి. అవేంటంటే...

అన్నీ అవసరం లేదు: కాస్మటిక్స్ షాప్‌లోకి అడుగు పెట్టగానే అంతులేనన్ని ఉత్పత్తులు కళ్లను కట్టిపడేస్తాయి. ఏం కొనాలో అర్థం కాని పరిస్థితిలో, అయోమయానికి లోనై అవసరం లేని అప్లికేటర్స్ అన్నిటినీ కొనేయడం సరి కాదు. నిజానికి ఐల్యాష్ కర్లర్, భిన్నమైన మేకప్ స్పాంజ్‌లను కొనవలసిన అవసరం లేదు. అలాగే పలు రకాల బ్లషలూ, లిప్‌స్టిక్‌లూ కొనవలసిన అవసరం ఉండదు. ప్రారంభంలో బేసిక్ మేకప్ కిట్ కొనుక్కుంటే సరిపోతుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఒక్కొక్క ప్రొడక్ట్ జోడించుకుంటూ వెళ్లాలి. మస్కారా, లిప్‌స్టిక్, ఐబ్రో పెన్సిల్, ఫౌండేషన్‌లతో మేకప్ మొదలుపెట్టుకోవాలి. ఈ ఉత్పత్తులుండే మేకప్ కిట్‌ను ఎంచుకోవాలి.

శుభ్రమైన ముఖానికే మేకప్: సాధారణంగా చాలా మంది మేకప్‌కు ముఖం ఎలా ఉన్నా ఫరవాలేదనుకుంటారు. మేకప్ చాటున అన్నిటినీ దాచేయవచ్చనుకుంటారు. కానీ మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసుకోవాలంటే, ముందుగా ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. గంటల తరబడి ముఖం మీద ఉండిపోయిన మాయిశ్చరైజర్, సన్‌స్ర్కీన్ మీద మేకప్ అప్లై చేసుకోవడం సరి కాదు. ఈ నియమం లిప్‌స్టిక్‌కు మాత్రమే మినహాయింపు. లిప్‌స్టిక్ లేదా గ్లాస్‌ను తేలికగా రీఅప్లై చేసుకోవచ్చు. అయితే కాస్త ఖాళీ సమయం దొరికినా న్యాప్కిన్‌ను నీళ్లలో ముంచి, పెదవుల మీది లిప్‌స్టిక్ పూర్తిగా తొలగించి తిరిగి అప్లై చేసుకుంటే, మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాం.

మురికి బ్రష్‌లతో తంటా: మురికి మేకప్ బ్రష్షులతో చర్మ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇందుకోసం వారాంతాల్లోని తీరిక సమయాలను కేటాయించాలి. గోరువెచ్చని నీళ్లను గిన్నెలో నింపి, ఒక టీస్పూన్ షాంపూ కలిపి, బ్రష్ కుంచెలన్నీ మునిగేలా పది నిమిషాలు నానబెట్టి, వేళ్లతో సున్నితంగా రుద్ది శుభ్రం చేసి, తాజా నీళ్లలో కడగాలి. తర్వాత బ్రష్‌లను టవల్ మీద ఆరబెట్టి, దాచుకోవాలి. మేకప్ బ్రష్‌లు అదనంగా కొని పెట్టుకుంటే, అత్యవసరమైన సమయాల్లో అక్కరకొస్తాయి. పైగా ఖరీదైన బ్రష్‌లనే ఎంచుకోవాలనే నియమమేమీ లేదు. నాణ్యత విషయంలో రాజీ పడినా మేకప్‌లో అంతగా మార్పులుండవు.

కనుబొమలు ప్రధానమే: చాలా మంది ముఖంలోని అన్ని అంశాలకూ ప్రాధాన్యం ఇచ్చి, కనుబొమలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. అలాగని వాటిని అవసరానికి మించి దిద్దుకున్నా, ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. కాబట్టి తీర్చిదిద్దిన కనుబొమల కోసం, మ్యాట్ ఐషాడోతో కనుబొమలు దిద్దుకోవాలి. కనుబొమల రంగుకు దగ్గరగా లేదా అంతకంటే లేత రంగులో ఉండే ఐబ్రో పెన్సిల్‌నే ఉపయోగించాలి.



మేకప్‌తో నిద్ర: ఇది సరి కాదు. ఎంత అలసటతో పక్క మీద వాలిపోయినా, మేకప్ తొలగించడం మర్చిపోకూడదు. లేదంటే చర్మ రంధ్రాలు పూడుకుపోయి, ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి. తర్వాతి రోజు ముఖం తాజాగా వెలిగిపోవాలంటే ముందు రోజు వేసుకున్న మేకప్ పూర్తిగా తొలగించి, చర్మానికి గాలి సోకేలా చూసుకోవాలి. మేకప్ తొలగించడానికి క్లీన్సింగ్ మిల్క్ లేదా స్వచ్ఛమైన కొబ్బరినూనె ఉపయోగించవచ్చు. మేకప్ తొలగించి, సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాత, తప్పనిసరిగా నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

బాల్కనీ... డెకరేట్ చేసుకోండిలా...

నగరజీవులు ఇంట్లో కాసేపు సేదతీరాలంటే బాల్కనీయే దిక్కు. సాయంకాలం కాఫీ సిప్ చేసేందుకు అది కరెక్ట్ ప్లేస్. రాత్రుళ్లు ప్రశాంతంగా ఒక పుస్తకాన్ని చదువుకోవాలంటే దీని కంటే మంచి ప్రదేశం దొరకదు. మరి అలాంటి బాల్కనీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవాలంటే ప్లానింగ్ ఉండాలి. బాల్కనీ అలంకరణలో నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి..

పూలకుండీలు, మొక్కలు: బాల్కనీ ఆకర్షణీయంగా కనిపించాలన్నా, కాసేపు సేదతీరేందుకు కూర్చోవాలని అనిపించాలన్నా పూలకుండీలు, మొక్కలతో అలంకరించుకోవాలి. మీ అభిరుచికి తగినవిధంగా పూల మొక్కలను, తీగ మొక్కలను ఎంచుకోవచ్చు. అయితే వాటి అమరిక నీట్‌గా ఉండాలి. బాల్కనీలో ఉన్న కొద్దిపాటి స్థలాన్ని ఆక్రమించేదిగా ఉండకూడదు. స్థలం తక్కువగా ఉంటే కుండీలు వేలాడదీసుకోవచ్చు. షెల్ఫ్‌లు ఏర్పాటు చేసుకుని వాటిలో పూల కుండీలు అమర్చుకోవచ్చు. విస్తీర్ణాన్ని బట్టి స్టాండ్‌ను పెట్టుకోవచ్చు. రాత్రివేళ బాల్కనీ లుక్ ట్రెండీగా కనిపించాలంటే హ్యాంగింగ్ లైట్స్, ఫైరీ లైట్స్ అమర్చుకోవాలి. అయితే ఎక్కువ వెలుతురు ఉండకూడదు. డిమ్ లైటింగ్ ఉండాలి. అలా అమర్చుకుంటే రాత్రుళ్లు కాసేపు సేదతీరడానికి ఇంతకన్నా మంచి ప్రదేశం దొరకదు.

స్థలాన్ని బట్టి: బాల్కనీ విస్తీర్ణం పెద్దగా ఉంటే పర్వాలేదు. కానీ చిన్నగా ఉంటేనే సీటింగ్ ఏర్పాటుకు కాస్త ఇబ్బంది ఉంటుంది. అలాంటప్పుడు ఫోల్డబుల్ కుర్చీలు, టేబుళ్లను సెట్ చేసుకోవాలి. అనవసరమైన వస్తువులకు బాల్కనీలో చోటు ఇవ్వొద్దు. స్థలం ఎక్కువగా ఉంటే సోఫా ఏర్పాటు చేసుకుని రంగురంగుల దిండ్లు పెట్టుకుంటే రిలాక్స్ కావడానికి పర్‌ఫెక్ట్ ప్లేస్‌గా మారుతుంది. చిన్నక్యాబినెట్ పెట్టుకుంటే స్టోరేజ్ ప్లేస్‌గా ఉపయోగపడుతుంది. అదే సమయంలో కూర్చోవడానికి పనికొస్తుంది.

ఆర్ట్ వర్క్ ఫ్రేమ్స్: బాల్కనీ గోడలకు ఆర్ట్ వర్క్స్‌ని, ఫ్రేమ్స్‌ని వేలాడదీయడం ద్వారా ఆకర్షణీయంగా కనిపించేలా తీర్చిదిద్దుకోవచ్చు. ఆర్ట్ వర్క్ అందుబాటులో లేకపోతే మొజాయిక్ మిర్రర్స్‌ని పెట్టుకోవచ్చు. బాల్కనీ ఫ్లోరింగ్ మార్చుకోవడం ద్వారా న్యూ లుక్‌ను తీసుకురావచ్చు. గ్రాస్ మ్యాట్ ఏర్పాటు చేస్తే గ్రీనరీ లుక్ వస్తుంది. బాల్కనీ ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతిని



అందించేలా ఉంటే బాగుంటుంది. లివింగ్‌రూమ్‌లో కన్నా బాల్కనీలో ఎక్కువ సమయం గడపటానికి ఇష్టపడే వారైతే ఒక కాఫీ టేబుల్, కొన్ని కుషన్లు, క్యాండిల్స్‌లు లాంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఈ అలంకరణ వైబ్స్‌ని క్రియేట్ చేస్తుంది. బాల్కనీలో ఏర్పాటు చేసుకునే ఫర్నిచర్ వెదర్‌ప్రూఫ్ అయితే బాగుంటుంది. ఆకాశహర్మ్యాల్లో నివసిస్తున్నట్లయితే బాల్కనీలో నుంచి సిటీ వ్యూ చక్కగా ఉంటుంది. ఇలాంటి వారు బాల్కనీలో గ్లాస్ రెయిలింగ్ ఏర్పాటు చేసుకోవాలి. ఫాల్స్ సీలింగ్ ఏర్పాటు చేసుకుంటే ఫ్యాన్, ఫోకస్ లైట్లు అమర్చుకోవచ్చు. వుడెన్ డిజైన్ ఎంచుకుంటే కాంటెంపరరీ లుక్ వస్తుంది. అభిరుచిని బట్టి వాల్ పెయింటింగ్స్‌ను వేసుకోవచ్చు. వేలాడే ఊయలను అమర్చుకున్నా సింప్లీ సూపర్బ్‌గా ఉంటుంది. స్థలం, అవసరాలను బట్టి ప్లానింగ్‌తో డెక

వరుణుడిదే ఆధిపత్యం

ఆడింది 35 ఓవర్లే..

బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్ 107/3

తొలి రోజు ఆటకు ఆటంకం

రెండో టెస్టు



కాన్పూర్: ఊహించినట్టుగానే జరిగింది.. భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య శుక్రవారం మొదలైన రెండో టెస్టును వరుణుడు కాస్త గట్టిగానే అడ్డు నిలిచాడు. మొదటి రోజు ఆట 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మ్యాచ్ ఆరంభ సమయానికి మైదానం పూర్తి చిత్తడిగా మారడంతో గంట ఆలస్యంగా ఇరు జట్లు బరిలోకి దిగాయి. తొలి సెషన్ సజావుగానే సాగినా.. ఆ తర్వాత రెండో సెషన్ ప్రారంభమైన కాసేపటికే వెలుతురు లేమితో మ్యాచ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. దీనికి తోడు భారీ వర్షం కురవడంతో మధ్యాహ్నం మూడుగంటలకు అంపైర్లు తొలి రోజు ఆటను ముగిస్తున్నట్టు ప్రకటించారు.



అప్పటికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో మూడు వికెట్లకు 107 పరుగులు చేసింది. క్రీజులో మోమినుల్ హక్ (40 బ్యాటింగ్), ముష్ఫికర్ రహీమ్ (6 బ్యాటింగ్) ఉన్నారు. కెప్టెన్ షంటో (31) పర్వాలేదనిపించాడు. పేసర్ ఆకాశ్‌దీప్‌నకు రెండు, అశ్విన్‌కు ఓ వికెట్ దక్కాయి. ఇదిలావుండగా అంతా అంచనా వేసినట్టు భారత జట్టు ముగ్గురు స్పిన్నర్లతో కాకుండా, తొలి టెస్టు మాదిరి ఇద్దరితోనే బరిలోకి దిగడం గమనార్హం.

రాత్రి నుంచే వర్షం: ప్రస్తుతం కాన్పూర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే మ్యాచ్‌కు మొదటి మూడు రోజులు ఇబ్బందేనని అంచనా వేశారు. గురువారం రాత్రి నుంచే కురిసిన వర్షంతో గ్రీన్‌పార్క్ అంతా చిత్తడిగా మారింది. దీంతో నిర్ణీత సమయం కంటే గంట ఆలస్యంగా 10.30కి మ్యాచ్ ఆరంభమైంది. ఆకాశం మేఘావృతంగా ఉండడంతో అంతకుముందు టాస్ గెలిచిన కెప్టెన్ రోహిత్ బౌలింగ్ ఎంచుకున్నాడు.

చెలరేగిన ఆకాశ్: కొత్త బంతితో పేసర్లు బుమ్రా, ఆకాశ్, సిరాజ్ కట్టుదిట్టంగా బంతులు వేశారు. దీంతో 24 బంతులు ఎదుర్కొన్న ఓపెనర్ జకీర్.. యశస్వీ మెరుపు క్యాచ్‌తో డకౌట్‌గా వెనుదిరిగాడు. పేసర్ ఆకాశ్ ఈ వికెట్ తీశాడు. కాసేపటికే అతడు షాద్‌మన్ ఇస్లాం (24)ను కూడా ఎల్బీ చేశాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా.. ఆకాశ్ ఒత్తిడి మేరకు డీఆర్‌ఎస్‌కు వెళ్లిన రోహిత్ ఫలితం సాధించాడు. అయితే ఈ దశలో షంటో, మోమినుల్ చక్కటి ఫోర్లతో ఎదురుదాడికి దిగారు. అలాగే మరో వికెట్ కోల్పోకుండా ఈ జోడీ తొలి సెషన్‌ను పూర్తి చేసింది. ఆ వెంటనే చిరు జల్లులు కురవడంతో మైదానాన్ని కవర్లతో కప్పేశారు. చివరకు మరో 15 నిమిషాలు ఆలస్యంగా రెండో సెషన్ ఆరంభమైంది. చక్కగా కుదురుకున్న షంటోను అశ్విన్ ఎల్బీ చేయడంతో బంగ్లా షాక్‌కు గురైంది. ఈ నిర్ణయంపై షంటో రివ్యూకు వెళ్లినా ఫలితం లేకపోయింది. మూడో వికెట్‌కు ఈ జోడీ 51 పరుగులు జత చేసింది. అయితే 35వ ఓవర్ తర్వాత వెలుతురు తగ్గిపోవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. మరో పావుగంటకు భారీ వర్షం తోడవ్వడంతో చేసేదేమీ లేక తొలి రోజును ముగిస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

స్కోరుబోర్డు

బంగ్లా తొలి ఇన్నింగ్స్: జకీర్ హసన్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ దీప్ 0; షాద్‌మన్ (ఎల్బీ) ఆకాశ్ దీప్ 24; మోమినుల్ (బ్యాటింగ్) 40; షంటో (ఎల్బీ) అశ్విన్ 31; ముష్ఫికర్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం: 35 ఓవర్లలో 107/3.** వికెట్ల పతనం: 1-26, 2-29, 3-80. **బౌలింగ్:** బుమ్రా 9-4-19-0; సిరాజ్ 7-0-27-0; అశ్విన్ 9-0-22-1; ఆకాశ్ దీప్ 10-4-34-2.

1 ఆసియాలో ఎక్కువ వికెట్లు (420) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. అనిల్ కుంబ్లే (419)ను అధిగమించాడు. మొత్తంగా అతను రెండో స్థానంలో ఉండగా మురళీధరన్ (612) టాప్‌లో ఉన్నాడు.

బంగ్లా అభిమానిపై దాడి?



కాన్పూర్: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ వీరాభిమాని టైగర్ రాబీపై దాడి జరిగిందనే కథనం కలకలం రేగింది. మ్యాచ్ సాగుతున్న సమయంలో పులి వేషధారణలో ఉన్న అతడు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే భద్రతా సిబ్బంది అతడిని 'సి' స్టాండ్ నుంచి బయటికి తెచ్చి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ తర్వాత కోలుకున్నాక అతడు తనపై దాడి కథనాన్ని ఖండించాడు. విరేచనాలతో పాటు కడుపులో తిప్పినట్టు అనిపించడంతోనే అస్వస్థతకు గురయినట్టు, ప్రస్తుతం అంతా బానే ఉందని తేల్చాడు.

సెమీస్‌కు గాయత్రి జోడీ

మకావు ఓపెన్ నుంచి శ్రీకాంత్ అవుట్

మకావు: భారత డబుల్స్ స్టార్ జోడీ పుల్లెల గాయత్రీ గోపీచంద్, ట్రీసా జాలీ మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళుతోంది. ఇక కిడాంబి శ్రీకాంత్‌కు ఇక్కడా నిరాశే ఎదురైంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో మూడోసీడ్ గాయత్రి/ట్రీసా జంట 21-12, 21-17తో చైనీస్ తైపీకి చెందిన ఆరోసీడ్ ద్వయం సూ యిన్ హుయి/లాన్ జియున్‌ను వరుసగేముల్లో ఓడించి సెమీఫైనల్ చేరింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో మాజీ ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్, ఆరోసీడ్ కిడాంబి శ్రీకాంత్ 16-21, 12-21తో హాంకాంగ్ ఆటగాడు ఎంగ్ కా లాంగ్ ఆగ్నస్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

కేకేఆర్ మెంటార్‌గా బ్రావో



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ మెంటార్‌గా విండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో వ్యవహరించనున్నాడు. తాజా కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో ఆడుతున్న బ్రావో ఇటీవల గాయ పడ్డాడు. దీంతో వెంటనే అన్ని రకాల క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. ఆ వెంటనే అతడికి కేకేఆర్ కీలక బాధ్యతలు అప్పగించింది. బ్రావో అనుభవం, నిబద్ధత తమ జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ సీఈవో వెంకీ మైసూర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ నియామకంపై అటు బ్రావో సంతోషం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్‌లో గంభీర్ మెంటార్‌గా కేకేఆర్ చాంపియన్‌గా నిలువగా, అటు బ్రావో సీఎస్‌కే బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే.

గాయం మానింది

లక్ష్యం ప్రపంచ స్వర్ణం

నీరజ్ చోప్రా



సోనెపట్: తన గాయం మానిందని, కొత్త సీజన్‌కు పూర్తి ఫిట్‌నెస్‌తో బరిలోకి దిగుతానని స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తెలిపాడు. టోక్యోలో వచ్చే ఏడాది జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలవడమే తన లక్ష్యమని ప్రకటించాడు. బ్రస్సెల్స్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్లో రెండో స్థానంలో నిలవడం ద్వారా సీజన్‌ను ఘనంగా ముగించిన 26 ఏళ్ల నీరజ్ శుక్రవారం స్వదేశం చేరుకున్నాడు. 'వచ్చే ఏడాది నా అతిపెద్ద లక్ష్యం వరల్డ్ చాంపియన్‌షిప్. ఇక ఆ పోటీలకు సన్నాహకాలు ప్రారంభించాలి. ఒలింపిక్స్ కూడా ముఖ్యమే. కానీ దానికి మరో నాలుగు సంవత్సరాలు ఉంది' అని చోప్రా చెప్పాడు. గత ఏడాది ఆసాంతం గజ్జల్లో గాయంతో నీరజ్ సతమతమయ్యాడు. అది పారిస్ ఒలింపిక్స్‌తోపాటు డైమండ్ లీగ్ ఫైనల్లో అతడి ప్రదర్శనపై తీవ్రంగా పడింది. అంతేకాదు డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు ప్రాక్టీస్ చేస్తున్న సందర్భంలో అతడి ఎడమ చేతికి ఫ్రాక్చర్ కూడా అయ్యింది. ఆ ఫ్రాక్చర్‌తోనే బ్రస్సెల్స్ బరిలో దిగాడు. గజ్జల్లో గాయానికి ఆపరేషన్ విషయమై సీజన్ ముగిశాక డాక్టర్ల సలహా తీసుకుంటానని అప్పట్లో నీరజ్ తెలిపాడు.

ఏఐటీఏ చీఫ్‌పై అవిశ్వాసం

కాన్పూర్: అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ)లో ఊహించని పరిణామం. అధ్యక్షుడు అనిల్ జైన్‌పై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టాలని 8 రాష్ట్ర సంఘాలు ప్రతిపాదించాయి. ఈమేరకు శనివారం ఇక్కడ ఏఐటీఏ అత్యవసర సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. అయితే శనివారమే భేటీ నిర్వహించడంతోపాటు..ఎన్నికలు కూడా జరపాలని నిర్ణయించడం గమనార్హం.

12 ఏళ్ల క్రితం పోటీపడింది.. ఇప్పుడు పతకం సొంతమైంది



లండన్: అదృష్టం అంటే ఇదేనేమో! అప్పుడెప్పుడో 12 ఏళ్ల క్రితం ఒలింపిక్స్‌లో పోటీపడింది. కానీ, ఆనాడు కనీసం పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయింది. కానీ, ఆ విశ్వక్రీడల్లో పాల్గొన్నందుకు ఇప్పుడు పతకం ఆమె సొంతమైంది. ఎలాగంటే... అమెరికాకు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ షనోన్ రోబురీ పన్నెండేళ్ల క్రితం 2012 లండన్ ఒలింపిక్స్‌లో 1500 మీటర్ల రేసులో పోటీపడింది. ఆ ఈవెంట్‌లో ఆమె ఆరోస్థానంలో నిలిచింది. అయితే, ఆ ఒలింపిక్స్ సందర్భంగా చేసిన డోప్ పరీక్షల్లో.. ఆ రేసులో పోటీపడ్డ మొత్తం 13 రన్నర్లలో ఐదుగురు డోపీలుగా తేలారు. వీరిలో స్వర్ణం, రజతం నెగ్గిన టర్కీ అథ్లెట్లు అస్లీ కాకిర్ అల్ప్‌టెకిన్, గేమ్జ్ బులుట్ ఉన్నారు. అప్పట్లో వీరిద్దరి నిష్క్రమణతో మూడోస్థానంలో నిలిచిన రష్యా రన్నర్ తాత్యానా తొమషోవా పతకం రజతానికి అప్‌గ్రేడ్ అయింది. అయితే, మరోసారి శాంపిల్స్ పునఃపరీక్షలు, విచారణ అనంతరం తాజాగా తాత్యానా కూడా డోపీగా రుజువైంది. దీంతో నిన్నటిదాకా నాలుగో స్థానానికి అప్‌గ్రేడ్ అయిన 40 ఏళ్ల షనోన్.. ఇప్పుడు మూడోస్థానంతో కాంస్య పతకధారిగా నిలిచింది.

మమ్మల్ని వదిలేసి.. అతనితో సెల్ఫీలా!

అభిమానుల తీరుపై హాకీ స్టార్ల ఆవేదన



న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, హార్దిక్ సింగ్..వంటి ముగ్గురు భారత హాకీ స్టార్లు. కానీ ఫ్యాన్స్ వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా..ఎయిర్‌పోర్టులోనే ఉన్న సోషల్‌మీడియా ద్వారా పాపులరైన నాగ్‌పూర్‌కు చెందిన టీ విక్రేత డోలీ చాయ్‌వాలాతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇటీవల జరిగిన ఈ సంఘటనపై భారత జట్టు ఏస్ మిడ్ ఫీల్డర్ హార్దిక్ సింగ్ ఆవేదన చెందాడు. 'హర్మన్, మన్‌దీప్, నేను మరో నలుగురు ఆటగాళ్లం ఎయిర్‌పోర్టులో ఉన్నాం. అదేసమయంలో డోలీ చాయ్‌వాలా అక్కడ ఉన్నాడు. కానీ ప్రజ లు అతడితో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు తప్ప మమ్మల్ని పట్టించుకోలేదు. ఆ సంఘటన మాకు ఇబ్బందిగా అనిపించింది' అని హార్దిక్ వాపోయాడు.

బ్రాడ్‌మన్ సరసన కమిందు మెండిస్

లంక తొలి ఇన్నింగ్స్ 602/5 డిక్లేర్

గాలె: శ్రీలంక బ్యాటర్ కమిందు మెండిస్ (182 నాటౌట్) భారీ శతకంతో చెలరేగిపోయాడు. ఈ క్రమంలో బ్రాడ్‌మన్ రికార్డును సమం చేశాడు. దీంతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో లంక తొలి ఇన్నింగ్స్‌ను 602/5 వద్ద డిక్లేర్ చేసింది. కుశాల్ మెండిస్ (106 నాటౌట్) సైతం సెంచరీ సాధించడంతో ఆరో వికెట్‌కు అజేయంగా 200 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. తర్వాత కివీస్ రెండో రోజు ఆట చివరికి 22/2 స్కోరు చేసింది.

కాగా టెస్టుల్లో అతి తక్కువ ఇన్నింగ్స్ (13)లో వెయ్యిపరుగులు దాటిన మూడో బ్యాటర్‌గా కమిందు మెండిస్ లెజెండరీ ఆటగాడు డాన్ బ్రాడ్‌మన్‌ను సమంచేశాడు. 12 ఇన్నింగ్స్‌లోనే 1000 రన్స్ చేసిన సట్‌క్లిఫ్ (ఇంగ్లండ్), ఎవర్టన్ వీక్స్ (వెస్టిండీస్) ముందున్నారు. వినోద్ కాంబ్లీ 14 ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు.

కొత్త నియామకాలు ఆగవు..

ఫ్రెషర్స్‌పైనే ఎక్కువ దృష్టి

జెనరేటివ్ ఏఐపై ప్రత్యేక ఫోకస్

యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీలు మళ్లీ నియామకాలకు సిద్ధమవుతున్నాయి. తమ కంపెనీలో కొత్త నియామకాలు ఏ మాత్రం ఆగవని ప్రముఖ ఐటీ సేవలు, కన్సల్టింగ్ సంస్థ యాక్సెంచర్ స్పష్టం చేసింది. ఈ నియామకాల్లో ఫ్రెషర్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని కంపెనీ గ్లోబల్ చైర్‌పర్సన్, సీఈఓ జూలీ స్వీట్ ఇన్వెస్టర్స్ కాల్స్‌కు సమాధానం ఇస్తూ తెలిపారు. కొత్త నియామకాల్లో ఎక్కువ భాగం భారత్‌లోనే ఉంటాయని ఆమె చెప్పారు. 'మేము భారత్‌లో నియామకాలు పెంచుతున్నాం. ఇందులో ఎక్కువ నియామకాలు టెక్నాలజీకి సంబంధించిన నియామకాలు. అక్కడ ఇప్పటికే ఉన్న ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకూ ప్రత్యేక శిక్షణా కార్యకాపాలు చేపడుతున్నాం' అన్నారు. అయితే భారత్‌లో ఎంత మంది ఉద్యోగులను కొత్తగా తీసుకునేది యాక్సెంచర్ సీఈఓ వెల్లడించలేదు. ప్రస్తుతం అంతర్జాతీయంగా యాక్సెంచర్ కేంద్రా ల్లో 7.74 లక్షల మంది పనిచేస్తుంటే అందులో మూడు లక్షల మందికి పైగా భారత్‌లోనే పని చేస్తున్నారు.

జెన్ ఏఐపై 80,000 మందికి శిక్షణ

ఇతర ఐటీ కంపెనీల్లానే యాక్సెంచర్ కూడా జెనరేటివ్ ఏఐపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. తమ క్లయింట్లలో ఎక్కువ మంది టెక్, డేటా, ఏఐ, పనితీరుకు సంబంధించి కొత్త విధానాలకు మారినందున తాము కూడా అందుకు అనుగుణంగా మారక తప్పడం లేదని యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్ అన్నారు. 'మా ఉద్యోగుల్లో ఇప్పటికే దాదాపు 57,000 మందికి ఏఐ, డేటా టెక్నాలజీపై శిక్షణ ఇచ్చాం. 2026 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 80,000 మందికి ఈ టెక్నాలజీల్లో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆమె తెలిపారు. యాక్సెంచర్ ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటికే దాదాపు 4.4 కోట్ల గంటల పాటు తన ఉద్యోగులకు ఏఐతో సహా వివిధ టెక్నాలజీలపై శిక్షణ ఇచ్చింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ.

బిజినెస్



భారత మార్కెట్లోకి రోల్స్ రాయిస్ కలినాన్ సిరీస్-2

ప్రారంభ ధర రూ.10.50 కోట్లు

న్యూఢిల్లీ: అల్ట్రా లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్ రాయిస్.. భారత మార్కెట్లోకి కలినాన్ సిరీస్-2 కార్లను తీసుకువచ్చింది. రెండు కొత్త వేరియంట్లలో కలినాన్ సిరీస్ 2, బ్లాక్ బ్యాడ్జ్ కలినాన్ సిరీస్ 2 పేరుతో వీటిని విడుదల చేసింది. ఈ కార్ల ప్రారంభ ధరలు వరుసగా రూ.10.50 కోట్లు, రూ.12.25 కోట్లు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. 6.75 లీటర్ వీ12 ఇంజన్‌తో కూడిన ఈ సూపర్ లగ్జరీ ఎస్‌యూవీ కార్ల డెలివరీలు ఈ ఏడాది చివరి (క్యూ4)లో ప్రారంభించనున్నట్లు రోల్స్ రాయిస్ వెల్లడించింది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో రోల్స్ రాయిస్‌కు భారత్ ఎంతో కీలకమైన మార్కెట్ ఉందని, దీంతో ఈ మోడల్స్‌ను ఇక్కడ విడుదల చేసినట్లు రోల్స్ రాయిస్ మోటార్ కార్స్ రీజినల్ డైరెక్టర్ ఇరేన్ నిక్కిన్ తెలిపారు.

ప్రస్తుతం భారత్‌లో రోల్స్ రాయిస్ కార్లను కొనుగోలు చేసిన వారిలో 90 శాతం మంది సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళుతుండగా కేవలం పది శాతం మంది మాత్రమే డ్రైవర్ సేవలు పొందుతున్నారని ఇరేన్ చెప్పారు. కాగా 2010లో తమ కార్లను కొనుగోలు చేసే వారి సగటు వయసు 56 ఏళ్లుగా ఉండగా ప్రస్తుతం ఇది 43 సంవత్సరాలకు తగ్గిందని తెలిపారు.

జీఆర్‌టీ మెన్ సరికొత్త కలెక్షన్



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్.. పురుషుల కోసం జీఆర్‌టీ మెన్ పేరుతో సరికొత్త కలెక్షన్‌ను తీసుకువచ్చింది. ఆధునిక జీవనశైలికి తగ్గట్టుగా పురుషుల కోసం బ్రాస్‌లెట్స్, ఉంగరాలు, గొలుసులు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. అంతేకాకుండా ఈ కొత్త కలెక్షన్‌కు విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రముఖ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ప్రచారకర్తగా జీఆర్‌టీ జువెలర్స్ నియమించుకుంది. జీఆర్‌టీ మెన్స్ కలెక్షన్‌లోని ప్రతి ఆభరణాన్ని పురుషుల జీవనశైలి, ఆధునికతను ప్రతిబింబించే విధంగా డిజైన్ చేసినట్లు జీఆర్‌టీ జువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. నాణ్యత విషయంలో ఎక్కడా కూడా రాజీపడకుండా అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ రూపొందించిన ఈ ఆభరణాలు అన్ని జీఆర్‌టీ జువెలర్స్ షోరూమ్స్‌లో అందుబాటులో ఉంటాయని ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.

జీఎంఆర్ చేతికే నాగ్‌పూర్ విమానాశ్రయం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ ఎయిర్‌పోర్టును ఆధునీకరించి, నిర్వహించే హక్కు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు ఉందని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి గతంలో తాము ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దాఖలు చేసిన క్యురేటివ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని నలుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది.

వారాంతంలో లాభాల స్వీకరణ

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకినప్పటికీ.. ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా చివరికి నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెషన్‌లో 142.13 పాయింట్లు ఎగబాకి 85,978.25 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన సెన్సెక్స్.. ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి మళ్లింది. వారాంతం ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 264.27 పాయింట్ల నష్టంతో 85,571.85 వద్దకు జారుకుంది. నిఫ్టీ సైతం తొలుత 61.3 పాయింట్ల వృద్ధితో 26,277.35 సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో 37.10 పాయింట్ల నష్టంతో 26,178.95 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడినట్లైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 14 నష్టపోయాయి.

బీఎస్ఈ, ఎన్ఎస్ఈ లావాదేవీ రుసుము సవరణ

అక్టోబరు 1 నుంచి అమలు

క్యాష్, ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ లావాదేవీల రుసుమును సవరిస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ శుక్రవారం ప్రకటించాయి. సవరించిన రుసుము అక్టోబరు 1 నుంచి అమలులోకి రానుంది. ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లో సెన్సెక్స్, బ్యాంకెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టుల లావాదేవీలపై కోటి ప్రీమియం టర్నోవర్‌కు రూ.3,250 రుసుము వసూలు చేయనున్నట్లు బీఎస్ఈ తన సర్క్యులర్‌లో వెల్లడించింది. ఇదే విభాగంలోని ఇతర కాంట్రాక్టుల ఫీజును మాత్రం యథాతథంగా కొనసాగించింది. సెన్సెక్స్ 50 ఆప్షన్స్, స్టాక్ ఆప్షన్స్ లావాదేవీలకు కోటి ప్రీమియం టర్నోవర్‌పై రూ.500 రుసుము వసూలు చేయనుంది. ఎన్ఎస్ఈ విషయానికి వస్తే, క్యాష్ మార్కెట్ విభాగంలో లక్ష విలువైన లావాదేవీపై రూ.2.97 రుసుము వసూలు చేయనుంది. ఈక్విటీ ఫ్యూచర్స్‌లో లక్ష విలువైన లావాదేవీపై రూ.1.73, ఈక్విటీ ఆప్షన్స్‌కు లక్ష ప్రీమియం వేల్యూపై రూ.35.03 వసూలు చేయనుంది. కరెన్సీ డెరివేటివ్ సెగ్మెంట్లో ఫ్యూచర్స్ కాంట్రాక్టులకు లక్ష విలువైన ట్రేడ్‌పై రూ.0.35 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆప్షన్స్ కాంట్రాక్టులకు లక్ష ప్రీమియం విలువపై రూ.31.10 రుసుము వసూలు చేయనున్నట్లు ఎన్ఎస్ఈ తెలిపింది.

మ్యూచువల్ ఫండ్ల రిస్క్‌కు కలర్ కోడింగ్!

సెబీ కొత్త ప్రతిపాదన

మ్యూచువల్ ఫండ్లు తమ పథకాల్లో పెట్టుబడులపై రిస్క్‌ను తెలియపరిచే విధానాన్ని మరింత మెరుగుపరచాలని సెబీ యోచిస్తున్నది. ఇందుకోసం కలర్ కోడింగ్ రిస్క్ మీటర్‌ను ప్రవేశపెట్టాలని శుక్రవారం విడుదల చేసిన చర్చాపత్రంలో ప్రతిపాదించింది. ఫండ్లు అతి తక్కువ రిస్క్‌ను ఆకుపచ్చ రంగు, అత్యధిక రిస్క్‌ను ఎరుపు రంగు ద్వారా తెలియజేయాలని సూచించింది. ఈ కలర్ కోడ్‌లో మొత్తం ఆరు రిస్క్ స్థాయిలుంటాయి. వాటిని ఆరు వేర్వేరు రంగులతో తెలియజేయాల్సి ఉంటుంది. ఇన్వెస్టర్లకు తమ ఫండ్ పెట్టుబడుల రిస్క్‌పై మరింత సులువుగా అవగాహన కల్పించేందుకు ఇది దోహదపడనుందని సెబీ భావిస్తోంది. అంతేకాదు, మ్యూచువల్ ఫండ్లు పథకం రిస్క్ స్థాయిని తమ యూనిట్ హోల్డర్లకు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సి ఉంటుంది. రిస్క్ స్థాయి మారినప్పుడల్లా నోటీస్, ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలని సెబీ ప్రతిపాదించింది. అలాగే, ఫండ్లు ప్రస్తుత రిస్క్ మీటర్‌తో పాటు సవరించిన రిస్క్ మీటర్‌ను సైతం ప్రదర్శించాలని సెబీ స్పష్టం చేసింది. ప్రస్తుత రిస్క్ మీటర్ కేవలం రిస్క్ స్థాయిల వివరాలతో నలుపు, తెలుపు రంగులో ఉంటుంది. అయితే, ఇప్పటికే పలు ఫండ్లు తమ పథకాల రిస్క్‌ను కలర్ కోడింగ్ ద్వారానూ తెలియజేస్తున్నాయి.

సీక్వెంట్ సైంటిఫిక్- వియాశ్ లైఫ్ ఒక్కటి కాబోతున్నాయ్

విలీనం విలువ రూ.8,000 కోట్లు!

ముంబై/హైదరాబాద్: పశు ఆరోగ్య సంరక్షణ మార్కెట్లో ప్రపంచ అగ్రగామిగా ఎదిగేందుకు తాము ఒక్కటి కాబోతున్నట్లు సీక్వెంట్ సైంటిఫిక్ లిమిటెడ్, వియాశ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం ప్రకటించాయి. ఈ విలీనం విలువ రూ.7,000-8,000 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ముంబై కేంద్రంగా 2002లో ఏర్పాటైన సీక్వెంట్ సైంటిఫిక్ యానిమల్ హెల్త్ కేర్ కంపెనీ. పశు సంరక్షణకు ఉపయోగించే ఔషధాల కోసం యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ), ఫార్ములేషన్స్‌ను తయారు చేస్తోంది. కాగా, హైదరాబాద్‌కు చెందిన వియాశ్ లైఫ్‌సైన్సెస్ ప్రత్యేక ఫార్ములేషన్స్, ఏపీఐ, అడ్వాన్స్‌డ్ ఇంటర్మీడియేట్స్ పోర్ట్‌ఫోలియోతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటిక్ కంపెనీ. అంతర్జాతీయ ఔషధ కంపెనీ మైలాన్ (ప్రస్తుతం వయాట్రిస్)లో గతంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన హరిబాబు బోడెపూడి 2019 ఫిబ్రవరిలో ఈ కంపెనీని ప్రారంభించారు. సీక్వెంట్‌తో పాటు వియాశ్ లైఫ్‌లోనూ అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కార్లైల్ గ్రూప్ పెట్టుబడులను కలిగి ఉంది. కాగా విలీనం తర్వాత ఏర్పడే కంపెనీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ 62.4 శాతం వాటా కలిగి ఉండనుంది. వియాశ్ నిర్వహణ సామర్థ్యాలతో విలీనం తర్వాత ఏర్పడబోయే కంపెనీ వ్యాప్తి మరింత పెరగడంతో పాటు పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) సామర్థ్యం విస్తృతం కానుంది. సప్లయ్ చెయిన్ కూడా బలపడనుంది. వేగంగా వృద్ధి చెందుతున్న యానిమల్ హెల్త్‌కేర్ మార్కెట్ లీడర్‌గా అవతరించేందుకు ఈ సామర్థ్యాలు దోహదపడనున్నాయని ఇరు సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి.

చట్టపరమైన, నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి ఈ విలీనం పూర్తి కానుంది. షేర్ల మార్పిడి ద్వారా జరగనున్న ఈ విలీనం అమలులోకి వచ్చాక, వియాశ్ లైఫ్‌సైన్సెస్ వాటాదారులకు ప్రతి 100 షేర్లకు గాను సీక్వెంట్ సైంటిఫిక్‌కు చెందిన 56 షేర్లు లభించనున్నాయి. సీక్వెంట్ జారీ చేయనున్న కొత్త షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో ట్రేడ్ కానున్నాయి. విలీన వార్తల నేపథ్యంలో సీక్వెంట్ సైంటిఫిక్ షేరు ధర శుక్రవారం 14.15 శాతం ఎగబాకి రూ.217.35కు చేరుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450▲	70,100▲	1,02,000▲
ముంబై	75,640▼	69,286▼	91,448▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	530
వరంగల్	507	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	126
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	121		



భారత్ బయోటెక్.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం అందించింది. శుక్రవారం నాడిక్కడ సచివాలయంలో ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రూ.కోటి చెక్‌ను భారత్ బయోటెక్ కో-ఫౌండర్, జేఎండీ సుచిత్రా ఎల్లా అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్.. నువ్వు హిందువా, క్రైస్తవుడివా?

- మహామహులే తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకాలు చేశారు
- వారిలో ఎవరికంటే నువ్వు గొప్ప: టీడీపీ నేత ఆనం ఆగ్రహం



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 27: 'వైఎస్ జగన్ అసలు నువ్వు హిందువా.. క్రైస్తవుడివా.. స్పష్టం చేయాలి' అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ కుటుంబమంతా క్రైస్తవులేనని అన్నారు. ఆయన ముత్తాత వెంకటరెడ్డి వందేళ్ల క్రితమే 1925లో క్రిస్టియన్‌గా మారారని, అప్పటి నుంచి వారి కుటుంబం అంతా జీసస్‌నే నమ్ముకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని సాక్షాత్తూ వైఎస్సార్ చెల్లెలు విమలమ్మ తన ఆత్మకథలో స్పష్టం చేశారని గుర్తుచేశారు. జగన్ అసలు ఏ మతమో తేల్చకుండా ఏ కులాన్ని మోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'వైఎస్సార్ తల్లి జయమ్మ, భార్య విజయమ్మ, జగన్ భార్య భారతి, చెల్లెలు షర్మిల కూడా క్రైస్తవులే. జయమ్మ పేరు మీద పులివెందులలో చర్చి నిర్మించిన మాట వాస్తవమా.. కాదా? జగన్, భారతిల వివాహం క్రైస్తవ పద్ధతిలో జరిగినట్లు పెళ్లి పత్రికలు రుజువు చేస్తున్నాయి. నీ తండ్రి వైఎస్ చనిపోయినప్పుడు క్రిస్టియన్ పద్ధతిలో అంత్యక్రియలు జరగలేదా? సీబీఐకి ఇచ్చిన అఫిడవిట్‌లో జగన్ తాను క్రైస్తవుడిగా చెప్పినట్లు రికార్డులు ఉన్నాయి. అయినా హిందువునని నాటకాలాడుతున్నారు. దమ్ముంటే నీ భార్య, కుమార్తెలను తీసుకుని తిరుమల వచ్చి తలనీలాలివ్వు. జీసస్‌తో, వేంకటేశ్వర స్వామితో పెట్టుకున్నావ్ జగన్.. భస్మమైపోతావ్. నీకంటే పెద్దవాళ్లు అయిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సోనియాగాంధీ, ఫరూఖ్ అబ్దుల్లా, మహ్మద్ జానీలాంటి వారు సైతం డిక్లరేషన్‌లో సంతకాలు పెట్టి మరీ ఆలయంలోకి అడుగుపెట్టారు. మీరేమైనా దేవుళ్లకే దేవుళ్లా.. ఎవరికంటే నువ్వు గొప్పో చెప్పాలి. టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సుబ్బారెడ్డి గురుస్వామా? ఒరేయ్ సుబ్బిగా.. చైర్మన్‌గా ఉండి పింక్ డైమండ్ కేసు ఎందుకు విత్‌డ్రా చేసుకున్నావు? మీ సంగతి ఆ దేవుడే చూసుకుంటాడు. వీరికితోడు ఇంగ్లీష్ కూడా రాని, కనుపర్తిపాడులో (నెల్లూరు రూరల్ మండలం) పందులు మేపుకునే పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కూడా పంది భాష మాట్లాడుతూ పంది ధరలు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఇలాంటి వారంతా కలిసి దేవుడి జోలికి వస్తే తగిన శాస్తి జరుగుతుంది' అంటూ ఆనం మండిపడ్డారు.

హైందవ శక్తి జాగృతం కావాలి: మాధవీలత



తిరుమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హైందవ శక్తి జాగృతం కావాలని, మన ధర్మాన్ని సంరక్షించుకుంటేనే మన గుర్తింపును కాపాడుకోగలుగుతామని తెలంగాణ బీజేపీ నేత మాధవీలత అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏ మతానికి చెందినవారు ఆ మతానికి సంబంధించిన దేవాలయాల్లో తప్పు చేస్తారా అని ప్రశ్నించారు. మన ధర్మాన్ని, దేవాలయాలను కాపాడుకోవడం కంటే జీవితంలో మరో కార్యక్రమం లేదని చెప్పారు. దీన్ని అడ్డుకునే వ్యక్తులను నిర్మూలించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.

డిక్లరేషన్ ఇచ్చేందుకు జగన్‌మనసు ఒప్పుకోలేదు

- అందుకే తిరుమల పర్యటన రద్దు: ఎంపీ రఘునందన్

ఖమ్మం, నిజామాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి టీటీడీలో డిక్లరేషన్ ఇచ్చేందుకు మనస్సు ఒప్పుకోక తిరుమల పర్యటన రద్దుచేసుకున్నారని తెలంగాణకు చెందిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. జగన్ మాట మార్చాడని, హిందూ దేవాలయ సంప్రదాయాలను ఎవరైనా గౌరవించాల్సిందేనని రఘునందన్ సూచించారు. ప్రతి మతానికి నియమావళి, కట్టుబాట్లు ఉంటాయన్నారు. టీటీడీలో కూడా అన్యమతస్తులు వస్తే డిక్లరేషన్‌పై సంతకం చేసి స్వామివారిని దర్శించుకోవాలని నిబంధన ఉన్నప్పుడు అన్యమతస్తుడైన జగన్ రెడ్డి నిబంధన పాటించాలన్నారు. ఖమ్మంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడారు. డిక్లరేషన్ ఇస్తే క్రైస్తవ మత పెద్దలనుంచి అభ్యంతరాలు వస్తాయోనని, విదేశాలనుంచి వచ్చే పైసల పంచాయతీలకు భయపడి జగన్ పర్యటన వాయిదా వేసుకున్నారని ఆరోపించారు.

సమగ్ర విచారణ జరిపించాలి: ఎంపీ అర్వింద్

తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై కేంద్రం సీరియస్‌గా ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సమగ్ర విచారణ జరిపించాలన్నారు. హిందూ సమాజ ఐక్యతను దెబ్బతీసే కుట్ర జరుగుతుందన్న ఆయన సనాతన ధర్మస్థాపన కోసం బోర్డు గతంలోనే ఏర్పాటు కావాల్సిందన్నారు.

క్రిస్టియన్ ఓట్లు పోతాయనే డిక్లరేషన్ ఇవ్వలేదు: పద్మరాజు

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'తిరుమలేశుడి దర్శనానికి వెళ్ళినప్పుడు డిక్లరేషన్‌పై సంతకం పెడితే క్రిస్టియన్ ఓట్లకు గండిపడుతుందని జగన్ భయపడుతున్నారు. తిరుమలలో నిబంధనలను సీఎంగా ఉన్నప్పుడు బుల్‌డోజ్ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. అలా చేయడం కుదరదు' అని టీటీడీ మాజీ సభ్యుడు రుద్రరాజు పద్మరాజు వ్యాఖ్యానించారు. శుక్రవారమిక్కడి టీడీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'ఏ మతస్థుడైనా వెంకన్నను దర్శించుకోవచ్చు. కానీ డిక్లరేషన్‌పై సంతకం చేయాలి. అబ్దుల్ కలాం వంటి వారు కూడా డిక్లరేషన్‌పై సంతకం చేశారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే వైసీపీలోని గుండాలను జగన్ ప్రేరేపించి టీడీపీ, జనసేన శ్రేణులపైకి రెచ్చగొడుతున్నారు' అని మండిపడ్డారు. టీటీడీలో కొనుగోళ్ల కమిటీ, వర్క్స్ కమిటీలో సభ్యుడిగా ఉన్నప్పుడు తాము తీసుకొన్న జాగ్రత్తలను ఆయన వివరించారు.

అందుకే 11 సీట్లకు పరిమితమయ్యారు

- సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ ఎద్దేవా




గుంటూరులో ఐక్యత చాటుతున్న సనాతన ధర్మ పరిక్షణ జేఏసీ నాయకులు

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'హిందూ ధార్మిక విధానాలపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు. జగన్ మతం మానవత్వం అయితే ఆయన సీఎంగా ఉన్న సమయంలో జరిగిన హత్యలు, అరాచకాల మాటేమిటి? ఇదేనా జగన్ మానవత్వం' అని సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ నాయకులు ప్రశ్నించారు. జగన్ తిరుమల పర్యటన రద్దు హిందూ ధార్మిక భక్తుల విజయంగా అభివర్ణించారు. శుక్రవారమిక్కడ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకులు సిరిపురపు శ్రీధర్ శర్మ, జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, వావిలాల కుమార్ మాట్లాడారు. తాను 11సార్లు స్వామివారిని దర్శించుకున్నా ఏనాడూ డిక్లరేషన్‌పై సంతకం అడగలేదని జగన్ మీడియా సమావేశంలో చెప్పారని, దీనిపై టీటీడీ అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్‌పై సంతకాలు చేయకుండా స్వామివారిని 11సార్లు దర్శించినందుకే ఎన్నికల్లో ఆయన 11 సీట్లకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. జగన్ ముత్తాతల నుంచి తరతరాలుగా అన్యమతాన్ని స్వీకరించినట్లు రికార్డులు చెబుతున్నాయని, జగన్ వివాహం కూడా అన్యమత సంప్రదాయంలో జరిగిందని తెలిపారు, జగన్ సతీసమేతంగా బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి ఎందుకు పట్టువస్త్రాలు సమర్పించలేదని ప్రశ్నించారు. జగన్ పర్యటన రద్దు సనాతన ధార్మిక ప్రజల విజయమని, భవిష్యత్‌లో కూడా డిక్లరేషన్‌పై సంతకం చేస్తానని ప్రకటిస్తేనే ఆయన్ను తిరుమల కొండపై కాలు పెట్టనిస్తామని స్పష్టం చేశారు.

తిరుపతి లడ్డూకు 'పలాస' టేస్ట్

- 45ఏళ్ల తర్వాత తిరిగి పలాస జీడిపప్పు
- రోజు 3టన్నుల సరఫరాకు అంగీకారం



తిరుమలకు వెళ్తున్న జీడిపప్పు లారీ

పలాస, సెప్టెంబరు 27: పలాస జీడిపప్పు ఇక తిరుపతి లడ్డూలో కలిసి భక్తులకు మరింత రుచిని పంచనుంది. పలాస జీడిపప్పును తిరిగి తిరుపతి లడ్డూ తయారీలో వినియోగించాలని ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జీడి పప్పు సరఫరా టెండరును పలాసకు చెందిన కోరాడ సంతోష్‌కుమార్ (ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రో) అనే వ్యాపారి దక్కించుకున్నారు. ఈ క్రమంలో సుమారు 45 ఏళ్ల తర్వాత తిరుమలకు పలాస జీడిపప్పు చేరుకుంది. గురువారం తొలి జీడిపప్పు లారీని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ లారీ తిరుమలకు చేరింది.

వెంకన్నపై విశ్వాసం లేదు!





(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'నేను బైబిల్ చదువుతాను. అయినప్పటికీ... తిరుమలకు కూడా వెళతా! కానీ... వేంకటేశ్వర స్వామిపై విశ్వాసం ఉందని మాత్రం డిక్లరేషన్ ఇవ్వను"... ఇదీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒకింత సూటిగా చెప్పిన మాట! తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిపై తనకు భక్తి విశ్వాసాలు లేవని ఆయన తనంతట తానుగానే చెప్పేశారు. పైగా... అన్యమతస్తులు తిరుమలకు వస్తే వెంకన్నపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాలంటూ తరతరాలుగా ఉన్న నిబంధననే తప్పుపట్టారు. నాలుగు గోడల మధ్య బైబిల్‌ను చదువుతానని చెబుతూ... బయటికి వస్తే హిందూ, ముస్లిం, సిక్కువంటి ఇతర మతాలను గౌరవిస్తానని చెప్పారు.

అహం అడ్డొచ్చిందా...

'మానవత్వం నా మతం' అంటూ జగన్ సినిమా డైలాగులు చెప్పినప్పటికీ... ప్రార్థనా మందిరాల్లో మాత్రం ఆయా మత సంప్రదాయాలను పాటించాల్సిందే! ఎవరికైనా ఇది తప్పదు. ఇతర మతస్తులు అనేకులు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. 'డిక్లరేషన్' ఇచ్చినంత మాత్రాన వారు తమ సొంత మతాన్ని వదులుకున్నట్లు కాదు! వేంకటేశ్వరుడిపై విశ్వాసం ఉందని అంగీకరించినంత మాత్రాన తమ ఆచారాలను వదిలేసినట్లూ కాదు. గతంలో అనేక మంది ప్రముఖులు ఎలాంటి భేషజాలకు పోకుండా డిక్లరేషన్‌పై సంతకం చేశాకే దర్శనానికి వెళ్లారు. కానీ... జగన్‌కు మాత్రం అహం అడ్డొచ్చింది. జగన్ తిరుమలకు వెళతారని వైసీపీ ప్రకటించడంతో.. 'డిక్లరేషన్' డిమాండ్ మరోమారు తెరపైకి వచ్చింది. అధికారంలో ఉండగా భక్తుల మనోభావాలు దెబ్బతీసిన జగన్... ఇప్పుడైనా డిక్లరేషన్ ఇచ్చాకే శ్రీవారిని దర్శించుకోవాలని హిందూ సంఘాలు పట్టుబట్టాయి. వైసీపీ నేతలు వీరిని మరింత రెచ్చగొట్టేలా వ్యవహరించారు. కొండపై ఎలాంటి ఆందోళనలూ జరగకుండా శాంతియుతంగా జగన్ పర్యటన ముగిసేలా.... 'డిక్లరేషన్‌'పై సంతకం చేస్తే సరిపోతుందని టీటీడీ సూచించింది. కానీ.. అలా డిక్లరేషన్ ఇచ్చేందుకు జగన్‌కు అహం అడ్డొచ్చింది. ఆ విషయాన్ని సూటిగా చెప్పకుండా, 'ఆలయానికి వెళితే మతం అడుగుతారా! నన్ను అడ్డుకుంటారా' అని వాపోయారు. ఒకవైపు తాను హిందువును కాదని అంగీకరిస్తూనే, మరోవైపు డిక్లరేషన్ ఇచ్చేందుకు నిరాకరించడమేమిటో జగన్‌కే తెలియాలి. ఇక... జగన్ తిరుమల పర్యటనను ఎవరూ అడ్డుకోలేదు. దీనిని బలప్రదర్శనగా మార్చేందుకు జరిగిన ప్రయత్నాల నేపథ్యంలో మాత్రమే పోలీసులు నిలువరించారు. తిరుపతిలో 30 పోలీస్ యాక్ట్‌ను విధించారు. తిరుమలకు వెళ్లి రచ్చ చేస్తారనే అనుమానం ఉన్న నేతలకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. జగన్ ఐదేళ్ల పాలనలో నోటీసులు, ముందస్తు గృహ నిర్బంధాలు కోకొల్లలు! అడుగు బయటపెడితే అరెస్టులే! ఇలాంటివేవీ ఇప్పుడు జరగలేదు. నిజానికి... జగన్ శుక్రవారం తిరుమలకు వెళ్లే ప్రయత్నమే చేయలేదు. 'డిక్లరేషన్' పేరుతో తనంతట తానే తన పర్యటన రద్దు చేసుకున్నారు.

ఏమైంది జగనా?

(మొదటి పేజీ తరువాయి)

హిందుత్వం? ఇదేం సెక్యులరిజం?" అని గద్దించారు. రాజ్యాంగం ప్రకారం భారత్ సెక్యులర్! అంటే... లౌకిక దేశం! ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూడాలి. ఇది నిర్వివాదాంశం. కానీ... ప్రార్థనామందిరాలు 'సెక్యులర్' కాదు! అవి కచ్చితంగా మతపరమైనవే. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారో తెలియడంలేదు. హిందూ ఆలయాలు, సిక్కు, జైనుల మందిరాలు, ముస్లింల మసీదులు, క్రైస్తవుల చర్చిలు... ఇవన్నీ మతపరంగానే ఉంటాయి. ఏ మతస్తులు ఆ మత ఆచారాల ప్రకారం తమ ప్రార్థనా మందిరాలను సందర్శిస్తారు. వారి వారి ఆచారాల ప్రకారం ప్రార్థనలు చేసుకుంటారు. కొన్ని హిందూ ఆలయాల్లో ప్రవేశించాలంటే పురుషులు చొక్కా విప్పాలి. తిరుమలలో సేవలో పాల్గొనే వారు సంప్రదాయ దుస్తులు ధరించాలి. మసీదుల్లో ఒక దశ దాటి మహిళలకు ప్రవేశం ఉండదు. గురుద్వారాలోకి వెళ్లే వారు తలపై వస్త్రం కప్పుకోవాలి. ఇలా... ప్రతి మతానికీ, కొన్ని ప్రార్థనా మందిరాలకూ నిర్దిష్టంగా కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. ఇవన్నీ మరచిపోయి... 'సెక్యులర్ అంటే అర్థం ఏమిటి? మనం ఎలాంటి దేశంలో ఉంటున్నాం? దేవాలయానికి వెళితే మతం అడుగుతారా?' అని జగన్ వాపోవడమే ఓ విచిత్రం! ఇతర మతస్తులు శ్రీవారి దర్శనానికి వచ్చినప్పుడు వెంకటేశ్వరుడిపై తమకు విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వడం ఎన్నో దశాబ్దాలుగా ఉన్న నిబంధన! దీనిపై అభ్యంతరం ఉంటే... తాను అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఈ నిబంధనను ఎత్తేయవచ్చు కదా!?

మీది దానవత్వం కాదా?

'దేవాలయాలకు వెళ్లే వారిని అడ్డుకోవడం మానవత్వమా?' అని జగన్ తనదైన శైలిలో వాపోయారు. జగన్ తిరుమలకు వెళ్లకుండా ఎవ్వరూ అడ్డుకోలేదు. బహుశా డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టంలేక... ఆయన తన పర్యటన రద్దు చేసుకున్నారు. ఈ విషయం పక్కన పెడితే... జగన్ తాను అధికారంలో ఉన్నప్పుడు విజయవాడ కనక దుర్గ అమ్మవారికి సారె ఇవ్వడానికి వెళ్లిన రాజధాని మహిళలను పోలీస్ లాఠీలతో కొట్టించారు. రాజధాని రైతుల తిరుమల పాద యాత్రకు అడ్డంకులు సృష్టించారు. అరసవెల్లికి వెళ్లకుండా వెనుదిరిగేలా చేశారు. మరి... ఇప్పుడు వల్లెవేస్తున్న మానవత్వపు ముచ్చట అప్పుడేమైందో?

కల్తీ కాలేదా? నవ్విపోదురుగాక!

జగన్మోహన్ రెడ్డి తన 'సూక్తిముక్తావళి'లో ఇంకా అనేకానేకమైన విన్యాసాలు ప్రదర్శించారు. తిరుమలకు వచ్చిన నెయ్యి ట్యాంకర్ల నుంచి తీసిన శాంపిల్స్‌లో కల్తీ ఉన్నట్లు నిర్ధారణ కావడం నిజం! దీనిని పక్కన పెట్టేసి... 'అసలు ట్యాంకర్లల్లో నెయ్యిని వాడనప్పుడు లడ్డూలో కల్తీ జరిగిందని, కొవ్వు కలిసిన లడ్డూలు భక్తులకు అందించారని చంద్రబాబు ఎలా ఆరోపిస్తారు?" అని జగన్ ప్రశ్నించారు. అసలు వాస్తవాలను మరుగున పరిచి అసత్యాలను ప్రచారంలోకి తేవడానికి నానా తంటాలు పడ్డారు. నిజానికి... తిరుమలలో జరిగింది వేరు. టీటీడీకి ఐదు కంపెనీల నుంచి నెయ్యి సరఫరా అవుతోంది. అందులో దుండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ కంపెనీ ఒకటి. వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుమల లడ్డూ ప్రసాదంలో నాణ్యత తగ్గిపోయిందనే ఫిర్యాదులపై ఇప్పుడు టీటీడీ దృష్టి సారించింది. సరఫరాదారుల నుంచి వచ్చిన నెయ్యిలో కల్తీని పరీక్షించే పూర్తిస్థాయి ల్యాబ్ టీటీడీలో లేదు. ఒక దశ వరకు మాత్రమే నాణ్యతను నిర్ధారించవచ్చు. అలా ఐదు కంపెనీల నుంచి వచ్చిన నెయ్యి క్వాలిటీ టెస్ట్ చేసి లడ్డూల తయారీకి వినియోగించారు. ఆ తర్వాత బ్యాచ్‌లో వచ్చిన నెయ్యిని గుజరాత్‌లోని ఎన్‌డీడీబీలో పరీక్షించారు. అక్కడ... ఏఆర్ ఫుడ్స్ నుంచి వచ్చిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఆ ట్యాంకర్లను వెనక్కి పంపించారు. నెయ్యిలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు ఉన్నట్లు ఎన్‌డీడీబీ ల్యాబ్ రిపోర్టులో రావడంతో జూలై 6, 12వ తేదీల్లో వచ్చిన ట్యాంకర్లను టీటీడీ అధికారులు వెనక్కి పంపించారు. ఇదీ అక్కడ జరిగింది. 'అసలు ఆ నెయ్యి వాడలేదు కదా' అని జగన్ చెబుతున్నది దీని గురించే. అంతకుముందు జరిగిన సరఫరా గురించి మాత్రం ఆయన తెలివిగా దాటవేస్తున్నారు. దేశంలో అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ల్యాబరేటరీ నివేదికను కూడా జగన్ తప్పు పడుతుండటం గమనార్హం. అది జాతీయ స్థాయి సంస్థ. జాతీయ ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ కూడా దీన్ని రిఫరల్ ల్యాబరేటరీగా ఉపయోగిస్తుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న సంస్థను కూడా జగన్ తన మీడియా సమావేశంలో తేలిగ్గా తీసిపడేశారు. అసలు ఆ రిపోర్టును నమ్మాల్సిన అవసరం లేదన్న విధంగా చెప్పుకొచ్చారు.

డిస్‌క్లైమర్ గొడవ ఏమిటి?

ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికలో నెయ్యిలో ఉండాల్సిన ప్రమాణాలు సరిగ్గా లేవని చెబుతూ, డిస్‌క్లైమర్ పెట్టారని జగన్ సూత్రీకరించారు. బహుశా ఆయన ఉద్దేశం అది కల్తీ నెయ్యి కాదు.. ఆవులు అనారోగ్యంతో ఉన్నా అలాంటి ఫలితం రావచ్చునని, దానిని కల్తీ అనలేమని కావొచ్చు. జగన్ ఇక్కడే లోకజ్ఞానాన్ని మరిచిపోయారు. ఏ పరీక్ష నివేదికలోనైనా 'డిస్‌క్లైమర్' ఉంటుంది. ఏ ల్యాబరేటరీ అయినా శాంపిల్ తీసిన సమయాన్ని తాను పరీక్షించిన సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుట్ నోట్ ఇస్తుంది. ప్రతి ల్యాబరేటరీ లెటర్ హెడ్‌లో ముందే 'డిస్‌క్లైమర్'ను ముద్రిస్తారు. మనం చేయించుకునే రక్త పరీక్షలు, ఇతర రిపోర్టుల్లోనూ దీనిని గమనించవచ్చు. అంతమాత్రాన... ఆ నివేదికలోని అంశాలు తప్పు అని కాదు. ఆ నివేదిక పనికి రాదనికాదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికలోని డిస్‌క్లైమర్ కూడా ఇలాంటిదే! దీనిని చూపించి... ఎన్‌డీడీబీ కూడా గట్టిగా కల్తీ అని నిర్ధారించలేదని జగన్ వితండవాదం చేస్తున్నారు.

లడ్డూ వివాదాన్ని 'సుప్రీం' సుమోటోగా స్వీకరించాలి

- సీజేఐకి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల లేఖ



అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కల్తీ జరిగిందంటూ వస్తోన్న ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలి. లేదంటే రాష్ట్ర ప్రభుత్వం విచారణ కోసం వేసిన సిట్ తన ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేసేలా సుప్రీం కోర్టు ఆదేశించాలి' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆమె శుక్రవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. తిరుమల లడ్డూ వివాదాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేయాలని ఆమె తన లేఖలో కోరారు. దీనిపై షర్మిల మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో మత ఘర్షణలకు ఆజ్యం పోసేలా అధికార ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయి. దీక్షలు, ప్రమాణాలు కాదు... నిజం కావాలి. డిక్లరేషన్ నిబంధనలు అందరికీ వర్తిస్తాయి. రాష్ట్రంలో అసలు పాలన జరుగుతోందా? సీఎం చంద్రబాబు శాంతి హోమాలు చేస్తుంటే.. పవన్ దీక్షలు చేస్తున్నారు. జగన్ ప్రక్షాళన పూజలంటూ రాజకీయాలు చేస్తున్నారు. మార్కెట్‌లో ఆవు నెయ్యి రూ.700 నుంచి రూ.1,000 మధ్య కనిష్ఠ ధరకు దొరుకుతోంది. అదే నెయ్యి రూ.310కి ఇస్తామంటే... అది కల్తీది అన్న కామన్ సెన్స్ జగన్‌కు లేదా? లడ్డూలో కల్తీ జరిగిందని తెలుసు. జంతువుల ఆయిల్ కలిపారని కూడా తెలుసు. ఎన్‌డీడీబీ రిపోర్టు కూడా సాక్ష్యంగా ఉంది. అన్ని ఆధారాలున్నా చర్యలెందుకు లేవు? మత ఘర్షణలు జరగాలని రహస్య ఎజెండాతో పవన్ మాట్లాడుతున్నారు. బీజేపీ డైరెక్షన్‌లో పవన్, ప్రధాని మోదీ డైరెక్షన్‌లో చంద్రబాబు నడుస్తున్నారు. గతంలో తిరుమల దర్శనానికి వచ్చిన మోదీ 120 కోట్ల మంది భారతీయులకు మంచి జరగాలని మొక్కుకున్నామన్నారు. ఇప్పుడు తిరుమల లడ్డూ వివాదంపై ఎందుకు మౌనం వహించారు? సీబీఐ విచారణకు ఎందుకు ముందుకు రావడంలేదు? వంద రోజుల కూటమి పాలనపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతుందనే తిరుమల లడ్డూ అంశాన్ని తీసుకువచ్చారు. తిరుమల లడ్డూ అంశంపై సవాళ్లు, ప్రతిసవాళ్లు, ప్రమాణాలు, ప్రక్షాళనలు కాదు. నిజం కావాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

వెళ్లొద్దని మేం చెప్పామా?



(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిరావచ్చు. జగన్‌ను తిరుమల పోవద్దని ఎవరూ చెప్పలేదు. ర్యాలీలు, ప్రదర్శనలు మాత్రం వద్దని చెప్పారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయాలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇటువంటి సమయంలో వేల మందితో ర్యాలీలు చేస్తామని అక్కడ స్థానికంగా ఉన్న నాయకులు ప్రకటనలు ఇచ్చారు. అటువంటివి జరగకుండా స్థానికంగా పోలీసు యాక్టు 30 విధించి ర్యాలీలు, ప్రదర్శనలు చేయవద్దని ఆదేశాలిచ్చారు. జగన్‌కు వ్యక్తిగతంగా ఏ నోటీసూ ఇవ్వలేదు. తిరుపతిలో ఉన్న ఆయన పార్టీ నేతలకు మాత్రమే ర్యాలీలు చేయవద్దని నోటీసులిచ్చారు. ఆయనకు ఇచ్చి ఉంటే చూపించమనండి. అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం సరికాదు. తిరుమల హిందువులకు పెద్ద పుణ్యక్షేత్రం. జీవితంలో ఒక్కసారైనా స్వామిని సందర్శించి మొక్కులు తీర్చుకోవాలన్నది అనేక మంది కోరిక. ఆ ఆలయంలో కొన్ని ఆచార సంప్రదాయాలు ఉన్నప్పుడు దానిని పాటించడం సందర్శించేవారు పాటించాల్సిన కనీస ధర్మం. తిరుమల పవిత్రతను అందరూ కాపాడాలి. ఆగమ పద్ధతులు, ఆలయ సంప్రదాయాలు పాటించకపోతే భక్తులు బాధపడతారు. ఇంతకు ముందు కూడా డిక్లరేషన్ ఇవ్వకుండా వెళ్లాను కాబట్టి మళ్లీ వెళ్తాననడం ఏం పద్ధతి? ఒకసారి ధిక్కరించారు కాబట్టి మళ్లీ మళ్లీ ధిక్కరిస్తారా? చట్టాలను మనమే గౌరవించకపోతే ఇక ప్రజలు ఎందుకు గౌరవించాలి? ఏ సంప్రదాయాలూ పాటించేది లేదని రౌడీయిజం చేస్తారా? జమ్మూకశ్మీరు ముఖ్యమంత్రి కూడా ఈ ఆలయంలో డిక్లరేషన్ ఇచ్చి స్వామివారి సందర్శనకు వెళ్లారు. మరి వీళ్లకు ఏమిటి ఇబ్బంది' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు.

మతాన్ని గౌరవించినట్లే సంప్రదాయాలు గౌరవించండి..

తాను బయటకు వెళ్తే హిందూ మతాన్ని గౌరవిస్తానని జగన్ చెప్పడం సంతోషమని, కాని అదే సమయంలో మతాన్ని గౌరవించినట్లే ఆలయ ఆచార వ్యవహారాలను కూడా ఆయన గౌరవించాలని చంద్రబాబు సూచించారు. 'తాను ఇంట్లో బైబిల్ చదువుతానని జగన్ అంగీకరించారు. తానే చెప్పారు. దానిని దాచుకోవడం ఎందుకు? బహిరంగంగానే చదువుకోండి. అదేమీ తప్పు కాదు. నేను హిందువును. పూజలు చేస్తాను. చర్చికి లేదా మసీదుకు వెళ్లినప్పుడు అక్కడ ఏ సంప్రదాయం, ఆచారం ఉంటే దానిని పాటిస్తాను. మీరూ అలాగే ఉండండి. ఒక అబద్ధాన్ని పదేపదే చెబుతారు. దానిని తమ పత్రికలో, టీవీలో, బ్లూ మీడియాలో పదేపదే ప్రచారం చేస్తారు. తిరుమలకు వచ్చే నెయ్యిలో కల్తీ జరగలేదని ఈవో చెప్పారని ఒక అబద్ధాన్ని ఇదే మాదిరిగా ప్రచారం చేస్తున్నారు. కల్తీ జరిగిందని ఈవో బహిరంగంగా చెప్పినా ఆ ప్రచారం మానలేదు. కల్తీ నెయ్యి అసలు వాడనే లేదని మరో ప్రచారం చేశారు. ఏఆర్ ఫుడ్స్ అనే కంపెనీ నుంచి 8 ట్యాంకర్ల నెయ్యి వచ్చింది. అందులో నాలుగు ట్యాంకర్లు వాడారు. అనుమానం వచ్చి మరో నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకుండా నిలిపివేసి వాటి నుంచి శాంపిల్స్ తీసి గుజరాత్‌లో ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపారు. కల్తీ జరిగిందని అందులో వచ్చింది. మేం దానిని బయటపెట్టకపోతే.. అది మరో రకంగా బయటకు వస్తే మేం తప్పు చేసినట్లు కాదా! దేవుడు మమ్మల్ని క్షమిస్తాడా? తెలిసో తెలియక జరిగిన తప్పుల నుంచి కాపాడాలని ఆగస్టులో తిరుమల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల మళ్లీ సంప్రోక్షణ చేశారు. ఇవన్నీ ఈవో చేయించారు. కల్తీ జరగకపోతే ఇవన్నీ ఎందుకు చేయిస్తారు? తప్పు నేను చేశానని ఎదురుదాడి చేస్తున్నారు. నెయ్యి కొనుగోలుకు ఉన్న టెండర్ నిబంధనలు ఎవరు మార్చారు? రేటు తక్కువకు వస్తోందని ఎడాపెడా కొనుగోలు చేసింది ఎవరు? అన్నప్రసాదం నాణ్యత బాగోలేదని భక్తులు ఎంతోకాలంగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకుండా ఉన్నది ఎవరు? ఒక్క తిరుమలలోనే కాదు... అన్ని ఆలయాల్లో ఇలాగే చేశారు. అన్నీ ప్రక్షాళన చేస్తున్నాం. ఇప్పుడు ఇన్ని నీతి కబుర్లు చెబుతున్నారు.. రామతీర్థంలో రాముడి తల నరికింది ఎవరో తేల్చారా? అంతర్వేది ఆలయ రథం తగలబెట్టిన వాళ్లు, కనకదుర్గ ఆలయంలో వెండి సింహాలు ఎత్తుకెళ్లిన వాళ్లపై చర్యలు తీసుకున్నారా? ఇటీవల అనంతపురం జిల్లాలో రథాన్ని తగులబెడితే మేం వెంటనే నిందితులను పట్టుకున్నాం. వైసీపీకి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఆ పని చేశాడు. మేం ఇవన్నీ మాట్లాడకుండా మౌనంగా ఉండాలా' అని ఆయన ప్రశ్నించారు.

డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే వెళ్లలేదు

శ్రీవారి ఆలయంలో అక్కడి నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే జగన్ వెళ్లలేదనిపిస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ఆయనకు విశ్వసనీయత లేదు. నోటికి ఏదొస్తే అది మాట్లాడుతుంటారు. దళితులను ఆలయం లోపలికి రానివ్వడం లేదని అంటున్నారు. దళితులను ఎవరు ఆపారు.. ఎక్కడ ఆపారు? ప్రసాదంలో కల్తీపై భక్తులు మనోవేదన చెందుతుంటే జగన్‌కు ఏ పట్టింపూ లేదు. కల్తీ నెయ్యి వాడలేదని ఒక మాటతో దులుపుకొని పోవాలని చూస్తున్నారు. వాడారన్నది స్పష్టం. అది కల్తీ అని పరీక్షలో తేలింది. గతంలో అసలు పరీక్షలే చేయలేదు. కల్తీ కనుక్కోవడానికి అవసరమైన ల్యాబ్ తిరుమలలో అసలు లేనే లేదు. ఇప్పుడు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ల్యాబ్ పెడుతున్నాం. మళ్లీ అపవిత్ర కార్యక్రమాలు జరుగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం. ఏ మతానికి చెందిన ఆలయం లేదా ప్రార్థనా మందిరంలో ఆ మతానికి చెందిన వారే పనిచేసేలా చట్టం కూడా తెస్తున్నాం. తిరుమలను మరింత పవిత్రంగా తీర్చిదిద్దడానికి త్వరలో కొందరు మేధావులు, పండితులతో సమావేశాన్ని నిర్వహించబోతున్నాం' అని వెల్లడించారు. పందికొవ్వు బంగారమంటూ వైసీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఇష్టానుసారం మాట్లాడితే జగన్ దానిని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. లౌకిక దేశంలో ఇటువంటి డిక్లరేషన్ నిబంధనలు ఉండకూడదన్న జగన్ వాదనను ఆయన తిప్పికొట్టారు. 'దేశంలో మత సామరస్యం కాపాడడానికి మనం లౌకిక విధానాలు పాటిస్తున్నాం. ఆ పేరుతో మనోభావాలు దెబ్బతీయడానికి కాదు. నేను హిందువునే అయినా ఏదైనా ఆలయంలో ఉన్న ఆచార సంప్రదాయాలను పాటించడం ఇష్టం లేకపోతే అక్కడకు పోను. ముఖ్యమంత్రి కూడా అలాగే ఉండాలి. ముఖ్యమంత్రి అందరి కంటే మొదట చట్టాలను గౌరవించాలి. రాజ్యాంగాన్ని, చట్టాలను పాటిస్తానని ఆ పదవిలో చేరే ముందు ప్రమాణం చేస్తారు. ఆ ప్రమాణాన్ని జగన్ ఉల్లంఘించారు. తన తప్పును టీటీడీ సభ్యులపై తోయడం సరికాదు. రాజ్యాంగాన్ని, ఆలయ సంప్రదాయాలను పాటించవద్దని బీజేపీ, ఇతర పార్టీలు ఆయనకు ఏమైనా పర్మిషన్స్ ఇచ్చాయా? జంబో బోర్డు వేయడం తప్పు. ఆలయాన్ని పైరవీలకు వాడుకోవడం తప్పు. సీనియర్ ఐఏఎస్‌లను ఈవోగా వేయకుండా తనకు కావలసిన వారిని ఎక్కడి నుంచో తెచ్చిపెట్టుకోవడం మరో తప్పు. తప్పులు ఎవరు చేసినా శిక్షలు తప్పవు. మేం ప్రక్షాళన కోసమే శ్యామలరావును ఈవోగా వేశాం. విజిలెన్స్ విచారణ వేశాం. ఇప్పుడు సిట్ వేశాం. తప్పులు జరిగి ఉంటే హుందాగా అంగీకరించి విచారం వ్యక్తం చేస్తే అదొక పద్ధతి. ఎదురుదాడి చేయడం సరికాదు. డిక్లరేషన్ ఇవ్వాలన్నది చట్టం. ఆ చట్టం లేదని ఆయన అనడం లేదు. తనను గతంలో అడగలేదని వాదిస్తున్నారు. ఇప్పుడు అడుగుతున్నప్పుడు దానిని పాటించాలి. అందులో వివాదం ఎందుకు? మీరు క్రైస్తవ మతం పాటిస్తున్నామని బహిరంగంగా ఒప్పుకొన్నప్పుడు ఇక్కడ డిక్లరేషన్ పాటించండి. దానిని వివాదం చేయడం సరికాదు' అని అన్నారు. డిక్లరేషన్‌కు సంబంధించిన చట్టాన్ని తీసేయలేదని, అది కొనసాగుతూనే ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఇదేం దేశం.. ఇదేం హిందుత్వం!?

- దర్శనానికి వెళ్తే డిక్లరేషన్ అడుగుతారా!?
- లడ్డూపై బాబువన్నీ అబద్ధాలే: జగన్



అమరావతి/తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మనం ఎలాంటి దేశంలో నివసిస్తున్నాం? ఆలయంలో ప్రవేశించే వ్యక్తి తన మతమేంటో చెప్పాలా? ఇదేం దేశం.. ఇదేం హిందూయిజం' అని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. లడ్డూ ప్రసాదంపై వివాదం నేపథ్యంలో ఆకస్మికంగా తిరుమల యాత్ర తలపెట్టిన ఆయన.. అంతే ఆకస్మికంగా రద్దుచేసుకున్నారు. ఆ తర్వాత తాడేపల్లి ప్యాలెస్‌లో ఎంపిక చేసిన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనానికి వెళ్లాలంటే డిక్లరేషన్ ఇవ్వాలని తనను డిమాండ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. 'ఎలాంటి లౌకికవాదంలో, ఎలాంటి లౌకికదేశంలో మనం నివసిస్తున్నాం. ఇదెక్కడి హిందూత్వం.. ఇదేం హిందూయిజం' అని ప్రశ్నించారు. నాలుగ్గోడల మధ్య తాను బైబిల్ చదువుతానని స్పష్టం చేశారు. బయట హిందూ, ముస్లిం మతాలను గౌరవిస్తానని.. పార్శీ, సిక్కు మతాలనూ గౌరవిస్తానని చెప్పారు. తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకుంటానంటే తన మతమేమిటని అడుగుతారా అని మండిపడ్డారు. తన మతం మానవత్వమని.. డిక్లరేషన్‌లో రాసుకోవాలంటూ టీటీడీకి సూచించారు. దేవాలయానికి వెళ్తే మతమేమిటని అడుగుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడికి వెళ్తే మతమేంటో చెప్పాలనడమే హిందూత్వమా అని ప్రశ్నించారు. తాను ఎప్పటినుంచో వెంకన్న దర్శనానికి వెళ్తున్నానని.. ఏనాడూ కోరని డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకు అడుగుతున్నారని అడిగారు. హిందూత్వకు టార్చ్ బేరర్లమని చెప్పుకొనే బీజేపీ.. దేవాలయాలకు వెళ్తే.. మతాన్ని అడుగుతుంటే సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడకపోయినా.. వాడినట్లుగా అబద్ధాలు చెబుతుంటే చంద్రబాబును ఆ పార్టీ ఎందుకు నిలదీయడం లేదన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన తనలాంటివాడినే డిక్లరేషన్ అడుగుతుంటే.. సామాన్యులు, ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఐదేళ్లపాటు వెంకన్నకు వస్త్రాలు సమర్పించానన్నారు. దేవాలయానికి వెళ్తే మత ప్రస్తావనతో అడ్డుకోవడం దేశంలో ఎక్కడా ఉండదని చెప్పారు. తన తిరుమల పర్యటనకు అనుమతి లేదంటూ వైసీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నేతలకు పోలీసులు నోటీసులివ్వడం ఏమిటని మండిపడ్డారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని తేలిపోవడంతో.. దానిని డైవర్ట్ చేయడానికే డిక్లరేషన్ అంశాన్ని తీసుకొచ్చారని చెప్పారు. జంతువుల కొవ్వుతో తిరుమల లడ్డూ తయారుచేశారంటూ ఆయన చెబుతున్నవి అబద్ధాలేనని తాను నిరూపిస్తానన్నారు. టీడీపీ హయాంతోపాటు తన హయాంలోనూ నెయ్యి కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలూ జరుగలేదని చెప్పారు. ప్రసాదం తయారీ కోసం కొనుగోలు చేసే నెయ్యి నాణ్యతను పరిశీలించేందుకు మూడంచెల పరీక్షలు ఉంటాయన్నారు. కల్తీ ఉంటే.. వెంటనే లారీని వెనక్కు పంపేస్తారని తెలిపారు. జూలైలో వచ్చిన 4 లారీలను వెనక్కి పంపారన్నారు. తిరస్కరించిన నెయ్యిని వాడనప్పుడు.. ప్రసాదంలో జంతువుల కొవ్వు ఎలా కలుస్తుందని ప్రశ్నించారు. నిర్ణీత స్థాయిలో నెయ్యి నాణ్యత లేకపోవడానికి కారణాలను లేబొరేటరీ వెల్లడించిందని అన్నారు.

దోషులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి: సీపీఐ

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదంలో దోషులు ఎంత పెద్దవారు ఉన్నా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్వామికి మత రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 'గత వారం రోజులుగా ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి సహా అన్ని పార్టీల నాయకులు, మీడియా మొత్తం తిరుమల లడ్డూ సమస్య చుట్టూనే తిరుగుతున్నారు. ఇప్పటికైనా ఆ వివాదానికి స్వస్తి పలకాలి. మాజీ సీఎం జగన్... వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తే తిరుమల అపవిత్రమవుతుందంటూ కొందరు అధికార పార్టీ ప్రతినిధులు వ్యాఖ్యానించడం సరికాదు. గత ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్ స్వామి వారికి పట్టు వస్త్రాలు ఇచ్చినప్పుడు ఏమీ మాట్లాడకుండా ఇప్పుడు సాధారణ భక్తుడిలా తిరుమలకు వెళ్తానంటున్న జగన్‌ను డిక్లరేషన్ అడగడం సరైన విధానం కాదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భార్య క్రిస్టియన్ కాదా? మరి ఆయన తిరుమలకు ఎలా వెళ్తున్నారు? మతం, కులాల పేరుతో భావోద్వేగాలను రెచ్చగొట్టేలా చర్యలను విడనాడాలి' అని రామకృష్ణ అన్నారు.

నందిగం సురేశ్ విచారణకు సహకరించడం లేదు

- టీడీపీ కార్యాలయంపై దాడిలో ఆయన కీలక కుట్రదారు
- సురేశ్‌కు నేరచరిత్ర.. ఆయనపై మూడు క్రిమినల్ కేసులు
- బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు
- మాజీ ఎంపీ బెయిల్ పిటిషన్ కొట్టివేయండి: పోలీసుల కౌంటర్



అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడి కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ విచారణకు సహకరించడం లేదని కేసు దర్యాప్తు అధికారి, మంగళగిరి గ్రామీణ సీఐ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. 'దాడి ఘటనలో సురేశ్ పాత్ర ఉన్నట్లు సహచర నిందితులు, సాక్షులు వాంగ్మూలం ఇచ్చారు. ఘటన జరిగినప్పుడు ఆయన టీడీపీ కార్యాలయం వద్దే ఉన్నట్లు నిర్ధారించారు. దాడిలో 120 మంది పాల్గొన్నట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించాం. కొందరు నిందితులు ఇళ్ల వద్ద అందుబాటులో లేరు. వారి వివరాలు సేకరిస్తున్నాం. పోలీసు కస్టడీలో మొబైల్ ఫోన్ల గురించి ప్రశ్నించగా, తన రెండు ఐఫోన్లు పోయాయని సురేశ్ చెప్పారు. దీనిపై ఆయన ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం వాడుతున్న ఫోను కూడా ఇవ్వలేదు. కేసుకి సంబంధించిన కీలకమైన సమాచారం మొత్తం ఆ ఫోనులోనే ఉంది. ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను పరిశీలిస్తే టీడీపీ కార్యాలయంపై దాడి ఘటన వెనుక సురేశ్ కీలక కుట్రదారు. ఘటనలో భాగస్వాములైన వారిని గుర్తించేందుకు వాట్సాప్ మెసేజ్‌లు పరిశీలించాలి. అందుకు ఆయన ఉపయోగించిన ఫోను స్వాధీనం చేసుకోవడం ఎంతో అవసరం. సంబంధిత కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకొని ఫోను రికవర్ చేసేందుకు ఆయన సోదరుడు నందిగం వెంకట్ నివాసానికి వెళ్తే ఆయన అందుబాటులో లేరు. ఫోను అందజేయాలని నోటీసు ఇచ్చి వచ్చినా ఇప్పటివరకు స్పందించలేదు. పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా తన ఫోను ఇవ్వకుండా దాస్తున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నందున బెయిల్ మంజూరు చేయాలని సురేశ్ కోరుతున్నారు. దీన్ని ధ్రువీకరించేందుకు ఎలాంటి మెడికల్ రికార్డులను కోర్టు ముందు ఉంచలేదు. మాజీ సీఎం జగన్‌కు పిటిషనర్ నమ్మకమైన అనుచరుడు. జగన్‌పై వ్యాఖ్యలు చేసినందుకు టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాంను హతమార్చేందుకు తన సహచరులు, పార్టీ సానుభూతిపరులను రెచ్చగొట్టి దాడికి కుట్ర పన్నారు. సురేశ్‌కు నేరచరిత్ర ఉంది. ఆయనపై మూడు క్రిమినల్ కేసులు ఉన్నాయి. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. నేర ఘటనలో పాల్గొన్న నిందితులను ఇంకా గుర్తించాల్సి ఉంది. నందిగం సురేశ్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు. కేసు దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి' అని దర్యాప్తు అధికారి పిటిషన్‌లో కోరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి కేసులో గుంటూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు ఆదేశించింది.

వెంకటరెడ్డి జైలుకు

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లతో కమీషన్లు వసూలు చేసి.. వైసీపీ పెద్దలకు దోచిపెట్టిన పాపం ఇలా పండిందని గనుల శాఖ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. వెంకటరెడ్డిని ఏసీబీ అధికారులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న వెంకటరెడ్డిని హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలోని బ్యూటీ గ్రీన్ రిసార్ట్స్‌లో అరెస్టు చేసినట్లు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టుకు దర్యాప్తు అధికారులు తెలిపారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఆయనను విజయవాడకు సమీపాన ఉన్న గొల్లపూడిలో ఏసీబీ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుదీర్ఘంగా విచారించి, మధ్యాహ్నం వైద్యపరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ఆయనకు వచ్చేనెల 10వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి హిమబిందు తీర్పు ఇచ్చారు. వెంకటరెడ్డి హృదయ సంబంధ సమస్యలతో బాధపడుతున్నందున వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య పరిస్థితి రీత్యా ఇంటినుంచి ఆహారాన్ని అనుమతించాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. వెంకటరెడ్డిని విచారణ చేసి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను న్యాయాధికారి ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. అనంతరం విజయవాడలోని జిల్లా జైలుకు వెంకటరెడ్డిని తరలించారు. కాగా, వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వెంకటరెడ్డి ఇసుక, ఖనిజం, గనుల దోపిడీని యథేచ్ఛగా సాగించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆయన నిర్వాకాలపై సమగ్ర విచారణ జరపాలని ఏసీబీని కోరుతూ గతనెల 31న ఆదేశాలు ఇచ్చింది. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక రేవులు, గనుల తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి.. జగన్ జమానాలో 2,566కోట్ల సంపద దోపిడీకి గురైనట్లు నిర్ధారణకు వచ్చారు. వెంకటరెడ్డిపై ఈ నెల 11న కేసు నమోదు చేశారు.



వెంకటరెడ్డిని విజయవాడ కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఆయన ఆటను ఏసీబీ ఎట్టకేలకు కట్టించింది. ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్(సీఐయూ)అధికారులు తెలిపిన వివరాల మేరకు.... కడప జిల్లాకు చెందిన వెంకటరెడ్డి కేంద్ర సర్వీసులకు చెందిన స్టాఫ్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి. రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీలో అడుగుపెట్టి ఇసుక, గనులను జగన్ అనుయాయులకు దోచిపెట్టారు. ఇసుక టెండర్లు పాడుకున్న జేపీ వెంచర్స్‌తో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు రూ.800కోట్లు ప్రత్యక్షంగా నష్టంచేకూర్చారు. ప్రైవేటు ఏజెన్సీలు అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించినా పట్టించుకోలేదు. జీసీకేసీ ప్రాజెక్ట్స్‌తో కలిసి నేరపూరిత కుట్రకు పాల్పడ్డారు. ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కుమ్మక్కయ్యారు. మోసపూరితంగా జేపీవీఎల్‌కు బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారు. తన పరిధిలో ఉన్న రూ.120కోట్ల దారి మళ్లింపునకు పాల్పడ్డారు. లీజు సరిహద్దులు దాటి తవ్వకాలు, అనుమతించిన లోతు, పర్యావరణ అనుమతులు అన్నీ ఉల్లంఘించేందుకు సహకరించిన వెంకటరెడ్డి తవ్వకాలకు భారీయంత్రాలను ఉపయోగించిన ప్రైవేటు ఏజెన్సీలకు వత్తాసు పలికారు. వేలకోట్ల సంపద దోపిడీకి సహకరించిన వెంకటరెడ్డి పర్యావరణానికి నష్టం కలిగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించినట్లు ఏసీబీ తెలిపింది.

మిత్రుడి ఫోన్‌పై నిఘాపెట్టి.. వెంకటరెడ్డి ఆచూకీ పట్టి

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి వెంకటరెడ్డి తప్పించుకుని తిరుగుతున్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. భార్యతో కలిసి విదేశాలకు పారిపోయినట్టు ఒక దశలో వెంకటరెడ్డి ఏసీబీ దర్యాప్తు అధికారులను మభ్యపెట్టారు. కానీ, నోయిడా- గుర్గావ్ మధ్య ప్రాంతంలో వెంకటరెడ్డి ఉన్నట్టు ఏసీబీ ఇటీవల గుర్తించింది. వెంకటరెడ్డి గతంలో కేంద్ర మెరైన్ విభాగంలో పనిచేశారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌పై జగన్ హయాంలో రాష్ట్రానికి వచ్చారు. ఈ కోణంలో ఏసీబీ అడుగులు వేసింది. గతంలో మెరైన్ విభాగంలో పనిచేసి ప్రస్తుతం ఢిల్లీలో ఉంటున్న వెంకటరెడ్డి స్నేహితుడి ఫోన్‌పై నిఘా పెట్టింది. ఏసీబీ అంచనా వేసినట్టే.. కొద్దిరోజుల క్రితం ఆయనకు వెంకటరెడ్డి ఫోన్ చేశారు. "నాకు హైకోర్టులో బెయిల్ రాలేదు. ఇప్పుడు ఏం చేయాలి" అని ఆయన సలహాను వెంకటరెడ్డి కోరారు. వారి సంభాషణను విన్న ఏసీబీ.. వెంకటరెడ్డిని పట్టుకునేందుకు పక్కాగా వ్యూహం రచించింది. ఏ క్షణమైనా అరెస్టు చేస్తామనే సంకేతం వెంకటరెడ్డికి అందేలా చేసింది. దీంతో వెంకటరెడ్డి దిగివచ్చారు. 'ఢిల్లీకి రావద్దు. నేను హైదరాబాద్‌కు వస్తాను. అక్కడ అరెస్టు చేయండి' అని ఏసీబీ అధికారులను అభ్యర్థించారు. అన్నట్టుగానే..గురువారం రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లిలోని బ్యూటీ గ్రీన్ రిసార్ట్స్‌కు ఆయన రాగా, ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.



సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీజెన్కో, ఎన్‌హెచ్‌పీసీ సంస్థల ప్రతినిధులు

రాష్ట్రంలో కొత్తగా ఆరు పీఎస్‌పీలు

- జీఎన్‌హెచ్‌పీసీతో ఏపీ జెన్కో జాయింట్ వెంచర్

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఆరు పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలను నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ)తో సంయుక్తంగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ ఒప్పందం చేసుకుంది. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌హెచ్‌పీసీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ చౌదరి, ఫైనాన్సియల్ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ గోయల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రజత్ గుప్త, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ జెన్కో ఎండీ చక్రధరబాబు మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా యాగంటిలో 1,000 మెగావాట్లు, అరవేటిపల్లిలో 1,320 మెగావాట్లు, గడికోటలో 1,200 మెగావాట్లు, దీనెపల్లిలో 750 మెగావాట్లు, రాజుపాలెంలో 800 మెగావాట్లు.. మొత్తంగా 5,070 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రాలను జెన్కో నిర్మించనుంది.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి)

సెక్షన్ 7 ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాలకు గత ప్రభుత్వం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల హోదా కల్పించింది. పేదలకు ఇళ్ల స్థలాల పథకం కింద వారికిచ్చే సెంటు భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. కానీ, ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలపై జగన్ బొమ్మ ఉండడంతో పేదలకిచ్చిన ఆ పత్రాలు చెల్లుబాటు కాకుండా పోయాయి. దానికితోడు పంచాయతీ సెక్రటరీలపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి. ఫలితంగా చాలాచోట్ల సరైన భూములు కూడా వివాదాస్పదమయ్యాయి. దీనిపై వైసీపీ హయాంలోనే అనేక ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ గత ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. పైగా పంచాయతీ సెక్రటరీలకు సబ్‌రిజిస్ట్రార్ల శిక్షణ ఇచ్చి, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హోదా కల్పించింది. తాము ఇప్పటికే పంచాయతీ పనులతోనే ఊపిరి సలపకుండా ఉన్నామని, కొత్తగా భారం పెంచవద్దు అని వారు గోడు వెళ్లబోసుకున్నా జగన్ ప్రభుత్వం లెక్కచేయలేదు. ఈ విధానం వల్ల అనవసర వివాదాలు తలెత్తుతుండడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఆగస్టులోనే నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నాడు వద్దు.. నేడు ముద్దు

(మొదటి పేజీ తరువాయి)

కీలక పోస్టులు కట్టబెట్టారు. దీంతో బదిలీల్లో ఏం జరిగిందన్న చర్చకు దారితీస్తోంది.

నాడు ఏం జరిగిందంటే...

జగన్ ప్రభుత్వంలో ఆర్డీఓల బదిలీలు రాజకీయ సిఫారసుల మేరకు సాగాయి. నాటి సీఎంవోకు అస్మదీయులు, సిఫారసులున్న వారిని ఏరికోరి ఆర్డీఓలు, డీఆర్‌ఓలుగా నియమించేవారు. తిరుపతి, విశాఖ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, చిత్తూరు, పలమనేరు, మదనపల్లె, కర్నూలు, కడప తదితర డివిజన్లలో జగన్ సామాజికవర్గం వారినే ఆర్డీఓలుగా నియమించారు. మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్ ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న సమయంలో గ్రూప్-1 నియామకాలు జరిగాయి. పరీక్షలు అడ్డగోలుగా నిర్వహించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఇదే అంశంపై నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ పెద్దపోరాటాలు చేసింది. గ్రూప్-1 నియామకాలను రద్దు చేయాలంటూ రాస్తారోకోలు చేశారు. జగన్, మరికొందరు గ్రూప్-1 పోస్టులను అనర్హులకు అమ్ముకున్నారని, పేపర్ లీకుచేసి అక్రమాలకు పాల్పడ్డార ని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ నేతలు ఆరోపణలు చేశారు. 2022 బ్యాచ్‌లో నియమితులైన వారిని ఆర్డీఓలు, డీఆర్‌ఓలుగా నియమించవద్దని ఎన్నికల సమయంలో డిమాండ్ చేశారు. ఆర్డీఓలుగా ఉన్న వారిని తప్పించాలని టీడీపీ ఉద్యమాలు చేసింది. వారిని ఎన్నికల విధులకు పూర్తి దూరంగా ఉంచాలని ఈసీని ఆ పార్టీ నేతలు కోరారు.

నేడు జరిగింది ఇదీ...

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పుడు 57 మంది ఆర్డీఓలను బదిలీ చేసింది. అందులో 2022 బ్యాచ్‌కు చెందిన 24మందికి అత్యంత కీలకమైన డివిజన్లలో పోస్టింగ్ ఇచ్చింది. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురికి అతిముఖ్యమైన డివిజన్లు కట్టబెట్టింది. 2024 బ్యాచ్‌కు చెందిన 13మందికి కూడా కీలక డివిజన్లకు ఆర్డీఓలుగా నియమించింది. అక్టోబరు 4తో వారి శిక్షణ పూర్తి కానుంది. అయినా వారికి ముందుగానే ఆర్డీఓ పోస్టులు కట్టబెట్టడం రెవెన్యూలో చర్చనీయాంశంగా మారింది. హెచ్‌ఆర్‌డీలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రెవెన్యూలో పనినేర్చుకోవడానికి అవకాశం ఉన్న పోస్టులు ఇస్తారు. కానీ, వీరికి శిక్షణ పూర్తికాకముందే ఆర్డీఓలుగా అవకాశం ఇచ్చారు. 10/1999 బ్యాచ్‌లోని కొందరు అధికారులపై తీవ్ర ఆరోపణలున్నాయి. వారిని రెవెన్యూ నుంచి వెనక్కి పంపించాలని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు ఇచ్చింది. జగన్ ప్రభుత్వం ఆ పని చేయకపోగా వారికి కీలక పోస్టులు కట్టబెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ అదే చేశారు. ఆర్డీఓల నియామకంలో గతానికి కన్నా మెరుగైన విధానం ఉంటుందని డిప్యూటీ కలెక్టర్లకు ఆశలు కల్పించింది. అసలు అవకాశమే రానివారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అవినీతి, అక్రమాల మచ్చలు లేనివారు, విధి నిర్వహణలో రాజీపడకుండా పనిచేసే వారికి, నిజాయితీపరులకు పెద్దపీట వేస్తామని, అందుకే ఆర్డీఓ పోస్టింగ్‌ల్లో జాప్యం అవుతోందని అధికార వర్గాలు పలు సందర్భాల్లో చెప్పాయి. దీంతో ఈసారి పోస్టింగ్‌లపై చాలా ఆశలు పెట్టుకున్నారు. తీరా పోస్టింగ్ ఉత్తర్వులు పరిశీలించాక వారి ఆశలు గల్లంతయ్యాయి. ఆర్డీఓలుగా డైరెక్ట్ రిక్రూటీలకు అవకాశం కల్పించాల్సిందే. గత ప్రభుత్వంలో వారికి సరైన అవకాశాలు దక్కలేదు. దీన్ని సరిదిద్దే పేరిట మొత్తం పోస్టులు వారికే ఇస్తే ఎలా అన్న ఆందోళన వినగతా వారి నుంచి వ్యక్తమవుతోంది. 77 డివిజన్లలో ఇప్పుడు 57డివిజన్లకు కొత్త ఆర్డీఓలను నియమించారు. ఇందులో 42మంది డైరెక్ట్ రిక్రూటీలు ఉన్నారు. మిగిలిన పోస్టుల్లోనూ డైరెక్ట్ రిక్రూటీలకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది. అలాగే ప్రమోటీ అధికారులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఈ 35పోస్టులకు ఇరువురి మధ్య తీవ్ర పోటీ తీసుకొచ్చినట్లు అవుతుందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

టి.మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు!

- కుమారుడు హర్షరెడ్డికి చెందిన 'రాఘవ గ్రూప్' ఆఫీసుల్లోనూ తనిఖీలు
- హర్షరెడ్డి లగ్జరీ వాచీలపై కస్టమ్స్ కేసు
- 7 కోట్ల విలువైన 7 వాచీలు! పలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు స్వాధీనం!



హైదరాబాద్/నార్సింగ్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాష్ట్ర పోలీసులకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా ఢిల్లీ నుంచి వచ్చిన 15 బృందాలు.. జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి నివాసంతోపాటు కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు జరిపాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సంబంధించిన రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. హర్షరెడ్డి ఆడిటర్ నుంచి అధికారులు వివరాలు సేకరించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్‌లో కూడా సోదాలు నిర్వహించారు. సైబరాబాద్ పోలీసులు ఫాంహౌస్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియాను, ఇతరులను ఆ దరిదాపుల్లోకి రానివ్వలేదు.

ఈ సోదాలు ఎందుకంటే..

హాంకాంగ్‌లో నివాసం ఉండే మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్ గత ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి చెన్నైకి వచ్చాడు. అతని వద్ద కస్టమ్స్ అధికారులు విదేశాలకు చెందిన పాటెక్ ఫిలిపె 5740, బ్రెగుయెట్ 2759 బ్రాండ్స్‌కు చెందిన రెండు విలాసవంతమైన గడియారాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ చేతి గడియారాల విలువ రూ.1.73 కోట్లుగా నిర్ధారించారు. మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్‌ను కస్టమ్స్ అధికారులు విచారించగా మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరు వెల్లడించాడు. ఈ క్రమంలో నవీన్‌కుమార్ ద్వారా పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సుమారు రూ.7 కోట్లు విలువ చేసే ఏడు లగ్జరీ వాచీలు చేరినట్లు ప్రాథమికంగా గుర్తించారు. వాటికి క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో మనీ లాండరింగ్ జరిగినట్లు కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. విచారణలో భాగంగా మార్చి 28న చెన్నై కస్టమ్స్ అధికారులు హర్షరెడ్డికి నోటీసులు జారీ చేశారు. మనీలాండరింగ్ వ్యవహారం కావడంతో డీఆర్ఐ అధికారులు ఈడీకి సమాచారం ఇచ్చారు. కస్టమ్స్, డీఆర్ఐ నమోదు చేసిన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ జరుపుతోంది. తాజా సోదాల్లో పలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న రికార్డులను పరిశీలించిన తర్వాత ఈడీ అధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

శుక్రవారం తెల్లవారుజాము నుంచి మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు చేపట్టాయి. అయినప్పటికీ మంత్రి, తన రోజువారీ కార్యక్రమాల్లో సాధారణంగా పాల్గొన్నారు. ఈడీ సోదాల సమయంలో పలువురు రాజకీయ ప్రముఖులు మంత్రి నివాసానికి చేరుకున్నారు.

పంచాయతీలకు నిధుల కొరత లేదు

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలకు నిధుల కొరత లేకుండా చేశాం. ప్రతి గ్రామంలో అభివృద్ధి పండుగ చేసుకోవాలి. పనులు సత్వరమే ప్రారంభించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం రాత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామ సభలో ఆమోదించిన పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల ప్రారంభం గురించి చర్చించారు. 'పాలన మొదలైన తొలి వంద రోజుల్లోనే 15వ ఆర్థికసంఘం నుంచి రూ.1,987 కోట్లు, ఉపాధి పథకం ద్వారా రూ.4,500 కోట్లు నిధులు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించింది. ఇక నిధుల సమస్య ఉత్పన్నం కాదు. 13,326 పంచాయతీల్లోనూ ఉపాధి హామీ పనులకు తీర్మానాలు చేశారు. అక్టోబరు 14నుంచి వారం రోజులపాటు పనుల ప్రారంభాన్ని ఒక పండుగలా చేయాలి. శాసనసభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్సీలను భాగస్వాములను చేయాలి' అని పవన్ అన్నారు. ఈ సందర్భంగా వెబ్‌సైట్, డ్యాష్ బోర్డును ప్రారంభించారు.

కోతల్లేని శవ పరీక్ష రావాలి

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 27: అవసరం లేని కేసుల్లో కోతల్లేకుండా సీటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ స్కాన్ ద్వారా శవ పరీక్ష నిర్వహిస్తే.. పోలీస్ శాఖకు ఎంతో మేలు జరుగుతుందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో జరుగుతున్న సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (సిమ్లా)-2024 సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐజీ మాట్లాడుతూ.. పాశ్చాత్య దేశాల్లో కోత లేకుండా చేసే వర్చువల్ ఆటాప్సీ అనే కొత్త రకం శవ పరీక్ష వల్ల.. అవసరం లేని కేసుల్లో సీటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ స్కాన్ ద్వారా శవపరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. మన దేశంలో కూడా ఈ విధానాన్ని తీసుకొస్తే చాలామంది మృతుల కుటుంబసభ్యులకు హృదయవేదన తగ్గుతుందన్నారు. ఫోరెన్సిక్ విభాగ సేవలు పోలీస్ శాఖకు ఎంఎల్‌సీ కేసుల్లో ఎంతగానో దోహదపడతాయన్నారు. మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ వైద్యనిపుణులు.. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్ డాక్టర్లకు శిక్షణనిస్తే వారు కూడా శవపరీక్ష చేసేందుకు వీలు కలుగుతుందన్నారు.





సీఎం చంద్రబాబుకు రూ.2కోట్ల చెక్కు అందజేస్తున్న ఐటీసీ గ్రూప్ ఎండీ సంజీవ్ పూరి, రూ.2కోట్ల చెక్కు అందజేస్తున్న ఎల్జీ పాలిమర్స్ ప్రతినిధి కె.రాణా



రిలయన్స్ ఫౌండేషన్ తరఫున టీ.సీఎం రేవంత్‌రెడ్డికి రూ.20 కోట్ల చెక్కు అందజేస్తున్న సంస్థ ఈడీ పీఎంఎస్ ప్రసాద్, మెంటార్ పీవీఎల్ మాధవరావు

సీఎంఆర్ఎఫ్‌కు రిలయన్స్ ఫౌండేషన్ 20 కోట్లు

- 2 కోట్లు చొప్పున ఇచ్చిన ఐటీసీ, ఎల్జీ పాలిమర్స్
- సీఎం చంద్రబాబుకు చెక్కుల అందజేత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వరదలతో తీవ్రంగా నష్టపోయి, కష్టాల్లో ఉన్న బాధితులను ఆదుకునేందుకు అనేకమంది దాతలు ముందుకొస్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పలువురు దాతలు విరాళాల చెక్కులు, డీడీలు అందజేశారు. నీతా అంబానీ, రిలయన్స్ ఫౌండేషన్ తరపున రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డు మెంబర్ ఎంపీఎస్ ప్రసాద్, ఆ సంస్థ ఏపీ, తెలంగాణ మెంటార్ పీవీఎల్ మాధవరావు రూ.20కోట్లు చెక్కు అందజేశారు. ఐటీసీ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రూ.2 కోట్లు, ఎల్జీ పాలిమర్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి కే రాణా రూ.2 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల తరపున సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు రూ.కోటి, సాగర్ గ్రంధి ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై ఎండీ గ్రంధి చెల్లారావ్ రూ.కోటి, ఆర్కియస్ ఫౌండేషన్(ఆర్కియస్ కెమికల్ ఇండస్ట్రీస్) నిర్వాహకులు పెందుర్తి ప్రమీల, ఆమె తనయుడు పెందుర్తి రంజిత్ రూ.కోటి, ఉంగుటూరు నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తల తరఫున ఎమ్మెల్యే పీ ధర్మరాజు రూ.84.83 లక్షలు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావులు రూ.71.50 లక్షలు, శ్రీవిద్యానికేతన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరఫున ప్రముఖ సినీనటులు మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు రూ.25లక్షల చెక్కు ఇచ్చారు. ఎం రాంప్రసాద్ రూ.8 లక్షలు, వీ వెంకటేశ్వరరావు రూ.8 లక్షలు, బాపట్ల మండల సమాఖ్య రూ.6.20 లక్షలు, మహాప్రస్థాన్ సేవా సమితి రూ.6.10 లక్షలు, శ్రీకాకుళం డీసీసీబీ నుంచి ఎన్ శ్రీనివాసరావు రూ.5 లక్షలు, ఇందూ కన్‌స్ట్రక్షన్స్ రూ.5 లక్షలు, లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రూ.4 లక్షలు, పిట్టలవానిపాలెం మండల సమాఖ్య రూ.2.92 లక్షలు, జీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ.2.50 లక్షలు, రవిగోపాలకృష్ణ రూ.2.30 లక్షలు, మైనేని మాధవిచౌదరి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ రూ.2 లక్షలు, పీ అరుణ్‌కుమార్ రూ.2 లక్షలు, కృష్ణారావు మైనేని రూ.2 లక్షలు, జీ బసంత్ రూ.2 లక్షలు, టీ నవీన్ రూ.2 లక్షలు అందించారు. కాగా, విజయవాడకు చెందిన బాలుడు కోడె శ్రీకరణ్ నాలుగేళ్లుగా కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.10 వేలును సీఎంకు అందజేశారు. దాతలకు సీఎం అభినందనలు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న సాగర్ గ్రంధి ఎక్స్‌పోర్ట్స్ ఎండీ గ్రంధి చెల్లారావు



జీఎస్ఎల్ సంస్థల తరఫున రూ.కోటి చెక్కు చంద్రబాబుకు అందజేస్తున్న ఆ సంస్థల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు

మంత్రి లోకేశ్‌కు అందించిన విరాళాలు

వరద బాధితుల కోసం పలువురు దాతలు తమ విరాళాలను మంత్రి లోకేశ్‌కు అందజేశారు. విజయనగరానికి చెందిన లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వైస్‌చైర్మన్ పీ శ్రీనివాసరావు రూ.5 లక్షలు, గుంటూరుకు చెందిన తరుణి అసోసియేట్స్ ప్రతినిధులు రూ.5 లక్షలు, మంగళగిరికి చెందిన శిందే లక్ష్మయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు రూ.2 లక్షలు, గుంటూరుకు చెందిన అవినాష్ ఏజెన్సీస్ యాజమాన్యం రూ.2 లక్షలు, గన్నవరానికి చెందిన ఎంకే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ నిర్వాహకులు రూ.లక్ష, ఆదోనికి చెందిన జీ కృష్ణమ్మ రూ.లక్ష, గుంటూరుకు చెందిన వడ్లమూడి సోమయ్య రూ.60,635, పెదవడ్లపూడి లూథరన్ చర్చి నిర్వాహకులు రూ.30 వేలు, కుప్పానికి చెందిన శివకార్తీక్, మురగన్ రూ.20 వేలు అందజేశారు.

'కుంకీ'లు వచ్చేస్తున్నాయ్!

- దసరా తర్వాత ఏపీకి 4 కుంకీ ఏనుగులు
- ఏపీ-కర్ణాటక మధ్య కుదిరిన ఒప్పందం
- వీటి రాకతో ఏనుగుల సమస్యకు పరిష్కారం
- ఎంవోయూ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్



కుంకీ ఏనుగుల బదిలీపై కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి ఖండ్రే, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో కొన్నేళ్లుగా వేధిస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. పంటపొలాలను ధ్వంసం చేయడమే కాకుండా గ్రామాల్లోకొచ్చి విధ్వం సం సృష్టిస్తున్న మదపుటేనుగుల ఆట కట్టించే కుంకీ ఏనుగులను పంపే విషయంలో ఆంధ్రప్రదేశ్-కర్ణాటక మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. అలాగే అడవుల పరిరక్షణ, వన్య ప్రాణుల సంరక్షణ, గిరిజనులకు శిక్షణ, సమాచార మార్పిడి, ఏనుగుల సమస్యపై అధ్యయనం, ఎకో టూరిజం వంటి కీలక అంశాలపైనా ఇరు రాష్ట్రాలు ఎంవోయూ చేసుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా దసరా తర్వాత 4 కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం ఏపీకి పంపనుంది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే సమక్షంలో అధికారులు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... "కర్ణాటక ప్రభుత్వం అడవుల పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. అడవుల్లో ఒక చెట్టు కూలినా శాటిలైట్ ద్వారా కనుగొనే పరిజ్ఞానం వారి వద్ద ఉంది. ఈ సాంకేతికతను ఏపీకి కూడా తీసుకొస్తున్నాం. చిత్తూరుతో పాటు మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల సమస్య అధికంగా ఉంది. మదపుటేనుగులు గ్రామాలపై పడకుండా అడ్డుకునేందుకు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు పనికొస్తాయి. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకి వివరించగా.. ఆయన సూచన మేరకు కర్ణాటక ప్రభుత్వంతో చర్చించాం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే దృష్టికి తీసుకెళ్లాం. వారు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించేందుకు అంగీకరించారు' అని చెప్పారు. మైసూర్‌లో జరిగే దసరా ఉత్సవాల్లో కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషిస్తాయని, అందువల్ల దసరా తర్వాతే వాటిని ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించిందని వివరించారు. ఎర్రచందనం, శ్రీగంధం స్మగ్లింగ్‌ను అడ్డుకోవడంపైనా ఇరు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. స్మగ్లర్లు అక్రమ రవాణాకు సరిహద్దుల్ని వాడుకుంటున్నారని, అందుకే జాయింట్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి స్మగ్లింగ్‌ను అడ్డుకుంటామని పేర్కొన్నారు. కర్ణాటకలో ఏకో టూరిజం ద్వారా అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్నారని, సీఎం చంద్రబాబు సూచన మేరకు ఏకో టూరిజం పనితీరుని పరిశీలించి మన రాష్ట్రంలోనూ దాన్ని అమలు చేస్తామని చెప్పారు. కాగా, ఏపీ, కర్ణాటక మధ్య కుదిరిన కీలక ఒప్పందంలో ఆరు ప్రధానాంశాలపై దృష్టి సారించనున్నామని కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే చెప్పారు. 'ఈ ఒప్పందంలో ఆరు ప్రధానాంశాల పట్ల దృష్టి సారించనున్నాం. సమాచార మార్పిడి, వన్యప్రాణులు సంరక్షణ, ఏనుగుల సమస్యకు పరిష్కారం, గిరిజనుల జీవన శైలి మెరుగుపర్చేలా శిక్షణ వంటి కీలకాంశాలు ఇందులో ఉంటాయి. కుంకీ ఏనుగులతో మదపుటేనుగుల సమస్యను కర్ణాటక పరిష్కరించుకోగలిగింది. ఏపీకి కూడా కుంకీలను అందించి సమస్య పరిష్కరించే ఏర్పాటు చేస్తాం' అని ఖండ్రే తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



సింపుల్ సిగ్నలింగ్

- నగరంలోని 25 కూడళ్లలో అత్యాధునిక ఏటీసీఎస్
- ట్రాఫిక్‌ను బట్టి ఆటోమేటిక్‌గా పనిచేసే వ్యవస్థ
- కీలక ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులు
- దసరా నాటికి ప్రారంభించే యోచనలో అధికారులు
- కేంద్రం ఇచ్చిన రూ.5 కోట్లతో పనులు ప్రారంభం

నగరంలో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు సరికొత్త సిగ్నలింగ్ వ్యవస్థ రానుంది. ప్రస్తుతమున్న సిగ్నలింగ్ వ్యవస్థకు స్వస్తిచెప్పి ఈ అధునాతన ఏటీసీఎస్ వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం 25 కూడళ్లలో సర్వే చేసినప్పటికీ తొలి విడతలో 12 సెంటర్లలో మాత్రమే ఈ ఆటోమేటిక్ సిగ్నలింగ్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : హైదరాబాద్ నగరంలో ఉన్న హెచ్‌ట్రిమ్స్ (హైదరాబాద్ ట్రాఫిక్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టం) మాదిరిగానే విజయవాడలో ఏటీసీఎస్ (అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం)ను ఏర్పాటు చేయాలని పోలీసు కమిషనరేట్, వీఎంసీ అధికారులు నిర్ణయించారు. 10 లక్షల జనాభా దాటిన నగరాల్లో గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్రం నిధులను విడుదల చేసింది. ఇలా వచ్చిన రూ.5 కోట్లతో ట్రాఫిక్ వ్యవస్థకు కొత్త వెలుగులు తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏటీసీఎస్‌ను దసరా శరన్నవరాత్రుల ప్రారంభం రోజు నాటికి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. నగరంలో 25 కూడళ్లలో ఇప్పటికే వీటి పనులు జరుగుతున్నాయి.

మొదటి విడత 10-12 కూడళ్లలో..

నగరంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. ఇందులో కొన్ని పనిచేస్తున్నాయి. ఇంకొన్ని కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉంది. అస్తవ్యస్తంగా ఉన్న ఈ వ్యవస్థ స్థానంలో సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటికే పోలీసులు, సాంకేతిక నిపుణులు, వీఎంసీ అధికారులు కలిసి నగరం మొత్తం పర్యటించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న జంక్షన్లలో సర్వే చేశారు. మొత్తం మూడు దశల్లో ఏటీసీఎస్ పనులను పూర్తి చేయాలని నిర్ణయించారు. మొదటి దశలోనే 25 జంక్షన్లలో ఏర్పాటు చేయాలని యోచించారు. ఇన్ని జంక్షన్ల పనులు మొదటి దశలో పూర్తికావడం కష్టమనుకున్నారు. తొలి విడతగా రూ.5 కోట్లు విడుదల చేశారు. అయితే, నిధులు సరిపోయే పరిస్థితి లేకపోవడంతో 10-12 కూడళ్లలో మాత్రమే పనులు చేయడం సాధ్యమవుతుందని భావించారు. సర్వే నిర్వహించిన 25 కూడళ్లతో పాటు బెంజిసర్కిల్‌లో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లను మార్పు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

ఎలా పనిచేస్తాయంటే..

ఈ కొత్త సిగ్నల్స్ ఆటోమెటిక్‌గా వాటికవే పనిచేస్తాయి. వాహనాల రద్దీని బట్టి సమయాన్ని మార్చుకుంటాయి. వీఐపీలు, వీవీఐపీల కాన్వాయ్‌లు వెళ్లినప్పుడు పోలీసులతో సంబంధం లేకుండా ఏటీసీఎస్.. ట్రాఫిక్‌ను ఆపుతుంది. బెంజిసర్కిల్‌లో ఏటీసీఎస్ ఏర్పాటుచేస్తే ఇక్కడ ప్రస్తుతం ఉన్న సిగ్నల్ లైట్లను మరో జంక్షన్‌లోకి మార్చే యోచనలో అధికారులు ఉన్నారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేయబోయే ఏటీసీఎస్ సిగ్నల్స్ వద్ద సీసీ కెమెరాలు గానీ, థర్మల్ పరికరాన్ని గానీ అమర్చే అవకాశాలు ఉన్నాయి. వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడంతో ఆయా కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ స్థితిగతులను తెలుసుకునే అవకాశం ఉంటుంది. థర్మల్ పరికరం ఏర్పాటు చేస్తే శాటిలైట్ ద్వారా థర్మల్ చిత్రాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరతాయి. వీఎంసీ, పోలీసులు మాత్రం సీసీ కెమెరాల ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నారని సమాచారం. కొత్తగా ఏర్పాటు చేయబోయే సిగ్నల్ లైట్లు క్రమంగా నగరానికి చేరుకుంటున్నాయి. వచ్చేనెల మూడో తేదీ నుంచి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అప్పటికి ఏటీసీఎస్‌ను ప్రారంభించడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఏటీసీఎస్ ఏర్పాటుచేసే జంక్షన్లివే..

బెంజిసర్కిల్, నిర్మల కాన్వెంట్, రమేశ్ ఆసుపత్రి, మహానాడు, రామవరప్పాడు, పోలీసు కంట్రోల్ రూమ్, అక్కడి వై జంక్షన్, డీసీపీ బంగ్లా, రాఘవయ్య పార్కు, రామలింగేశ్వరనగర్ కట్ట, ఆంజనేయస్వామి ఆలయం, ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు, గొల్లపూడి వన్ సెంటర్, గొల్లపూడి వై జంక్షన్, సితార, చిట్టినగర్, పుష్ప హోటల్, స్వర్ణప్యాలెస్, దీప్తి సెంటర్, విద్యాధరపురం, పైపులరోడ్డు, సిద్ధార్థ ఆడిటోరియం జంక్షన్లు ఈ జాబితాలో ఉన్నాయి.

శ్రీశైలానికి భారీగా వరద

- 885 అడుగులకు గాను 878కి చేరిన నీటి మట్టం



శ్రీశైలం, సెప్టెంబరు 27: శ్రీశైలం జలాశయం లో శుక్రవారం వరద ప్రవా హం భారీగా నమోదయిం ది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 1,38,121 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 446... మొత్తం 1,42,567 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,26,939 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమ ట్టం 878.00 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 177.9670 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 4,471 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,904 క్యూసెక్కులు నీటి తో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

ఏపీ నిట్‌లో పోస్టుల భర్తీకి చర్యలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 27 : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో అధ్యాపక పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 127 పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అధ్యాపకేతర రంగంలో మరో 140 పోస్టులు భర్తీ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పోస్టులను మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ నిట్ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేస్తే బోధన రంగంలో కొరత తీరనుంది. అంతేకాక పోస్టుల భర్తీతో నిట్‌లో అడ్మిషన్‌లు పెరగనున్నాయి. సిబ్బంది లేకపోవడం వల్లే నిట్‌లో సీట్ల సంఖ్యను కుదించారు. ప్రతిఏటా 750 సీట్లను భర్తీ చేసేవారు. ఇప్పుడు 480 సీట్లకు అడ్మిషన్‌లు కల్పిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి యథావిధిగా 750 సీట్లు భర్తీ చేసేందుకు ఇప్పుడు కసరత్తు జరుగుతోంది.

ఇంటర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు కేంద్రీకృత ప్రోగ్రెస్ కార్డుల విధానాన్ని అమలు చేయాలని ఇంటర్ విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటివరకూ జిల్లా స్థాయిల్లో ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చేవారు. చాలా జిల్లాల్లో ఇది అమలు కావట్లేదు. ఇకపై ప్రోగ్రెస్ కార్డుల జారీని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృత విధానాన్ని అమలుచేయాలని ఆదేశిస్తూ ఆ శాఖ కమిషనర్ కృతికా శుక్లా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రీఫైనల్ పరీక్షలు ముగిసిన వెంటనే కార్డులు ఇవ్వాలని, తల్లిదండ్రుల సమావేశాల్లోనూ వాటిని ప్రస్తావించాలని స్పష్టంచేశారు. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు వేర్వేరు రంగుల్లో కార్డులు ఉండాలన్నారు. విద్యార్థులందరినీ కాలేజీలకు రప్పించడమే తమ లక్ష్యమని అధికార వర్గాలు తెలిపాయి.

వరద నష్టంపై రీ ఎన్యూమరేషన్ చేయాలి

ఐఎఫ్‌టీయూ రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 27: వరద నష్టంపై ఎన్యూమరేషన్ తప్పులతడకగా చేశారని, రీ ఎన్యూమరేషన్ చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేసింది. సమాఖ్య రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో రౌండ్ టేబుల్ సమా వేశాన్ని నిర్వహించారు. వరదల్లో మునిగిపోయిన ప్రతీ ఇంటికి రూ.50 వేలు, ఆటోకు రూ.25 వేలు పరిహారం అందించాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కుటుంబానికి రూ.25 వేలు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న కుటుంబానికి రూ.10 వేలు పరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. దాన్ని ప్రభుత్వ విధానంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఎన్యూమరేషన్ జరిగిన తీరుపై పలు అనుమానాలున్నాయని, అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వమే యంత్రాంగానికి మార్గదర్శకత్వం చేసి రీ ఎన్యూమరేషన్ చేయించాలన్నారు. వరదసాయం అందించడంలో జరిగిన అవకతవకలకు నిరసనగా ఈనెల 29న ఉదయం 10 గంటలకు ధర్నాచౌక్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, ఏఐసీటీయూ నేత ఎస్‌డీ సలీం, పీఎంటీయూ నేత పరమేశ్వరరావు, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు డి.శ్రీనివాసరావు, సీహెచ్ పెద్దిరాజు, ఎ.రవిచంద్ర మాట్లాడారు.

భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లను ఆదుకోండి

ధర్నాచౌక్: బుడమేరు వరదల కారణంగా సర్వం కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ నగర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సెంట్రింగ్ మెటీరియల్స్ వరదల కారణంగా పాడైపోయాయని, ఒక్కొక్క కార్మికుడు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నష్టపోయారని ఆయన తెలిపారు. ఆటో, మినీ గూడ్స్ వెహికల్ డ్రైవర్లను ఫైనాన్స్ కంపెనీలు ఇబ్బందులు పెడుతున్నాయని, అప్పులు చేసి వాహనాలను రిపేర్లు చేయించుకున్నారని, థర్డ్ పార్టీ ఉన్న ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాజీ, ప్రగతిశీల ఆటోకార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్.కనకరావు, శ్రీను, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంబీవీకే భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్

జ్వరాలపై డోర్ టు డోర్ సర్వే



కృష్ణలంకలో ఫీవర్ సర్వేలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు

కృష్ణలంక, సెప్టెంబరు 27: ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించిందని, ఉద్యోగులు డోర్ టు డోర్ సర్వే చేయాలని జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు సూచించారు. కృష్ణలంకలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి శుక్రవారం సర్వేను ఆయన పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా విభాగం, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రాంతాలను క్లస్టర్లుగా విభజించి, డేటాను సేకరిస్తున్నామని, అంటువ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించేందుకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. మలేరియా ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది, యూపీహెచ్ ఏఎన్ఎంలు సమష్టిగా సర్వే చేసేలా ప్రత్యేక చార్ట్ తయారు చేశామన్నారు. అనారోగ్య లక్షణాలుంటే వెంటనే వైద్య, ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. తక్షణ వైద్యం అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్ శరత్, బలరాం సింగ్, పీడీపీ సిబ్బంది పాల్గొన్నారు.

64వ డివిజన్‌ను దత్తత తీసుకున్నా

వరదల్లో నష్టపోయిన డివిజన్‌వాసులను ఆదుకుంటా ● 'రూ.60 లక్షల విలువైన గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్ల పంపిణీ'లో పట్టాభి

పాయకాపురం, సెప్టెంబరు 27: సెంట్రల్ నియోజకవర్గంలోని 64వ డివిజన్‌ను దత్తత తీసుకుంటున్నానని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి శుక్రవారం ప్రకటించారు. "నగరంలో చిట్టచివరన 64వ డివిజన్ ఉంది. అక్కడి ప్రజలు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోవడం నన్ను కలచివేసింది. అందుకే డివిజన్‌ను దత్తత తీసుకున్నా. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా." అని పట్టాభి హామీ ఇచ్చారు. కండ్రికకాలనీలోని లగడపాటి కల్యాణ మండపంలో శుక్రవారం రూ.60 లక్షల విలువైన గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లను 2000 వరద బాధిత కుటుంబాలకు ఆయన అందజేశారు. నాల్‌సాఫ్ట్ కంపెనీ ఛైర్మన్ నల్లూరి శేషయ్య, షైటీ కాంట్రాక్టింగ్ సంస్థ ఛైర్మన్ నరేష్, టీడీపీ ఆస్ట్రేలియా ప్రతినిధులు విజయ్, వెంకట్, రవి సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పట్టాభి తెలిపారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ షేక్ నాగుల్‌మీరా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డివిజన్ అధ్యక్షుడు పరసా అశోక్, కాకు మల్లికార్జునయాదవ్, పలగాని భాగ్యలక్ష్మి, సూరవరపు నాగరాజు, పరుచూరి ప్రసాద్, వట్టే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గ్యాస్ స్టవ్, కుక్కర్లు పంపిణీ చేస్తున్న కొమ్మారెడ్డి పట్టాభి, బొండా ఉమా, నాగుల్‌మీరా



రక్తదానం చేసిన ఆర్పీఎఫ్ సిబ్బంది

రైల్వే ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 27: ఆర్పీఎఫ్ రైజింగ్‌డే సందర్భంగా రైల్వే ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో విజయవాడ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శౌరిబాల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బీ తోకల, అసిస్టెంట్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ మధుసూదనరావు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఎస్.మదన్‌మోహన్ నాయకత్వంలో రెడ్‌క్రాస్ బృందం 26 మంది ఆర్పీఎఫ్ సిబ్బంది నుంచి రక్తాన్ని సేకరించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిటీ హెడ్ ఐ.సత్యనారాయణశర్మ రక్తదాతలకు సావనీర్‌లను అందించారు. రక్తదాతలకు డివిజన్ ఏసీఎంఎస్ ఎం.జయదీప్ ధ్రువీకరణపత్రాలు అందజేశారు.

ట్రాఫిక్ ఏసీపీగా రామచంద్రరావు

బాధ్యతల స్వీకరణ



విజయవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్-1 ఏసీపీగా పి.రామచంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

యువజన సమస్యలపై ఉద్యమిస్తాం: ఏఐవైఎఫ్

వన్‌టౌన్, సెప్టెంబరు 27: "ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువజన సమస్యలపై ఉద్యమిస్తాం." అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు తెలిపారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్ అధ్యక్షతన శిఖామణి సెంటర్‌లోని రాజేశ్వరరావు గ్రంథాలయంలో నిరుద్యోగ సమస్య- యువత ముందున్న సవాళ్లు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలి. షరతులు లేకుండా నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇవ్వాలి. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలి." అని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు టి.చంద్రనాయక్ విప్లవ గీతాలు ఆలపించారు. లంకా గోవిందరాజులు, సింగంశెట్టి మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 27: రైళ్లలో ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులను దొంగిలిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన తంగుడు రామకృష్ణ(27)ను శుక్రవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు విజయవాడ రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీ రత్నంరాజు ఆధ్వర్యంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణ, ఆర్పీఎఫ్ సీఐ ఫతే అలీబేగ్, తమ సిబ్బందితో విజయవాడ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా పూటికవలస గ్రామానికి చెందిన రామకృష్ణ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరగడాన్ని రైల్వే పోలీసులు గమనించారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. వేర్వేరు ఘటనల్లో దొంగిలించిన ల్యాప్‌టాప్, యాపిల్ ఫోన్ మొత్తం రూ.లక్షా 70వేలు విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రామకృష్ణపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతనికి రిమాండ్ విధించింది.



రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేకు వినతిపత్రం ఇస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

రవాణా రంగ సమస్యలు పరిష్కరించండి

కృష్ణలంక, సెప్టెంబరు 27: రవాణా రంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ట్రాన్స్‌పోర్ట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేను లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం కాంతిలాల్ దం డేను కలిసి కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్ సమస్యలను పరిష్కరిం చాలని వారు కోరారు. సమస్యలపై కాంతిలాల్ దండేకు ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ప్రధా న కార్యదర్శి అల్లాడ వీర వెంకటసత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్ బాబు వినతిపత్రం అందజేశారు.

గ్రామాల్లో ఆట మైదానాలు అభివృద్ధి చేయండి

- సీఎం చంద్రబాబుకు కేపీ రావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 27: "రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి ప్రణాళిక అమలు చేయడం శుభ పరిణామం. ఇండోర్ స్టేడియాలకు రూ.100 కోట్లు ఖర్చు చేసే బదులుగా గ్రామాల్లో ఆట మైదానాలను అభివృద్ధి చేయడం ఉత్తమం. కొన్ని జీవోల సవరణ కోసం అధికారులు ఇచ్చిన సమాచారంపై పునరాలోచన చేయండి. క్రీడా వికాస కేంద్రాలు, గ్రామస్థాయి ఆట మైదానాలను నిర్మించడానికి మీ ఆదేశాలను సవరించండి." అని సీఎం నారా చంద్రబాబునాయుడుకు ఏపీవోఏ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు శుక్ర వారం లేఖ రాశారు. ఇప్పటి వరకు 45 ఇండోర్ స్టేడియాలు నిర్మించారని, అందులో కొన్ని లీజుకిచ్చారని, 35 స్టేడియాలను పూర్తి చేయడానికి రూ.23 కోట్లను మంజూరు చేశారని, ప్రతీ అసెంబ్లీకి ఇండోర్ స్టేడియం నిర్మించినా, అది బ్యాడ్మింటన్ క్రీడకు మాత్రమే ఉపయోగపడుతుందని, మిగతా క్రీడ లకు పనికిరాదని కేపీ రావు అభిప్రాయపడ్డారు. పీపీపీ మోడ్‌లో క్రీడలను అభివృద్ధి చేయడానికి రూ.2500 కోట్ల కంటే పెట్టుబడులు అవసరమని, దీని కోసం అంకితభావంతో పనిచేసే కన్సల్టెంట్లు, సలహాదారులను తీసుకోవాలి లేదా నామినేట్ చేసి డెవలపర్లను ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగించా లని కోరారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్

గుణదల, సెప్టెంబరు 27: ఉన్నత విద్యతో యవత ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని గోల్లాస్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గోళ్ల హనుమాన్‌గుప్తా తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 2024 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నగదు పురస్కారాలు అందజేశారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్, ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు 21 మందికి రూ.10 వేల చొప్పున, మొత్తం రూ.2,10,000 నగదు పురస్కారాలు అందించామని హనుమాన్‌గుప్తా తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ యుగంధర్, సిద్ధార్థ మహిళా కళాశాల విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం.కనకారావు, డాక్టర్ ఎం.విజయసారథి, ట్రస్ట్ సభ్యులు జి.విజయశ్రీగుప్తా, మాటూరు సురేష్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న గోల్లాస్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గోళ్ల హనుమాన్ గుప్తా, ట్రస్టీ సభ్యులు



దీన్‌దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హియరింగ్ బడ్స్ పంపిణీ చేస్తున్న అసోం సీఎం డాక్టర్ హిమంత బిస్వశర్మ, రేగుల ఆంజనేయులు

425 వినికిడి పరికరాల పంపిణీ

మొగల్రాజపురం, సెప్టెంబరు 27: పండిట్ దీన్‌దయాళ్ 109వ జయంతిని పురస్కరించుకుని అసోంలోని గౌహతిలో దీన్‌దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 425 డిజిటల్ ప్రోగ్రామింగ్ హియరింగ్ బడ్స్ పరికరాలను పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ ఛైర్మన్ రేగుల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆఫ్ అసోం, కోల్ ఇండియా సౌజన్యంతో అసోం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిస్వశర్మ చేతులమీదుగా పరికరాలను పంపిణీ చేయించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

రేపు 5కే వాకథాన్

లబ్బీపేట, సెప్టెంబరు 27: "వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ఈనెల 29న గుండె ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాక్ ఫర్ హార్ట్, లవ్ యూ ఆంధ్రప్రదేశ్ పేరుతో 5కే వాకథాన్ నిర్వహిస్తున్నాం. ఆదివారం ఉదయం 6గంటలకు శారదా కళాశాల వద్ద ఈ వాకథాన్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా కొనసాగుతుంది." అని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ట్రెజరర్ డాక్టర్ ఎ.పూర్ణానంద్ తెలిపారు. లబ్బీపేటలోని ఓ ఫుడ్‌ప్లాజాలో శుక్రవారం వాక్‌ఫర్ హార్ట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు వాకథాన్‌ను ప్రారంభిస్తారని, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్‌బాబు, విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఛైర్మన్ తట్టి అర్జునరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ విజయవాడ చాప్టర్ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ తొండెపు వెంకట హనుమంతరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ వాకథాన్‌లో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొంటారని, నగర ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో డాక్టర్ జాన్‌సతీష్, జె.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సు చార్జీల్లో 10 శాతం రాయితీ

బస్‌స్టేషన్, సెప్టెంబరు 27: విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరుకు నడుపుతున్న ఆర్టీసీ డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సు చార్జీల్లో ఈనెల 27 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు 10 శాతం తగ్గించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.యేసుదానం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ వరకుకు ఆదివారం వినహా మిగతా రోజుల్లో 10 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ తర్వాత ప్రాంతాలకు ఆదివారం రూ.830, మిగి లిన రోజుల్లో 10 శాతం రాయితీ, హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే బస్సుల్లో శుక్రవారం సాధారణ చార్జీ, మిగతా రోజుల్లో 10 శాతం రాయితీ ఇస్తారని తెలిపారు. బెంగళూరుకు వెళ్లే వెన్నెల స్లీపర్ ఏసీ బస్సుల్లో ఆదివారం మెజిస్టిక్ బస్‌స్టేషన్ వరకు సాధారణ చార్జీ రూ.2,170, మిగతా రోజుల్లో 10 శాతం రాయితీతో రూ.1,970 వసూలు చేస్తారని తెలిపారు. మెజి స్టిక్ బస్‌స్టేషన్ తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఆదివారం సాధారణ చార్జీ రూ.2,210, మిగిలిన రోజుల్లో 10 శాతం రాయితీ ఉంటుం దని తెలిపారు. అమరావతి మల్టీయాక్సిల్ బస్సుల్లో ఆదివారం మెజిస్టిక్ బస్ స్టేషన్ వరకు సాధారణ చార్జీ రూ.1,870, మిగిలిన రోజుల్లో 10 శాతం రాయితీ, మెజిస్టిక్ బస్‌స్టేషన్ నుంచి పై ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఆదివారం సాధారణ చార్జీ రూ.1,930, మిగిలిన రోజుల్లో 10 శాతం రాయి తీతో రూ.1,750 వసూలు చేస్తారని తెలిపారు. బెంగళూరు నుంచి విజయ వాడ వచ్చేడప్పుడు శుక్రవారం సాధారణ చార్జీ, మిగతా రోజుల్లో 10 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు.

తెలుగు భాషపై యూనియన్ బ్యాంక్ ఉద్యోగులకు శిక్షణ

సత్యనారాయణపురం, సెప్టెంబరు 27: హిందీ మాట్లాడే ప్రాంతాలనుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారులకు హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో తెలుగు భాషపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. నగరంలోని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాష గొప్పతనాన్ని హిందీప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు చంద్రదేవ్ కౌడే, జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగులు తెలుగు అనర్గళంగా మాట్లాడేందుకు శిక్షణ ఉపకరిస్తుందన్నారు. శిక్షణను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రకార్యాలయం ముంబై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్, జోనల్ కార్యాలయధికారి సి.వి.ఎస్.భాస్కరరావు, యూనియన్‌బ్యాంక్ ప్రతినిధులు వివేక్, సుధ పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న చంద్రదేవ్ కౌడే, ఎస్.గైబువల్లి

అలరించిన ఆధ్యాత్మిక కీర్తనల ఆలాపన



వన్‌టౌన్, సెప్టెంబరు 27: దుర్గగుడి కళా వేదికపై శుక్రవారం నెల్లూరుకు చెందిన భారతీ సంగీత విద్యాలయం బృందం ఆలపించిన ఆధ్యాత్మిక కీర్తనలు ఆహూతులు అలరించాయి. కర్ణాటక గాత్రంలో దుర్గా ఆపదుద్ధారక స్తోత్రం, జయ జయ దేవి, అంబాస్తవం, మహిషాసుర మర్దిని, భోశంభో తదితర కీర్తనలను గాయనీలు ఆలపించారు.

ఏపీకి మరో సిపెట్ కేంద్రం

» ఇండియా కెమ్-2024 అవగాహన సదస్సులో కేంద్ర కార్యదర్శి నివేదిత



విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు మరో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) కేంద్రం మంజూరు కానున్నదని కేంద్ర కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ శాఖ కార్యదర్శి నివేదిత శుక్లా వర్మ తెలిపారు. ముంబైలో అక్టోబరు 17 నుంచి 19 వరకు జరగనున్న ఇండియా కెమ్-2024 సదస్సుకు ఏపీ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడానికి విశాఖపట్నంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి హాజరైన ఆమె మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపే సిపెట్ కేంద్రం ఇప్పటికే విజయవాడలో ఒకటి ఉందని తెలిపారు. కెమికల్స్, పెట్రో కెమికల్స్ రంగంలో వస్తున్న మార్పులు, అధునాతన టెక్నాలజీ వంటి అంశాలపై సదస్సులో చర్చిస్తారని వెల్లడించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ, ఏపీలో ఫార్మా కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, పెట్రో కెమికల్స్ ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 100 ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో ఒకటి రసాయన పరిశ్రమల కోసం కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల తగ్గింపుతో పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. ఫిక్కీతో కలిసి నిర్వహించిన ఈ సమావేశానికి గంగవరం పోర్టు సీఈఓ, కేంద్ర కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ జాయింట్ సెక్రటరీ దీపాంకర్ ఆరోన్, వైజాగపటం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై మేధోమథనం

» విశాఖలో ఉన్నతస్థాయి కమిటీ తొలి భేటీ



అధికారులతో సమావేశమైన కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కార్మిక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన సహాయక కార్యక్రమాలపై చర్చించేందుకు ఉన్నత స్థాయి కమిటీ శుక్రవారం విశాఖపట్నంలో తొలి సమావేశం నిర్వహించింది. పలు జిల్లాల కలెక్టర్లు, కమిటీ సభ్యులతో నిర్వహించిన ఈ సమావేశంలో వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకుంది. మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కమిటీ సభ్యులు ప్రస్తావించారు. పరిశ్రమల్లో యంత్రాల నిర్వహణపై కార్మికులకు సరైన శిక్షణ ఇవ్వడం లేదని ఎత్తిచూపారు. సిబ్బందికి పనిచేసే ప్రాంతంపై అవగాహన కల్పించడం లేదని, ప్రమాదాలు జరిగితే తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ ఇవ్వడం లేదని పలువురు ప్రస్తావించారు. వీటికి సంబంధించిన నిబంధనలను యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా మీడియాతో మాట్లాడుతూ ఇతర చోట్ల ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు, వాటి ఫలితాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కార్మిక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు హరేందిర్ ప్రసాద్, విజయ కృష్ణన్, చెన్నై, తిరుపతి ఐఐటీల ప్రొఫెసర్లు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శశికృష్ణ మానసిక స్థితి, జైలు ప్రవర్తనపై నివేదికివ్వండి

» అధికారులకు హైకోర్టు ఆదేశం.. విచారణ అక్టోబరు 22కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్య హత్య కేసులో ఉరిశిక్ష పడి, ప్రస్తుతం రాజమండ్రి జైల్లో ఉన్న కుంచాల శశికృష్ణ మానసిక స్థితి, జైల్లో అతని ప్రవర్తన, కుటుంబ నేపథ్యం, నేరచరిత్ర తదితర వివరాలతో రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని గుంటూరు జిల్లా కలెక్టర్, గుంటూరు డీఎస్పీ, జైలు సూపరింటెండెంట్లను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 22కి వాయిదా వేస్తూ జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. 2022 ఏప్రిల్‌లో ఫాస్ట్‌ట్రాక్ ఇచ్చిన తీర్పును శశికృష్ణ హైకోర్టులో అప్పీల్ వేశారు. శశికృష్ణ తరఫు న్యాయవాది అజయ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ మరణశిక్ష విధింపు సమయంలో నిందితుల మానసిక స్థితి, వయసు, కుటుంబ నేపథ్యం, సామాజిక ఆర్థిక పరిస్థితులు, విద్యార్హతలు, జైల్లో వ్యవహారశైలి, పూర్వ నేరచరిత్ర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఈ మార్గదర్శకాలు పాటించలేదన్నారు.



న్యాయవాదుల వెయిటింగ్ హాళ్లను ప్రారంభిస్తున్న సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

హైకోర్టులో న్యాయవాదుల వెయిటింగ్ హాళ్లు ప్రారంభం

» హాజరైన చీఫ్ జస్టిస్ ఠాకూర్, న్యాయమూర్తులు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు అదనపు భవనంలో మహిళ, పురుష న్యాయవాదుల కోసం వెయిటింగ్ హాళ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ హాజరయ్యారు. వెయిటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షునిగా లీలామాధవరావు

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షునిగా దివి లీలా మాధవరావు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం విజయవాడలో నిర్వహించిన ఆలిండియా రేషన్ డీలర్ల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ ఉపాధ్యక్షునిగా రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు లీలా మాధవరావును ఎంపిక చేశారు. డీలర్ల సమస్యలపై జాతీయ కమిటీతో కలిసి పని చేస్తానని మాధవరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి బిశ్వంబర్ బసుకు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్ బంకు యజమానులనూ ఆదుకోండి

» ఏపీ ట్రేడర్స్ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్ తరఫున రూ.13 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవలి వరదలకు 50 పెట్రోల్ బంకులు వరకు మునిగిపోయాయని, వారికి కూడా ఆర్థిక సహాయం చేయాలని సీఎంను కోరామని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారన్నారు. పెట్రోల్ బంకులు మునిగిపోయినవారికి 15 నుంచి 20 లక్షల వరకు వడ్డీ రహిత రుణాలు ఇస్తే కోలుకునే అవకాశం ఉంటుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా కన్నబాబు

» కోనసీమకు విశ్వరూప్

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సంస్థాగత నియామకాల్లో భాగంగా ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ రెండు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా కురసాల కన్నబాబు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా పినిపే విశ్వరూప్ నియమితులయ్యారు. జగ్గయ్యపేట అసెంబ్లీ సమన్వయకర్తగా తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ పశ్చిమకు వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు సమన్వయకర్తగా మల్లాది విష్ణు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా భరత్‌ను నియమించారు.

మంత్రి వర్సెస్ కమిషనర్

» రాజధాని పనుల్లో లోపించిన సమన్వయం
» ఏకాభిప్రాయానికి రాలేక నిర్ణయాలు వాయిదా
» మంత్రి వస్తే వేరే చాంబర్లో కూర్చుంటున్న సీఆర్‌డీఏ కమిషనర్
» ఎదురుపడినా పలకరించుకోని పరిస్థితి
» విసిగిపోయిన నారాయణ
» కమిషనర్ భాస్కర్ బదిలీకి సీఎంకు ఫైలు
» ఇంకా ఆమోదించని ముఖ్యమంత్రి
» భాస్కర్‌ను పంపేయడం తప్పదా?
» చంద్రబాబు ఆలోచనల వేగాన్ని అందుకోలేకపోతున్న యంత్రాంగం





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించాలన్న తపనతో ఓ వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర సమీక్షలు చేస్తుంటే.. పనులు మాత్రం ఆ మేరకు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, సీఆర్‌డీఏ చైర్మన్‌గా ఉన్న మున్సిపల్ మంత్రి పి.నారాయణ మధ్య సమన్వయం లోపించడంతో పలు నిర్ణయాలు వేగవంతంగా జరగడం లేదని చెబుతున్నారు. కమిషనర్ పనితీరు తాను ఆశించినట్లుగా లేదని ఓ వైపు మంత్రి అసంతృప్తిగా ఉంటే.. అమాత్యుడి తీరుతో సీఆర్‌డీఏలో కార్యక్రమాలు సమర్థంగా నెట్టుకురాలేమన్న భావనలో కమిషనర్ ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే మంత్రి సీఆర్‌డీఏ కమిషనర్ కార్యాలయానికి వెళ్లినప్పుడల్లా.. ఆయన తన చాంబర్‌ను మంత్రికి వదిలేసి వేరే పేషీలో కూర్చుంటుండడంతో ఇద్దరికీ పొసగడం లేదన్న ప్రచారం జరుగుతోంది. పలు అంశాలపై వారు పరస్పరం చర్చించుకుని ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవలసి ఉన్నా.. ఆ దిశగా ప్రయత్నాలే జరగడం లేదంటున్నారు. నిర్ణయాలు వాయిదాపడుతున్నాయి. సీఆర్‌డీఏలో జరిగే విషయాలు కొన్ని గోప్యంగా ఉంచాల్సి ఉన్నా.. మంత్రి బయటకు వెల్లడిస్తున్నారని కమిషనర్ వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. ఇటీవల టెండర్ల ప్రక్రియ విషయంలో కూడా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయంటున్నారు. ఇద్దరూ ఎదురుపడినా మాట్లాడుకోని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. విసిగిపోయిన మంత్రి.. కమిషనర్‌ను తప్పించకుంటే పనులు సజావుగా సాగవని సీఎంకు ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. భాస్కర్ బదిలీకి సంబంధించి మంత్రి కార్యాలయం నుంచి ఫైలు కూడా సీఎం వద్దకు వెళ్లిందని, ఆయనింకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. భాస్కర్ బదిలీ తప్పదేమోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

బాబు ఆలోచనకు భిన్నంగా...

రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తేనే ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజధాని ఏర్పాటు చేయగలరన్న నమ్మకంతో అప్పట్లో టీడీపీకి మెజారిటీ సీట్లు ఇచ్చి గెలిపించారు. 30 వేల ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా ల్యాండ్ పూలింగ్ స్కీం కింద ఇచ్చేందుకు ముందుకొచ్చారు. సచివాలయ భవనాలు, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ఐఏఎస్ అధికారులకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. సుమారు రూ.10 వేల కోట్ల మేర నిర్మాణాలు చేపట్టారు. ఈలోపు ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడం చకచక జరిగిపోయాయి. రాజధాని అమరావతిలోనే ఉంటుందని ఎన్నికల ముందు చెప్పిన జగన్.. గద్దెనెక్కాక మూడు రాజధానుల పల్లవి అందుకున్నారు. దీంతో భూములిచ్చిన 29 గ్రామాల ప్రజలు రోడ్డెక్కాల్సి వచ్చింది. 1,500 రోజుల పాటు ఎండనక, వాననక ఉద్యమాలు, దీక్షలు చేశారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగితే గాని తిరిగి అమరావతిని నిర్మించుకోలేమన్న అభిప్రాయం ప్రతి ఒక్కరిలో ఏర్పడింది. మొన్నటి ఎన్నికల్లో రాజధాని నిర్మాణం ఒక ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. టీడీపీతో కూటమి ప్రభుత్వం వస్తేనే మళ్లీ రాజధాని నిర్మాణ పనులు ముందుకు కదులుతాయని ప్రతి ఒక్కరూ భావించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా అమరావతికి మద్దతివ్వడం, కోర్టులు సైతం అమరావతిని ఇక్కడ నుంచి తరలించేందుకు ఒప్పుకోకపోవడం లాంటి అంశాలు అమరావతి రాజధాని కావాలన్న వారిలో ఆశలు రేకెత్తించాయి. అందరూ ఊహించిన విధంగానే తిరుగులేని మెజారిటీ సాధించి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. అమరావతి నిర్మాణ పనులు ఇక వేగవంతమవుతాయన్న ఆశలు పెరిగాయి. బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు కూడా ఆ దిశగా నిర్ణయాలు తీసుకున్నారు. సీఆర్‌డీఏ చట్టానికి సంబంధించి వైసీపీ ప్రభుత్వం చేసిన సవరణలను మార్చడం, భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ యాన్యుటీ చెల్లించడం లాంటివి వీటిలో ఉన్నాయి. అడవులను తలపిస్తున్న రాజధాని ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగించేందుకు పనులు కూడా చేపట్టారు. మూడేళ్ల లోపు రాజధాని నిర్మాణాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి, మున్సిపల్ మంత్రి ప్రకటించారు. అయితే మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేయాలంటే అధికార యంత్రాంగాన్ని పరుగెత్తించాల్సి ఉంది. అయితే ఇటీవల కాలంలో సీఆర్‌డీఏ వ్యవహారం చూస్తుంటే ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉందని పేర్కొంటున్నారు. ఇదే రీతిన సాగితే పనులు సకాలంలో పూర్తవుతాయో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరూ పనిమంతులే..!

నిరంతర సమీక్షలతో పాటు చురుకైన అధికారులను, సిబ్బందిని నియమించుకుని పనులు వేగవంతం చేయాల్సిన మంత్రి, సీఆర్‌డీఏ కమిషనర్ మధ్య విభేదాలు పెరగడంతో అడుగులు ముందుకు సాగడం లేదని చెబుతున్నారు. మంత్రి నారాయణకు పని రాక్షసుడని పేరుంది. నిత్యం పనులపైనే ఆయన ధ్యాస. భాస్కర్ కూడా సిబ్బందిని అప్రమత్తం చేసి పనులు చేయించడంతో చేయితిరిగిన వ్యక్తే. ఈ ఇద్దరి సారథ్యంలో పనులు చకచకా సాగుతాయని చంద్రబాబు భావించారు. అయితే వారిద్దరి నడుమ విభేదాలతో ప్రతిష్ఠాత్మకమైన రాజధాని పనులకు ఆటంకాలు ఏర్పడతాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

ఆర్టీఐ ఆఫీసులో రచ్చ

» చీఫ్ కమిషనర్ వర్సెస్ కమిషనర్లు
» హాజరు సంతకంపై వివాదం
» కమిషనర్లకు జీతాలు ఆపిన వైనం
» సూపరింటెండెంట్‌తో సభ్యుల వాగ్వాదం

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమిషనరేట్‌లో చీఫ్ కమిషనర్ వర్సెస్ కమిషనర్లు అన్నట్టుగా విభేదాలు బయటపడ్డాయి. కార్యాలయంలో జరిగిన రచ్చ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మంగళగిరిలో ఉన్న రాష్ట్ర ఆర్టీఐ కమిషనరేట్‌లో చీఫ్ కమిషనర్‌గా ఆర్ఎం బాషా, సభ్యులుగా గత వైసీపీ ప్రభుత్వం నియమించిన రెహానా, శామ్యూల్ జాన్ తదితరులు ఉన్నారు. ప్రభుత్వ సెలవులు మినహా ఇతర పనిరోజుల్లో కమిషనర్లు ఆఫీసుకు వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిష్కరించాలి. విధుల్లో భాగంగా కమిషనర్లు పర్యటనలకు కూడా వెళ్తుంటారు. కార్యాలయంలోని హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయని వారికి జీతాలు ఇవ్వొద్దంటూ చీఫ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలను కార్యాలయంలోని సూపరింటెండెంట్ అమలు చేశారు. ఈ విషయంపై సూపరింటెండెంట్‌ను సభ్యులు నిలదీశారు. వైసీపీ ప్రభుత్వం మారాక కొందరు సభ్యులు ఆటు వైపు రావడం లేదనేది కొందరి వాదన. అయితే తమపై వివక్ష చూపుతున్నారంటూ రెహానా, శామ్యూల్ జాన్‌తో పాటు వైసీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రవీంద్ర రెడ్డి.. సూపరింటెండెంట్‌తో వాగ్వాదానికి దిగారు. తమకు ఫర్నిచర్ కొనలేదని, ఇప్పుడు జీతాలు ఆపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలకు వెళ్లినపుడు రిజిస్టర్‌లో హాజరు సంతకం నుంచి మినహాయింపు ఉంటుందని, గతంలో కూడా వర్తించేదన్నది సభ్యుల వాదన. ఈ వివాదంలో సూపరింటెండెంట్ నలిగిపోయారు. తాను నిబంధనల ప్రకారం చీఫ్ కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తానని అన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా తాను ఏ నిర్ణయమూ తీసుకోలేనని, ఏ పద్దు కింద నిధులు ఉంటే దానికి ఖర్చు చేయడం మినహా ఇతర అవసరాలకు వినియోగించే అధికారం తనకులేదని చెప్పారు.

వర్సిటీలు, కాలేజీల్లో డ్రగ్స్‌పై అవగాహన

» సంబంధ్ హెల్త్ ఫౌండేషన్‌తో ఉన్నత విద్యాశాఖ ఒప్పందం
» లాభాపేక్ష లేనిదంటూనే రూ.21లక్షలు ఇవ్వాలని ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో డ్రగ్స్, పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు హరియాణాకు చెందిన సంబంధ్ హెల్త్ ఫౌండేషన్‌తో ఒప్పందానికి ఉన్నత విద్యాశాఖ నిర్ణయించింది. ఎంఓయూకు అనుమతిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. డ్రగ్స్, పొగాకుపై వ్యాప్తిని అరికట్టడంపై ఆ ఫౌండేషన్ కంటెంట్ తయారు చేస్తుందని తెలిపారు. దీనిపై ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అలాగే, కాలేజీల వారీగా వారు చేపడుతున్న చర్యలను పర్యవేక్షిస్తారని, ఆన్‌లైన్‌లో పరిశీలన చేస్తారని తెలిపారు. ఒక్కో కాలేజీని ఒక్కో యూనిట్‌గా తీసుకుని యూనిట్‌కు రూ.650 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొత్తంగా 20.61లక్షలు ఆ సంస్థకు ఇవ్వాలని ఉన్నత విద్యామండలిని ఆదేశించారు. సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ లాభాపేక్ష లేని సంస్థ అని చెబుతూనే ఈ మేరకు నగదు చెల్లించాలనడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యాప్‌లు తయారు చేసి ఆన్‌లైన్‌లో కంటెంట్ తయారుచేయడానికి ఇంత ఖర్చవుతుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

కొత్త మద్యం పాలసీకి సిద్ధం కావాలి

» ప్రభుత్వ షాపుల ఆస్తులపై చర్యలు తీసుకోవాలి: ఎక్సైజ్ శాఖ డైరెక్టర్

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ అమలుకు అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, డిపోల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిపోలు, షాపుల్లో ఉన్న స్టాకును ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. కొత్త పాలసీ వచ్చేవరకూ ప్రభుత్వ మద్యం షాపులు సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. పెండింగ్ కేసులు, విచారణలో ఉన్న కేసులను తమకు నివేదించాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది బదిలీల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో ప్రైవేటు షాపుల పాలసీ వస్తున్నందున ఆస్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ షాపుల్లో ఉన్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, పీఓఎస్ మెషీన్లు, నగదు భద్రతా బీరువాలు, రిఫ్రిజిరేటర్ల జాబితాలు సిద్ధం చేయాలని, దీనికి ఎస్‌హెచ్‌ఓలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

100 రోజుల్లో ప్రతిపక్షంగా వైసీపీ ఫెయిల్: యనమల

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా జగన్‌రెడ్డికి ప్రజల గోడు పట్టదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. వంద రోజుల్లో జగన్ ఏపీలో కంటే బెంగళూరు యలహంక ప్యాలెస్‌లోనే ఎక్కువ రోజులున్నాడని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని భరించలేక శాంతిభద్రతల సమస్యలు సృష్టించి, అరాచక మూకల్ని రెచ్చగొట్టి, చివరికి లా అండ్ ఆర్డర్ విఫలమైందని ఆరోపించడం గుడ్డ కాల్చి ముఖాన వేయడం కాదా? ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, కుంభకోణాల గుట్టును ఏడు శ్వేతపత్రాలతో కూటమి ప్రభుత్వం రట్టు చేసింది. ఈ 100 రోజుల్లో ప్రతిపక్షంగా వైసీపీ విఫలమయింది. ఉత్తరాంధ్రలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, రాయలసీమలో పెద్దిరెడ్డి అరాచకాలన్నీ ప్రజలే ముందుకొచ్చి బయటపెడుతున్నారు. ప్రతి రోజూ వందలాది మంది వైసీపీ బాధితులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు మొరపెట్టుకుంటున్నారు. పుష్కరం నిండకుండానే వైసీపీ కాలగర్భంలో కలిసే రోజు మరెంతో దూరంలో లేదు. 'చేసుకున్నోడికి చేసుకున్నంత మహాదేవ' అన్న సామెత జగన్‌కు సరిగ్గా వర్తిస్తుంది" అని యనమల పేర్కొన్నారు.

'హౌసింగ్'లో నేటికీ

వైసీపీ అధికారులదే హవా!

కూటమి ప్రభుత్వంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహారాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా గృహ నిర్మాణ సంస్థ పనితీరులో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. గత ఐదేళ్లుగా కార్పొరేషన్‌లో క్షేత్ర స్థాయి నుంచి పైస్థాయి వరకు వైసీపీ సానుభూతిపరులుగా ముద్రపడిన అధికారులే ఇప్పటికీ చక్రం తిప్పుతున్నారు. విజయవాడలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్, ఇంజినీరింగ్, ఫైనాన్స్ విభాగాల్లో జగన్ భక్త అధికారులే ఇప్పటికీ కీలక స్థానాల్లో ఉన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు, కార్పొరేషన్ ఉద్యోగుల సర్వీస్ అంశాలలో వైసీపీ అధికారుల కోటరీ అడ్డగోలు వ్యవహారాలు సాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రిటైర్డ్ ఉద్యోగులకు రూ.కోట్లలో బకాయిలు

హౌసింగ్ కార్పొరేషన్‌లో రిటైరైన ఉద్యోగులకు జగన్ జమానాలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేదు. రాష్ట్రంలోని 324 మంది రిటైర్డ్ ఉద్యోగులకు దాదాపు రూ.45 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇది కాకుండా రిటైర్డ్ ఉద్యోగులకు 10 నెలలకు సంబంధించిన ఈఎల్ పేమెంట్స్ కూడా పెండింగ్‌లో పెట్టింది. ఈ బకాయిలు రూ.60 కోట్లకు పైగా ఉంటాయని రిటైర్డ్ ఉద్యోగులు చెబుతున్నారు. మొత్తం రూ.100 కోట్లకు పైగానే బకాయిలు పేరుకుపోయాయి. కొందరు రిటైర్డ్ ఉద్యోగులు బెనిఫిట్ సొమ్ములు తీసుకోకుండానే చనిపోయారు. పెద్ద మొత్తాల్లో ముడుపులు చెల్లించినవారి ఫైళ్లు కదులుతున్నాయని, ముడుపులు ఇచ్చుకోలేనివారిని పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. చిత్తూరు, నెల్లూరు తదితర జిల్లాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద అనర్హులకు రూ.లక్షలు దోచిపెట్టారని, వీటిపై విచారణ జరపాలని కోరుతున్నారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పాతుకుపోయిన జగన్ భక్త అధికారులు తమకు కావలసిన ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా బిల్లుల చెల్లిస్తున్నారని చెబుతున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఒక డీఈకి నిబంధనల ప్రకారం ఒక్క ఇంక్రిమెంట్ మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. ఒకేసారి మూడు ఇంక్రిమెంట్లు ఇచ్చి.. దాదాపు రూ.3.76 లక్షల మేర అప్పనంగా దోచిపెట్టారని సమాచారం. ఇటీవలే పదవీ విరమణ చేసిన మరో ఇద్దరు జనరల్ మేనేజర్లు, ఒక మేనేజరుకు నిబంధనలకు విరుద్ధంగా స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇచ్చేసి సంస్థ ఖజానాకు రూ. లక్షల్లో నష్టం చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి.

వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులకూ ఓకే..

గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల కుటుంబ సంస్థలు, వారి అనుయాయులకు నిబంధనలకు విరుద్ధంగా పేదల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టులు కట్టబెట్టారు. ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టకుండానే అడ్వాన్సులుగా రూ.వేల కోట్లు దోచిపెట్టారు. రూ.వందల కోట్ల విలువైన సిమెంటు, స్టీలు, ఇసుకను పప్పు బెల్లాలుగా పంచిపెట్టేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కూడా హౌసింగ్ కార్పొరేషన్‌లో జగన్ భక్త అధికారుల హవా కొనసాగుతుండటంతో ఇప్పటికీ వైసీపీ నేతలు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు తదితర పనులు చకచకా జరిగిపోతున్నాయని చెబుతున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడికి చెందిన 'రాక్రీట్' నిర్మాణ సంస్థకు ఏడు జిల్లాల్లో 51,633 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును టెండరు లేకుండానే గత వైసీపీ ప్రభుత్వం అప్పగించగా.. ఆ సంస్థ పనులు పూర్తి చేయకముందే హౌసింగ్ అధికారులు ఆ సంస్థకు రూ.325 కోట్లు ముందుగానే చెల్లించేశారు. దీనిపై విచారించిన విజిలెన్స్ అధికారులు...రాక్రీట్ సంస్థ నుంచి సొమ్మును రికవరీ చేయాలంటూ ఇటీవలే నివేదిక ఇచ్చారు. కాగా, జగన్ సర్కారులో కార్పొరేషన్ బోర్డు చైర్మన్‌తోపాటు మరో 15 మందిని డైరెక్టర్లుగా వైసీపీ నాయకులనే నియమించి నెలకు రూ.15 వేలు చొప్పున గౌరవ వేతనాలుగా ఇచ్చేవారు. ప్రభుత్వం మారవడంతో వారు రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం గత నెలలో బడ్జెట్ విడుదల చేయడంతో ఉద్యోగులతోపాటు వారికీ 3 నెలల బకాయి వేతనాలు చెల్లించారు.

నిరుపయోగంగా స్టేట్ ఫుడ్ లేబొరేటరీ!

» ప్రధాని ప్రారంభించి నెలలు గడుస్తున్నా అందుబాటులోకి తీసుకురాని అధికారులు
» ప్రైవేటు ల్యాబ్‌లకు నమూనాలు...
» ఒక్కొక్క టెస్ట్‌కు 15 నుంచి 20 వేలు చెల్లింపు
» వారి నుంచి భారీగా కమీషన్లు
» తిరుపతిలో కల్తీ నెయ్యి వ్యవహారంతో రాష్ట్ర ఆహార పరీక్షా కేంద్రంపై చర్చ



ల్యాబ్ కోసం విశాఖలో నిర్మించిన భవనం

విశాఖపట్నం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యి కల్తీ అయిందని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) రిపోర్టు ఇచ్చింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టెస్టింగ్ ల్యాబ్స్ గురించి ప్రస్తుతం చర్చ జరుగుతోంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం రూ.30 కోట్లతో ల్యాబ్‌ను మంజూరు చేసింది. విశాఖ నగరం, పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ఈ ల్యాబ్‌ను ఆర్నెల్ల కిందట ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే ఇప్పటికీ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. ల్యాబ్ నిర్వహణ కోసం పోస్టులనూ భర్తీచేయలేదు. కాగా, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీని నియంత్రించేందుకు రాష్ట్రస్థాయిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ పనిచేస్తోంది. ఈ డిపార్టుమెంట్ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరిస్తుంది. ఆ నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించాలి. అలాగే రాష్ట్రస్థాయిలో ఎప్పటికప్పుడు నమూనాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సేకరిస్తుంటారు. ఈ నమూనాలను సాధారణంగా ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఉన్న ల్యాబ్‌కు పంపించి తనిఖీలు చేయిస్తుండేవారు. అందుకు అయ్యే ఖర్చు తక్కువగా ఉండేది. కానీ, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో పని చేసే ఒకరిద్దరు అధికారులు స్పెషల్ డ్రైవ్ పేరుతో సేకరించిన నమూనాలను హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లోని ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. ఆయా ల్యాబ్‌లు ఒక్కో టెస్టుకు కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నాయి. ఈ మొత్తాన్ని ల్యాబ్ నిర్వహణకు కేంద్రం మంజూరు చేసిన నిధుల నుంచి చెల్లిస్తున్నారు. అందుకుగాను అధికారులకు సదరు ల్యాబ్‌ల నిర్వాహకుల నుంచి భారీగా కమీషన్లు అందుతున్నట్టు చెబుతున్నారు. ఈ కమీషన్లకు కక్కుర్తిపడే ఉన్నతాధికారులు విశాఖలో ప్రారంభమైన స్టేట్ ఫుడ్ లేబొరేటరీని అందుబాటులోకి రాకుండా చేస్తున్నారని చెబుతున్నారు. స్టేట్ ఫుడ్ లేబొరేటరీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దేవస్థానాల్లో లడ్డూ, పులిహోర, ఇతర ప్రసాదాలు తయారీకి వినియోగించే ఉత్పత్తులు (నెయ్యి వంటివి) కూడా తనిఖీ చేసేందుకు అవకాశం ఉంటుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది.

ఆహార భద్రత అధ్వానం!

» ఐదేళ్లుగా ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్‌లో అట్టడుగున ఏపీ.. ఈ ఏడాదీ అంతే..

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఆహార భద్రత, ప్రమాణాలు అధ్వానంగా ఉంటున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ స్వయంగా వెల్లడించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ ప్రకారం ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలపై ఉంది. ఈ ప్రక్రియను సమర్థంగా నిర్వర్తించేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పనిచేస్తుంది. ప్రజల ఆహార భద్రతకు సంబంధించి రాష్ట్రాలు తీసుకునే చర్యలు, నాణ్యతకు సంబంధించి అనుసరిస్తున్న విధానాలు, ఆహార నమూనాల పరీక్ష వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని స్టేట్ ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్ పేరుతో 2019 నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏటా ర్యాంకులు విడుదల చేస్తూ వస్తోంది. అయితే తొలి ఏడాది నుంచి ఇప్పటివరకూ రాష్ట్రం కనీస స్థాయిలో కూడా ప్రదర్శన చేయలేక చతికిలబడుతోంది. ర్యాంకుల జాబితాలో కింది నుంచి రెండు, మూడు స్థానాల్లో నిలుస్తూ తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఈ ఏడాది కూడా వందకు 27 పాయింట్లే సాధించి అట్టడుగు స్థానంలో నిలిచింది.

ర్యాంకుల కేటాయింపు ఇలా..

ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏటా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని.. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాలకు వేర్వేరుగా ఈ ర్యాంకులు కేటాయిస్తుంది. మానవ వనరులు, సంస్థాగత సమాచారానికి 20 పాయింట్లు కేటాయించింది. ఈ అంశంలో ప్రధానంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఇతర ఉన్నతాధికారుల సంఖ్య, ఖాళీలకు అనుగుణంగా సిబ్బంది ఉన్నారా...? అనే విషయాలను పరిశీలిస్తుంది. అలాగే, అప్పిలేట్ ట్రైబ్యునల్స్, జిల్లా/రాష్ట్ర స్థాయిల్లో స్క్రీనింగ్ కమిటీల నియామకం, కేసుల నమోదు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న సమయం వంటి అంశాలనూ పరిశీలిస్తుంది. ఆహార ఉత్పత్తుల విక్రయ సంస్థలకు లైసెన్సులు మంజూరు, రిజిస్ట్రేషన్, రెన్యువల్, ప్రత్యేక డ్రైవ్‌లు, క్యాంపుల నిర్వహణ ద్వారా ప్రజల్లో ఆహార ఉత్పత్తులు కల్తీ, నాణ్యత దెబ్బతినేలా చేసే అంశాలపై అవగాహన కల్పించడం, హానికర ఆహార ఉత్పత్తులు తయారుచేసే సంస్థలను నిరంతరం తనిఖీ చేసి, నమూనాలు సేకరించి పరీక్షలకు పంపడం.. వంటి వాటికి మరో 30 పాయింట్లు కేటాయిస్తుంది. ఆహార ఉత్పత్తుల తనిఖీ సామర్థ్యం, మౌలిక వసతులకు సంబంధించి మరో 20 పాయింట్లు ఇస్తుంది. ఈ అంశంలో రాష్ట్రంలో ఉన్న టెస్టింగ్ సదుపాయాలు, ల్యాబ్‌ల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణ, నమూనాల సేకరణ, ల్యాబ్‌కు ఎన్ఏబీఎల్ అక్రెడిటేషన్, సిబ్బంది నైపుణ్యం వంటి వివరాలను పరిశీలిస్తుంది. ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్‌కు మరో 10 పాయింట్లు కేటాయిస్తుంది. ఇందులో సిబ్బందికి నిరంతరం శిక్షణ, వర్క్‌షాపుల నిర్వహణ, పనితీరును బట్టి మార్కులు కేటాయిస్తుంది. వినియోగదారుల సాధికారితకు సంబంధించి మరో 20 పాయింట్లు కేటాయించింది. ఈ వంద పాయింట్లకు గానూ ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్లలో ఎప్పుడూ కనీసం 50 కూడా దాటలేదు.

సాధించిన ర్యాంకులు ఇవే..

ఎఫ్ఎస్ఎస్ఏఐ తొలిసారిగా 2019-20లో... 20 రాష్ట్రాలతో కూడిన జాబితాను విడుదల చేయగా.. అందులో ఏపీ 42 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచింది. 2020-21లో 36 పాయింట్లు సాధించి 19వ స్థానంలో దక్కించుకుంది. 2021-22లో 17 రాష్ట్రాలతో కూడిన జాబితాలోనూ 26 పాయింట్లతో అట్టడుగున నిలిచింది. 2022-23లో 19 రాష్ట్రాలతో కూడిన జాబితాలో 24 పాయింట్లకే పరిమితమై 18వ స్థానంతో సరిపెట్టుకుంది. 2023-24లోనూ 27 పాయింట్లతో మరోసారి అట్టడుగు స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో పరీక్షలు నిర్వహణకు అవసరమైన ల్యాబ్ లేకపోవడం, సిబ్బంది ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఉన్న సిబ్బంది పనితీరు అంతంత మాత్రంగానే ఉండడంతో రాష్ట్రం అట్టడుగున నిలుస్తూ వస్తోంది.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి: అశోక్‌బాబు

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పట్టభద్రులంతా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పార్టీ కార్యకర్తలకు ఓటరు నమోదు కార్యక్రమం గురించి వివరించినట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబరు 6 వరకు కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా తగిన ధ్రువీకరణపత్రాలతో ఎంఆర్‌వో కార్యాలయం ద్వారా ఫారం 18 దాఖలు చేసి ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు కావడానికి జూన్ 2021 లోపు డిగ్రీ ఉత్తీర్ణత పొంది ఉండాలని స్పష్టం చేశారు.



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా- స్టూడెంట్ నమోదు సహా తదుపరి యాక్చూరియల్ ఎగ్జామ్స్ రాసేందుకు ఉద్దేశించిన 'యాక్చూరియల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏసెట్) 2024 అక్టోబరు సెషన్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఎగ్జామ్‌కు సంబంధించిన వివరాలను అభ్యర్థుల ఈ మెయిల్స్‌కు పంపుతారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం సంస్థ మాక్ టెస్టులు కూడా నిర్వహిస్తుంది. గత ఆరేళ్ల ప్రశ్న పత్రాలు, వాటి సమాధానాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏసెట్ స్కోర్ వ్యాలిడిటీ మూడేళ్లు.

ఏసెట్ అక్టోబరు సెషన్ నోటిఫికేషన్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా చదివిన వారికి; ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులు చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఏసెట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, డేటా ఇంట్రప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. ఒక మార్కు ప్రశ్నలు 45, రెండు మార్కుల ప్రశ్నలు 20, మూడు మార్కుల ప్రశ్నలు 5 అడుగుతారు. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 30 మార్కులకు; డేటా ఇంట్రప్రిటేషన్, ఇంగ్లీష్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 15 మార్కులకు; లాజికల్ రీజనింగ్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ఏసెట్ నిర్వహణ
- ఇది హోమ్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. ఈ పరీక్ష రాయదలచుకొన్న అభ్యర్థులు సంస్థ నిర్దేశించిన మేరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందుబాటులో ఉంచుకోవాలి.
- హార్డ్‌వేర్‌కు సంబంధించి పర్సనల్ ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్, 640x480 @ 15fps రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, 1 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వైర్డ్/వైర్‌లెస్ ఇంటర్నెట్, 2 జీబీ ర్యామ్, 2 కోర్స్-4 థ్రెడ్స్-2.2 గిగా హెర్ట్జ్ ప్రాసెసర్, 64 ఎంబీ గ్రాఫిక్స్ మెమరీ, 1024x768 కంటే తక్కువ కాకుండా స్క్రీన్ రిజల్యూషన్, మల్టీ మీడియా సపోర్ట్ ఉన్న సౌండ్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలి.
- సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి విండోస్ 10/8/7 ఆపరేటింగ్ సిస్టమ్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్, 4.5.2 నెట్ ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రాసే సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/పాన్ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **ఏసెట్ 2024 అక్టోబరు సెషన్ తేదీ:** అక్టోబరు 13
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 18
- **వెబ్‌సైట్:** www.actuariesindia.org

సీటీటీసీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్(సీటీటీసీ)- ఉచిత శిక్షణ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. వీటిని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) స్పాన్సర్ చేస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీఎన్‌సీ ఆపరేటర్
- సీఎన్‌సీ ఆపరేటర్ టర్నింగ్ ప్రోగ్రామ్‌లో 300 సీట్లు, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ ప్రోగ్రామ్‌లో 250 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** (ఐటీఐ/డిప్లొమా)(మెకానికల్/ఫిట్టర్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సీఎన్‌సీ ప్రోగ్రామర్
- ఇందులో 210 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** (డిప్లొమా/బీఈ/బీటెక్)(మెకానికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **అభ్యర్థుల వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 22
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ట్రెయినింగ్ ఇన్‌ఛార్జ్, సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్, బీ-36, చందక ఇండస్ట్రియల్ ఏరియా, భువనేశ్వర్-751024
- **వెబ్‌సైట్:** www.cttc.gov.in



తెలంగాణ బీసీ మహిళా గురుకులాల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలలు అందిస్తున్న బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వనపర్తి అగ్రికల్చరల్ కాలేజ్, కరీంనగర్ అగ్రికల్చరల్ కాలేజీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఒక్కో కాలేజీలో 120 సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 స్కోర్ ప్రకారం 85 శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 స్కోర్ ద్వారా భర్తీ చేస్తారు. అంటే తెలంగాణ ఈఏపీసెట్ 2024 అభ్యర్థులకు 102 సీట్లు, పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 అభ్యర్థులకు 18 సీట్లు కేటాయించారు. బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసీ/ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం, అనాథలకు 3 శాతం సీట్లు నిర్దేశించారు. రాష్ట్రానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు లేదా పీజేటీఎస్ఏయూ నుంచి రెండేళ్ల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024(బైపీసీ స్ట్రీమ్) లేదా పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థి వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** అక్టోబరు 11 నుంచి 12 వరకు
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

ఐసర్ భోపాల్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు
- నేచురల్ సైన్సెస్ స్ట్రీమ్- బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిజిక్స్
- ఇంజనీరింగ్ సైన్సెస్ స్ట్రీమ్- కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్ట్రీమ్- ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్, సోషల్ వర్క్ అండ్ సోషియాలజీ)

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంఏ ఉత్తీర్ణులు; ఎంసీఏ/బీఈ/బీటెక్/బీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ఇన్‌స్పయిర్ జేఆర్ఎఫ్/రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్/సీఎస్ఐఆర్ ఎల్ఎస్/యూజీసీ ఎల్ఎస్ అర్హత తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్ అలాగే ఐసర్ల నుంచి బీఎస్ - ఎంఎస్ పూర్తిచేసినవారికి గేట్/ఫెలోషిప్ అర్హత అవసరం లేదు. మెడికల్ సంబంధిత స్పెషలైజేషన్‌లకు ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి 28 ఏళ్లు మించకూడదు. విదేశీ విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయిల్లో 60 శాతం మార్కులు ఉండాలి. జీఆర్ఈ జనరల్ టెస్ట్‌లో 280 స్కోర్/గేట్ వ్యాలిడ్ స్కోర్, టోఫెల్‌లో 60 స్కోర్/ఐఈఎల్‌టీఎస్‌లో 6 స్కోర్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 14
- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/doaa/admission



నేషనల్ ఆర్కైవ్స్‌లో స్పెషల్ ట్రెయినింగ్

నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ ఆర్కైవల్ స్టడీస్- స్పెషల్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ ఇన్ రిపైర్ ఆఫ్ రికార్డ్స్‌ను అందిస్తోంది. కోర్సు వ్యవధి 11 రోజులు. ఇందులో మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులో రికార్డులను అరేంజ్ చేయడం, రీ స్టోరేషన్, రిపైర్ చేయడం తదితర ప్రక్రియలను నేర్పిస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 30 ఏళ్లు మించకూడదు. ఇంగ్లీష్, హిందీ బాషల్లో ప్రావీణ్యం తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- కోర్సు ఫీజు: రూ.300
- దరఖాస్తు ఫీజు: రూ.100
- దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ: సెప్టెంబరు 30
- వెబ్‌సైట్: nationalarchives.nic.in

నిట్ ఆంధ్రప్రదేశ్‌లో టీచింగ్ ఫ్యాకల్టీ

ఖాళీలు: 125

తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2(కాంట్రాక్ట్): **48 పోస్టులు**
2. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2(కాంట్రాక్ట్): **20 పోస్టులు**
3. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1: **20 పోస్టులు**
4. అసోసియేట్ ప్రొఫెసర్: **30 పోస్టులు**
5. ప్రొఫెసర్: **7 పోస్టులు**

విభాగాలు: బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్.

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 35 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, ప్రొఫెసర్ పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: టీచింగ్ డిమాన్‌స్ట్రేషన్/రీసెర్చ్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10

వెబ్‌సైట్: https://www.nitandhra.ac.in/

డీఆర్‌డీవోలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 200

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్‌సీఐ)..కింద పేర్కొన్న అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **40**
2. టెక్నీషియన్ అప్రెంటిస్: **40**
3. ట్రేడ్ అప్రెంటిస్: **120**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, కెమికల్, కమర్షియల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్ తదితరాలు



అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

అప్రెంటిస్‌షిప్ కాలం: ఒక సంవత్సరం

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

జాబ్ కార్నర్

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రాజెక్ట్ ఇంజనీర్-1(ఎలక్ట్రానిక్స్/మెకానికల్): **5 పోస్టులు**

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు మొదటి ఏడాది రూ.40,000; రెండో ఏడాది రూ.45,000; మూడో ఏడాది రూ.50,000; నాలుగో ఏడాది రూ.55,000 చెల్లిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 2

వెబ్‌సైట్: https://bel-india.in/

విద్యార్థి

కష్టార్జితం విలువ

వెంకటాపురంలో శ్రీధర్ అనే యువకుడు ఉండేవాడు.అతను విద్యావంతుడే అయినా, ఏపనీ చేయకుండా సోమరిగా తిరిగేవాడు. అతని ఈడు స్నేహితులంతా పెళ్లి చేసుకుని స్థిరపడటం చూసి అతను తన తండ్రి వద్దకువెళ్లి తనకు కూడా పెళ్లి చేయమని అడిగాడు. దానికి అతని తండ్రి నువ్వు పదివేల రూపాయలు 'తీసుకువచ్చి, నాకు ఇస్తే, నీకు పెళ్లి చేస్తాను అని చెప్పాడు. ఓ... అదెంత పని? అనుకున్న శ్రీధర్ ఆ రోజే ధనవంతుడైన తన మిత్రుని దగ్గరకు వెళ్లి పదివేల రూపాయలు తీసుకొచ్చి, తండ్రి చేతికి ఇచ్చాడు. అయితే, అయన ఆ డబ్బును తీసుకుని, ఇది పనికిరాదు అంటూ నీళ్లలోకి విసిరేశాడు. తండ్రి చేసిన పనికి బాధ పడిన శ్రీధర్ ఆ మర్నాడు తన తల్లిని అడిగి,మరో పదివేల రూపాయలు తెచ్చి, తండ్రి చేతికి ఇచ్చాడు. ఆయన అంతకు ముందు లాగే ఈ డబ్బు కూడా పనికిరాదు అంటూ ఆ డబ్బును నీళ్లలోకి విసిరేసాడు. ఆ తరువాత మరో పదిహేను రోజులకు మరలా పదివేల రూపాయలు తెచ్చి, తండ్రి చేతిలో పెట్టాడు. యథా ప్రకారం తండ్రి ఆ డబ్బును పారవేయబోతుంటే, వెంటనే తండ్రి చేయి పట్టుకుని ఆపి ఇలా అన్నాడు.



' ఆగండి నాన్నా.. పారవేయకండి, ఇది నేను రెండు వారాలు కష్టపడి పనిచేస్తే వచ్చిన డబ్బు అన్నాడు.

ఆ మాటలు విన్న ఆయన 'చూసావా ఇంతకు ముందు నేను డబ్బు పారవేసిన రెండు సార్లు నీకు ఇంత బాధ అనిపించలేదు కారణం ఆ డబ్బు నువ్వు కష్టపడి సంపాదించింది కాకపోవడమే. ఇపుడు డబ్బు పారవేయబోతుంటే నన్ను ఆపావు ఇది కష్టార్జితం కాబట్టి. ఈ విషయం నీకు తెలియాలనే నిన్ను పరీక్షించాను. ఇపుడు నాకు నమ్మకం కుదిరింది.


నువ్వు నీ కుటుంబాన్ని పోషించుకోగలవు.ఇక నీకు పెళ్లి చేస్తాను' అని చెప్పి, నెల తిరిగేలోగా శ్రీధర్ కు ఘనంగా వివాహం జరిపించాడు.

6 తేడాలను కనిపెట్టండి





సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 421

	3	6	5	4				7
			7					
7	8	5				6		
		3		7		4	9	
9				2				5
	6	8		9		7		
		1				8	4	9
					9			
8				1	4	5	3	

సుడోకు - 420 సమాధానం

1	3	6	5	4	2	9	8	7
4	9	2	7	8	6	1	5	3
7	8	5	9	3	1	6	2	4
2	1	3	6	7	5	4	9	8
9	4	7	1	2	8	3	6	5
5	6	8	4	9	3	7	1	2
6	2	1	3	5	7	8	4	9
3	5	4	8	6	9	2	7	1
8	7	9	2	1	4	5	3	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.